PRAJASAKTI Regd.No. 15795/68

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 43 సంచిక : 307 | విజయవాడ, మంగళవారం 11 జూన్ 2024 | 8 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Tuesday 11 June 2024 | Rs

సీనియర్లకు పాత శాఖలే

- 30 మందికి కేబినెట్, ఐదుగురికి స్వతంత్ర హోదా
- మరో 36 మందికి సహాయ మంత్రి పదవులు
- రామ్మోహన్‌నాయుడుకు విమానయానశాఖ

7

ఆ గెలుపు చిరస్మరణీయం

- పాకిస్తాన్‌పై గెలుపుతో టాప్‌లోకి టీమిండియా
- బుమ్రాకు కెప్టెన్ ప్రశంసలు

8



పిఎం కిసాన్‌పై తొలి సంతకం

అధికారిక బాధ్యతలు స్వీకరించిన మోడీ • మరో 3 కోట్ల ఇళ్ల నిర్మాణానికి తొలి కేబినెట్ ఆమోదం

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ప్రధానిగా వరుసగా మూడోసారి బాధ్యతలు చేపట్టిన తరువాత నరేంద్ర మోడీ 'ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి' 17వ విడత నిధుల విడుదల ఫైలుపై తొలి సంతకం చేశారు. రూ.20 వేల కోట్లను 9.3 కోట్ల మంది రైతుల ఖాతాల్లో జమచేయనున్నారు. ఫైలుపై సంతకం చేసిన అనంతరం ప్రధాని మోడీ మాట్లాడుతూ రైతుల సంక్షేమానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని, అందుకోసం తమవంతు కృషి చేస్తామని తెలిపారు.

ప్రధానిగా అధికారిక బాధ్యతలు చేపట్టిన మోడీ

దేశ ప్రధానమంత్రిగా వరుసగా మూడోసారి నరేంద్ర మోడీ బాధ్యతలు స్వీకరించారు. రాష్ట్రపతి భవన్‌లో ఆదివారం రాత్రి ప్రమాణ స్వీకారం చేసిన ఆయన, సోమవారం అధికారికంగా బాధ్యతలు చేపట్టారు. సౌత్ బ్లాక్‌లోని ప్రధాన మంత్రి కార్యాలయం (పిఎంఓ)లో మోడీ బాధ్యతలు స్వీకరించారు. అనంతరం కేంద్ర మంత్రివర్గం సమావేశమైంది.

పిఎంఎవై కింద మరో 3 కోట్ల ఇళ్ల నిర్మాణం : తొలి మంత్రివర్గం ఆమోదం

ప్రధాన మంత్రి ఆవాస్ యోజన (పిఎంఎవై) కింద పేదలకు మరో మూడు కోట్ల ఇళ్ల నిర్మాణానికి సాయం అందించేందుకు కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ప్రధానిగా మోడీ బాధ్యతలు స్వీకరించిన తరువాత తొలి మంత్రివర్గం సమావేశం 7 లోక్‌కల్యాణ్ మార్గ్‌లోని ప్రధానమంత్రి నివాసంలో సోమవారం సాయంత్రం 5 గంటలకు జరిగింది. మోడీ మంత్రివర్గ సహచరులంతా ఈ సమావేశానికి హాజరయ్యారు. అమిత్‌షా, రాజ్‌నాథ్ సింగ్, జెపి నడ్డా, నిర్మలా సీతారామన్, జ్యోతిరాదిత్య సింధియా, మనోహర్ లాల్ ఖట్టర్, కిరణ్ రిజిజు, చిరాగ్ పాశ్వాన్, గిరిరాజ్ సింగ్, మన్సుఖ్ మాండవీయ, హర్దీప్ సింగ్ పురి, కె.రామ్మోహన్ నాయుడు, జి.కిషన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కేబినెట్ సమావేశంలో ప్రధాని మోడీ

మళ్లీ పాత ప్లాను...!

'రాజధాని' అమరావతిపై నిర్ణయం • ప్రారంభమైన ప్రక్రియ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాజధాని అమరావతి నగర మాస్టర్‌ప్లానులో మళ్లీ మార్పులు జరగనున్నాయి. విశ్వసనీయ సమాచారం ప్రకారం పాతప్లానునే అమలు చేయాలని నూతన ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు సిఆర్‌డిఎ అధికారులకు స్పష్టమైన ఆదేశాలు కూడా అందినట్లు సమాచారం. దీంతో ఈ దిశలో అవసరమైన ప్రక్రియను సిఆర్‌డిఎ అధికారులు ఇప్పటికే ప్రారంభించినట్లు తెలిసింది. దీనిలో భాగంగానే రెండు, మూడు రోజులుగా సిఆర్‌డిఎ అధికారులు రాజధాని ప్రాంతంలో విస్తృతంగా తిరుగుతున్నట్లు చెబుతున్నారు. ఎన్నికల ఫలితాలు వెలువడిన మరుసటిరోజే టిడిపి అధినేత, కాబోయే రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఈ విషయమై దృష్టి సారించినట్లు చెబుతున్నారు. తనను కలిసిన రాష్ట్ర ప్రభుత్వ, సిఆర్‌డిఎ అధికారులతో రాజధాని అంశం చర్చించిన ఆయన ఈ మేరకు దిశానిర్దేశం చేసినట్లు సమాచారం.

క్యాబినెట్ ముందుకు...!

గత ప్రభుత్వం ఖరారు చేసిన ప్లానును మార్చాలంటే మంత్రివర్గ సమావేశంలో తీర్మానం చేయాల్సిఉందని సమాచారం. దానికన్నా ముందు హైకోర్టులో పెద్ద సంఖ్యలో దాఖలై ఉన్న కేసులను పరిష్కరించుకోవాల్సిఉంది. వివాదాస్పదంగా మారిన ఆర్-5 జోన్‌పై రైతులు దాఖలు చేసిన పిటిషన్, దానిపై ప్రభుత్వం వ్యక్తం చేసిన అభ్యంతరాలను వెనక్కి తీసుకోవాల్సిఉంది. రైతులు పెట్టిన అనేక కేసులను కూడా ఉపసంహరించుకోవాల్సిఉంది. వివాదాలన్నీ పరిష్కారమైన తరువాతే క్యాబినెట్ ముందుకు కొత్త ప్రతిపాదన పెట్టి ఆమోదం పొందాల్సి ఉంటుందని అంటున్నారు. ఈ ప్రక్రియ పూర్తికావడానికి కనీసం 90 రోజులు పడుతుందని అంటున్నారు. కోర్టు కేసులతో సంబంధం లేకుండా క్యాబినెట్‌లో తీర్మానం చేసి, దానినే ధర్మాసనానికి నివేదించవచ్చన్న అభిప్రాయమూ వ్యక్తమవుతోంది.

గతంలో ఎం జరిగింది?

గతంలో టిడిపి ప్రభుత్వం ఆమోదించి అమలు చేసిన మాస్టర్‌ప్లానును వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత మార్చిన సంగతి తెలిసిందే. కొత్తగా ఆర్ 5 జోన్‌ను వైసిపి ప్రభుత్వం ఏర్పాటు చేసింది. దీనికోసం గతంలో ఉన్న ప్లాన్లను చాలా వరకూ మార్పు చేసింది. రాజధానిలో ఇళ్లు ఇస్తామనే పేరుతో పెద్దఎత్తున మార్పులు చేర్పులు చేయడంతోపాటు రోడ్లనూ సమూలంగా మిగతా 7లో



సిద్ధమవుతున్న సిఆర్‌డిఎ కార్యాలయ భవనం

సిఐటియు బలోపేతమే పర్సకు నిజమైన నివాళి

- సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం.ఎ.గఫూర్
- కర్నూలు, పుట్టపర్తిల్లో శత జయంతి ఉత్సవాలు

• లోపలి పేజీలో..•

నీట్ స్కామ్‌పై నిగ్గు తేల్చాలి

- ఎన్‌టిఎని రద్దు చేయాలి
- కేంద్ర విద్యాశాఖ కార్యాలయం ఎదుట ఎస్ఎఫ్ఐ ఆందోళన

హిందూత్వ - కార్పొరేట్ల బంధం, నిరంకుశత్వంపై

బలమైన పోరాటం

- **సిపిఎం పొలిట్‌బ్యూరో పిలుపు**

న్యూఢిల్లీ : పద్దెనిమిదవ లోక్‌సభ ఎన్నికల్లో బిజెపి మెజార్టీ కోల్పోయినప్పటికీ హిందూత్వ నిరంకుశ పోకడలు మరింత పెరిగే ప్రమాదముందని సిపిఎం పొలిట్‌బ్యూరో హెచ్చరించింది. అలాగే హిందూత్వ కార్పొరేట్ల బంధాన్ని అది మరింత పటిష్టపరచుకోవాలని చూస్తోందని, రానున్న రోజుల్లో మోడీ తన ఆధిపత్యాన్ని మరింత గట్టి పరచుకునేందుకు ప్రజల జీవనోపాధిపై ఫాసిస్టు తరహా దాడుల సాగించే ప్రమాదముందని, వీటికి వ్యతిరేకంగా సిపిఎం, ఇండియా బ్లాక్‌లోని భాగస్వాములంతా కలసి శాయశక్తులా పోరాడాలని పొలిట్‌బ్యూరో పిలుపునిచ్చింది. లోక్‌సభ, నాలుగు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల ఫలితాలపై సిపిఎం పొలిట్‌బ్యూరో ఆదివారం నాడిక్కడ సమావేశమై ప్రాథమికంగా సమీక్షించింది. సమావేశం అనంతరం ఈ మేరకు ఒక ప్రకటన విడుదలజేసింది. లోక్‌సభ ఎన్నికలు బిజెపికి గట్టి ఎదురుదెబ్బ అని పొలిట్‌బ్యూరో ఆ ప్రకటనలో పేర్కొంది.

రాజ్యాంగం, లౌకికవాద ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించుకునేందుకు భారత దేశ ప్రజలు ఈసారి బిజెపికి మెజార్టీ దక్కకుండా చేశారు. 2014, 2019 లోక్‌సభ ఎన్నికల్లో మెజారిటీ సాధించిన బిజెపి ఈ సారి మెజార్టీకి 32 సీట్ల దూరంలో ఉండిపోయింది. 400కి పైగా సీట్లు వస్తాయంటూ ఎన్నికల్లో ఊదరగొట్టిన బిజెపికి 240సీట్లు రావడమే గగనమైపోయింది. గత లోక్‌సభలో 303 స్థానాలున్న ఆ పార్టీకి ఈసారి 63 సీట్లు తగ్గాయి. అంటే 20శాతం మేర సీట్లు తగ్గాయన్న మాట. బిజెపికి సొంత మెజారిటీ కన్నా 32సీట్లు తగ్గాయి. మిత్రపక్షాలు అదనంగా 52సీట్లను గెలుచుకోవడంతో ఎన్‌డిఎకు 292 సీట్లు వచ్చాయి. అంటే మెజార్టీకి మించి 20 సీట్లే వచ్చాయి. ఇక ఇండియా బ్లాక్ 234సీట్లు గెలుచుకుంది. అంటే మెజారిటీకి 38సీట్లు మాత్రమే తక్కువ.. భారత ఎన్నికల మిగతా 7లో

బొత్సపై టిడిపి ఫిర్యాదు

- టీచర్ల బదిలీలతో రూ.కోట్లు దోచుకున్నారని ఆరోపణ

2

పోలీసు కస్టడీలో ఉండగా నాపై హత్యాయత్నం

- గుంటూరు ఎస్‌పికి రఘురామకృష్ణరాజు ఫిర్యాదు

3

నేడు, రేపు తేలికపాటి వర్షాలు

- విపత్తుల నిర్వహణ సంస్థ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

మరఠ్వాడా ప్రాంతంలో కొనసాగుతున్న ఉపరితల ఆవర్తనం ప్రభావంతో మంగళ, బుధవారాల్లో రాష్ట్రంలోని పలు జిల్లాల్లో పిడుగులతో కూడిన తేలికపాటి వర్షాలు పడే అవకాశం ఉంది. ఈ మేరకు విపత్తుల నిర్వహణ సంస్థ ఎమ్‌డి రోణంకి కూర్మనాథ్ సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ నెల 11న అల్లూరి సీతారామరాజు, కృష్ణా, గుంటూరు, పల్నాడు, ప్రకాశం, నెల్లూరు, కర్నూలు, నంద్యాల, అనంతపురం, శ్రీసత్యసాయి, వైఎస్ఆర్, అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో అక్కడక్కడ పిడుగులతో కూడిన తేలికపాటి వర్షాలు పడే అవకాశం ఉందని తెలిపారు. 12న నెల్లూరు, కర్నూలు, నంద్యాల, అనంతపురం, శ్రీసత్యసాయి, వైఎస్ఆర్ జిల్లాల్లో అక్కడక్కడ పిడుగులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు పడే అవకాశం ఉందన్నారు. ఏలూరు, కృష్ణా, ఎన్‌టిఆర్, గుంటూరు, బాపట్ల, పల్నాడు, ప్రకాశం, అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లోనూ తేలికపాటి వర్షాలు పడే అవకాశం ఉందన్నారు.

రాజకీయాలకు కేశినేని నాని గుడ్‌బై

ప్రజాశక్తి- విజయవాడ

విజయవాడ మాజీ ఎంపి కేశినేని శ్రీనివాస్ (నాని) రాజకీయాలకు గుడ్‌బై చెప్పారు. సార్వత్రిక ఎన్నికలకు ముందు ఆయన వైసిపిలో చేరారు. ఇటీవల జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో వైసిపి విజయవాడ ఎంపి అభ్యర్థిగా పోటీ చేసి టిడిపి అభ్యర్థి, తన సోదరుడు కేశినేని శివనాథ్ (చిన్ని) చేతిలో ఓటమిపాలయ్యారు. ఈ నేపథ్యంలో తన రాజకీయ ప్రయాణాన్ని ముగించినట్లు 'ఎక్స్' వేదికగా నాని ప్రకటించారు. అన్ని విధాలుగా ఆలోచించిన అనంతరం రాజకీయాలకు దూరంగా ఉండాలని నిర్ణయించుకున్నట్లు పేర్కొన్నారు. రాజకీయాలకు దూరంగా ఉన్నా విజయవాడ అభివృద్ధికి మద్దతు ఇస్తూనే ఉంటానన్నారు. తన రాజకీయ ప్రయాణంలో సహకరించిన ప్రతి ఒక్కరికీ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

విద్యుదాఘాతంతో అన్నదమ్ములు మృతి

ప్రజాశక్తి-గిద్దలూరు (ప్రకాశం జిల్లా)

విద్యుద్ఘాతానికి గురై ఇద్దరు అన్నదమ్ముళు మతిచెందిన ఘటన ప్రకాశం జిల్లాలో సోమవారం చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం... ప్రకాశం జిల్లా గిద్దలూరు మండలం ముండ్లపాడు గ్రామానికి చెందిన శీలం గోపీకృష్ణ శుభకార్యాలకు సామాన్లు సప్లయ్ చేస్తుంటారు. ఆయన కుమారులు శీలం లోహిత్ కృష్ణ (18) ఐటిఐ (ఎలక్ట్రికల్) ఫస్ట్‌ఇయర్, శీలం సాయి కృష్ణ (16) పదోతరగతి పూర్తి చేశారు. ఖాళీ సమయంలో తండ్రికి తోడుగా సప్లయర్స్ పనులలో సాయం చేస్తుంటారు. ఈ నేపథ్యంలో లోహిత్ కృష్ణ, సాయి కృష్ణ పట్టణంలోని హెచ్‌పి పెట్రోల్ బంకు సమీపంలోని ఓ శుభకార్యానికి సామాన్లు సప్లయ్ చేసి తిరిగి వాటిని తీసుకొని బయలుదేరారు. ఆ పక్కనే ఉన్న విద్యుత్ నీటి మోటారు వైర్లు సామాన్లు ఉన్న ఆటోకు తగిలి విద్యుత్ సరఫరా అయ్యింది. దీంతో ఆటోలో ఉన్న అన్నదమ్ములిద్ద రూ షాక్‌కు గురయ్యారు. వీరిద్దరినీ కుటుంబ సభ్య ఓలు ఓ ప్రయివేటు వైద్యశాలకు తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఘటనపై పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వైసిపి అధినేత జగన్‌తో నేతలు భేటీ

- భవిష్యత్తు కార్యాచరణపై చర్చ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

సార్వత్రిక ఎన్నికల్లో వైసిపి ఘోర పరాజయం పాలైన తర్వాత వైసిపి అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇంటి నుంచి బయటకు రాలేదు. ఈ నేపథ్యంలో ఎన్నికల్లో పోటీ చేసి ఓడిపోయిన అభ్యర్థులు, గెలిచినవారు సోమవారం క్యాంపు కార్యాలయంలో జగన్‌తో భేటీ అయ్యారు. ఓటమికి కారణాలపై విశ్లేషించారు. అనంతరం రాష్ట్ర వ్యాప్తంగా వైసిపి నేతలు, కార్యకర్తలపై దాడులు జరుగుతున్నాయని, వాటిని ఎలా ఎదుర్కోవాలనే అంశంపై కొద్దిసేపు చర్చించుకున్నట్లు సమాచారం. శాంతి భద్రతల సమస్యలపై ఇటీవల గవర్నరు, రాష్ట్రపతికి ఫిర్యాదులు చేసినా, ఎటువంటి స్పందన రాకపోవడం పట్ల నేతలు కొంత అసహనం వ్యక్తం చేసినట్లు సమాచారం. ఈ నెలలో జరగనున్న శాసనసభ సమావేశాల్లో పార్టీ ఫ్లోర్ లీడర్‌గా ఎవరిని నియమించాలనే అంశంపై చర్చించారు. చివరికి బద్వేలు ఎమ్మెల్యే సుధా పేరును నేతలు జగన్ వద్ద ప్రస్తావించగా, ఆయన కూడా సుముఖత వ్యక్తం చేసినట్లు తెలిసింది. ప్రమాణస్వీకారాలు శాసనసభ సమావేశాల్లో చేయాలా? లేక స్పీకర్ ఛాంబర్‌లో చేయాలనే అంశంపై మరోసారి చర్చిద్దామని నేతలతో జగన్ అన్నట్లు సమాచారం. ఆయనతో భేటీ అయిన వారిలో మాజీ మంత్రులు బొత్స సత్యనారాయణ, గుడివాడ అమర్‌నాథ్, పుష్పశ్రీవాణితోపాటు మాజీ ఎంపి వంగా గీత, ఎంపి మోపిదేవి వెంకటరమణ, మాజీ ఎమ్మెల్యే సంజీవయ్య, బద్వేల్ ఎమ్మెల్యే సుధా ఉన్నారు.

మూడు రోజుల లాభాలకు తెర

ముంబయి : ప్రధానిగా మూడో సారి నరేంద్ర మోడీ ప్రమాణస్వీకారం చేసిన మరుసటి రోజే స్టాక్స్ ప్రతికూలతను ఎదుర్కొన్నాయి. వరుసగా మూడు రోజులు లాభాల్లో సాగిన దేశీయ స్టాక్ మార్కెట్లు సోమవారం నష్టాల పాలయ్యాయి. అమ్మకాల ఒత్తిడితో బిఎస్ఇ సెన్సెక్స్ 203 పాయింట్ల నష్టంతో 76,490కు పడిపోయింది. ఎన్ఎస్ఇ నిఫ్టీ 31 పాయింట్లు తగ్గి 23,259 వద్ద ముగిసింది. సెన్సెక్స్ ఇంట్రాడే ట్రేడింగ్‌లో 77,079 పాయింట్ల జీవిత కాల గరిష్టాన్ని తాకింది. సెన్సెక్స్ 77 వేల మార్కును దాటడం ఇదే మొదటిసారి. టెక్ మహీంద్రా, ఇన్ఫోసిస్, విప్రో, మహీంద్రా అండ్ మహీంద్రా, బజాజ్ ఫైనాన్స్, టిసిఎస్, హెచ్‌సిఎల్ టెక్, మారుతి సుజుకి షేర్లు 2.6 శాతం వరకు అధికంగా నష్టపోయిన వాటిలో ఉన్నాయి.

పవన్ కల్యాణ్‌కు డిప్యూటీ సిఎం ?

- జనసేనకు 4, బిజెపికి 2
- 25 మందితో మంత్రివర్గం
- నేడు కూటమి ఎంఎల్‌ఎల సమావేశం



ప్రజాశక్తి-అమరావతి బ్యూరో, కాకినాడ ప్రతినిధి

టిడిపి కూటమిలో మంత్రివర్గ కూర్పునకు సంబంధించిన కసరత్తు పూర్తయినట్లు తెలిసింది. డటిడిపి అధినేత చంద్రబాబు నాయుడు, జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ విడివిడిగా సోమవారం ఈ అంశంపై దృష్టి సారించినట్లు సమాచారం. మరోవైపు బిజెపి కూడా ఒక జాబితాను సమర్పించింది. విశ్వసనీయ సమాచారం మేరకు పవన్ కల్యాణ్‌కు డిప్యూటీ సిఎం పదవి ఇవ్వనున్నట్లు తెలిసింది. ఈ మేరకు ఆ పార్టీ శ్రేణుల నుండి తీవ్రస్థాయిలో ఒత్తిడి వస్తున్నట్లు సమాచారం. పవన్‌తోపాటు, టిడిపిలో వేరేవరికైనా డిప్యూటి సిఎం పదవి ఇస్తారా? లేదా? అన్న విషయంపై స్పష్టత లేదు మొత్తంమీద జనసేనకు నాలుగు, బిజెపికి రెండు మంత్రి పదవులు ఇస్తారని, 25 మందితో మంత్రివర్గం ఏర్పాటు చేసే అవకాశం ఉందని తెలసింది. విజయవాడలోని ఒక ప్రైవేటు హోటల్‌లో కూటమి ఎంఎల్‌ఎల సమావేశం మంగళవారం జరగనుంది. ఉదయం 9.30 గంటలకు ప్రారంభం కానున్న ఈ సమావేశంలోనే శాసనసభా పక్ష నేతను ఎన్నుకుంటారు. మంత్రివర్గ కూర్పునకు సంబంధించి కూడా తుది నిర్ణయం తీసుకుంటారు. ఏ పార్టీ నుంచి ఎవరిని మంత్రివర్గంలో తీసుకుంటారు? ఎవరికి ఏ శాఖలు అప్పగిస్తారనే అంశం కూడా ఈ సమావేశంలోనే ఖరారయ్యే అవకాశం ఉంది. సమావేశం తరువాత కూటమి నేతలు గవర్నర్ అబ్దుల్ నజీర్‌ను కలిసి ప్రభుత్వ ఏర్పాటుకు ఆహ్వానించాలని వినతిపత్రం అందించనున్నారు. బుధవారం జరగనున్న కార్యక్రమంలో చంద్రబాబుతో పాటే మిగిలిన మంత్రులు కూడా ప్రమాణ స్వీకారం చేయనున్నారు. మరోవైపు టిడిపిలోని ఆశావహులు చంద్రబాబునాయుడును, లోకేష్‌ను కలుస్తున్నారు. తమకు అవకాశం కల్పించాలని కోరుతున్నారు.

రేపు తిరుపతికి చంద్రబాబు

ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన తరువాత చంద్రబాబునాయుడు తిరుపతి వెళ్లనున్నారు. ఈ మేరకు ఆయన షెడ్యూల్ ఖరారైంది. కృష్ణా జిల్లా గన్నవరం మండలం కేసరపల్లి గ్రామంలోని ఐటీ పార్కు మేధ టవర్స్ సమీపంలో బుధవారం ముఖ్యమంత్రిగా 11:27 గంటలకు చంద్రబాబు ప్రమాణ స్వీకారం చేయనున్న సంగతి తెలిసిందే. అక్కడ నుండి నేరుగా తిరుపతి వెడుతారు. రాత్రికి అక్కడే బసచేసి, దర్శనం అనంతరం హైదరాబాద్‌కు వెళ్తారు.

25 వేలతో మెగా డిఎస్‌సి

- డివైఎఫ్‌ఐ వినతి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

మెగా డిఎస్‌సిలో మొదటి దఫా 25 వేల ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేయాలని డివైఎఫ్‌ఐ రాష్ట్ర కమిటీ కోరింది. రాష్ట్రంలో అధికారం చేపట్టనున్న టిడిపి, జనసేన కూటమికి ఆ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు వై రాము, జి రామన్న సోమవారం ఒక ప్రకటనలో శుభాకాంక్షలు తెలిపారు. గతంలో హామీ ఇచ్చినట్లుగా నూతన ప్రభుత్వం మెగా డిఎస్‌సి ప్రకటించాలని విజ్ఞప్తి చేశారు. గతంలో మూసివేసిన పాఠశాలలను తెరిపించి విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. పార్లమెంటు చెప్పిన లెక్కలు ప్రకారం రాష్ట్రంలో 40 వేలకు పైగా ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. ఇందులో తక్షణమే 25 వేల పోస్టులతో మెగా డిఎస్‌సి నోటిఫికేషన్ విడుదల చేయాలని కోరారు. ఈ ప్రక్రియ పూర్తయ్యాక రెండో దఫాలో మిగిలిన పోస్టులను భర్తీ చేయాలని కోరారు. నూతనంగా ఎన్నిక కాబోతున్న రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగుల ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేయాలని కోరారు. ఉపాధ్యాయ ఖాళీ పోస్టుల భర్తీ కోసం డివైఎఫ్‌ఐ అనేక పోరాటాలు చేసిందని, చలో సిఎం క్యాంపు కార్యాలయం ముట్టడి చేసిందని గుర్తుచేశారు. తమ నాయకులు, నిరుద్యోగులపై గత ప్రభుత్వం నమోదు చేసిన అక్రమ కేసులను ఎత్తివేయాలని కోరారు.

ప్రధాని పర్యటనకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు

- ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్‌కుమార్ ప్రసాద్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఈ నెల 12న కేసరపల్లి ఐటి పార్కు ప్రాంగణంలో జరిగే ముఖ్యమంత్రిగా చంద్రబాబునాయుడు ప్రమాణ స్వీకారోత్సవానికి ప్రధాని నరేంద్రమోడీ రానున్న నేపథ్యంలో కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేస్తున్నట్లు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్‌కుమార్ ప్రసాద్ తెలిపారు. ప్రధాని పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లపై అధికారులతో సోమవారం విజయవాడలోని క్యాంపు కార్యాలయంలో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సిఎస్ మాట్లాడుతూ.. ప్రధానమంత్రి 12న ఉదయం 8:20 గంటలకు ఢిల్లీలో బయలుదేరి 10:40 గంటలకు గన్నవరం విమానాశ్రయానికి చేరుకుంటారన్నారు. ఉదయం 10:55 గంటలకు సమీపంలోని ఐటి పార్కు ప్రాంగణానికి చేరుకుని 11 గంటల నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు ప్రమాణస్వీకార కార్యక్రమంలో పాల్గొంటారని తెలిపారు. 12:45 గంటలకు గన్నవరం విమానాశ్రయం నుంచి భువనేశ్వర్‌కు ప్రధాని వెళ్తారని పేర్కొన్నారు. మంత్రివర్గ సభ్యుల ప్రమాణస్వీకార కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లపై అధికారులతో సమీక్షించారు. ఈ సమావేశంలో అదనపు డిజిపి ఎస్ బాగ్చి, జిఎడి కార్యదర్శి ఎస్ సురేష్‌కుమార్, డెయిరీ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఎమ్‌డి బాబు ఎ, చీఫ్ కమిషనరు స్టేట్ ట్యాక్సెస్ గిరిజా శంకర్ పాల్గొన్నారు.

త్వరితగతిన ఏర్పాట్లు పూర్తి : రాష్ట్ర సమన్వయాధికారి ప్రద్యుమ్న

చంద్రబాబు ప్రమాణ స్వీకారోత్సవ ఏర్పాట్లను మంగళవారం సాయంత్రానికల్లా పూర్తి చేయాలని అధికారులను రాష్ట్ర సమన్వయాధికారి, రోడ్డు రవాణా, రహదారులు, భవనాలశాఖ సమన్వయ కార్యదర్శి పిఎస్ ప్రద్యుమ్న ఆదేశించారు. సోమవారం మేధ టవర్స్ సమీపంలోని ప్రమాణ స్వీకారోత్సవ ప్రధాన వేదిక వద్ద అధికారులతో కలిసి ఏర్పాట్లను పరిశీలించారు. ఆయన వెంట ఉన్నతాధికారులు వీరపాండియన్, ఎస్ఎస్ శ్రీధర్, పలువురు ఐఎఎస్, ఐపిఎస్ అధికారులు పాల్గొన్నారు.

పార్కింగ్ ప్రదేశాల వద్ద సిసి కెమెరాలు

ప్రధాన వేదికతోపాటు వివిఐపి, విఐపిలు ప్రయాణించే మార్గాలు, పార్కింగ్ ప్రదేశాల్లో సిసి టివి కెమెరాలు ఏర్పాటుచేయాలని సమన్వయాధికారి ప్రద్యుమ్న ఆదేశించారు. ముఖ్యమంత్రి ప్రమాణస్వీకార కార్యక్రమం లైవ్ టెలికాస్ట్ లింక్ ద్వారా అన్ని జిల్లాల్లో ప్రజలు చూసేందుకు వీలుగా ఎల్ఇడి స్క్రీన్లు ఏర్పాటు చేయాలన్నారు.

బొత్సపై టిడిపి ఫిర్యాదు

- టీచర్ల బదిలీలతో రూ.కోట్లు దోచుకున్నారని ఆరోపణ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఉపాధ్యాయుల బదిలీల పేరుతో రూ.కోట్లు దండుకున్న విద్యాశాఖ మాజీ మంత్రి బొత్స సత్యనారాయణతోపాటు అధికారులపై విచారణ చేపట్టి, అరెస్టు చేయాలని టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు వర్ల రామయ్య డిమాండ్ చేశారు. ఎసిబి కార్యాలయంలో ఎస్‌పి రవిప్రకాష్‌ను కలిసి సోమవారం వర్ల ఫిర్యాదు చేశారు. బదిలీల పేరుతో ఉపాధ్యాయుల నుంచి రూ.3 లక్షల నుంచి రూ.6 లక్షలు చొప్పున దాదాపు రూ.60 కోట్లు దండుకున్నారని ఆరోపించారు. బొత్సతోపాటు అతని పిఎ, కమిషనరేట్‌లో కీలకమైన అధికారి ఇళ్లపై దాదాపు 1,600 మంది ఉపాధ్యాయులు దాడి చేసే పరిస్థితి వచ్చిందని పేర్కొన్నారు. బదిలీలైన ఉపాధ్యాయులను విచారిస్తే వీళ్ల బాగోతం బయటపెడతారని చెప్పారు. పర్యాటకశాఖలో జరిగిన అవినీతిపై కూడా ఫిర్యాదు చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నేతలు షేక్ రఫీ, జగదీష్ బాబు, కోడూరి అఖిల్, వల్లూరి కిరణ్ తదితరులు ఉన్నారు.

ఆగని వైసిపి నేతల అరాచకాలు : కొమ్మారెడ్డి

వైసిపి నేతల అరాచకాలు ఆగడం లేదని టిడిపి అధికార ప్రతినిధి కొమ్మారెడ్డి పట్టాభిరామ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. టిడిపి కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. తప్పు చేసిన వారిని వదిలిపెట్టేది లేదని, చట్టం ప్రకారం తప్పకుండా కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. కర్నూలు జిల్లాలో తమ పార్టీ నేత గిరినాథ్ చౌదరిని అత్యంత కిరాతకంగా వైసిపి మూకలు హతమార్చారని ఆరోపించారు.



శ్రీశైలం డ్యాం ఫొటో

శ్రీశైలం జలాశయానికి నీటి ప్రవాహం

ప్రజాశక్తి - శ్రీశైలం ప్రాజెక్టు

శ్రీశైలం జలాశయానికి నీటి ప్రవాహం మొదలైంది. ఎగువ పరివాహక ప్రాంతాలైన కర్ణాటక, మహారాష్ట్రలో కురుస్తున్న వర్షాల వలన తెలంగాణ రాష్ట్రం జూరాలకు కొద్దిపాటి నీటి ప్రవాహం చేరుతోంది. తుంగభద్ర నది నుంచి సోమవారం ఉదయం నుంచి 4052 క్యూసెక్కుల నీటి ప్రవాహం వస్తోంది. జలాశయం గరిష్ట నీటి మట్టం 885 అడుగులు కాగా, ప్రస్తుతం నీటి మట్టం 809 అడుగులుగా ఉంది. పూర్తి స్థాయి నీటి నిలువ సామర్థ్యం 215.70 టిఎంసిలు కాగా, ప్రస్తుత నీటి నిలువ 33.780 టిఎంసిలుగా నమోదైంది.

జగన్ హత్యారాజకీయాలు ఆపాలి

- టిడిపి ప్రధాన కార్యదర్శి లోకేష్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఎన్నికల్లో ఓడిపోయినా రక్తచరిత్ర రాస్తూనే ఉన్నారని టిడిపి ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ ఆగ్రహం వ్యక్తం చేశారు. కర్నూలు జిల్లా వెల్దుర్తి మండలం, బొమ్మిరెడ్డిపల్లెకు చెందిన టిడిపి నేత గౌరీనాథ్ చౌదరిని దారుణంగా హత్య చేయించారని సోమవారం ఒక ప్రకటనలో ఆరోపించారు. హత్యా రాజకీయాలు ఇకనైనా ఆపకపోతే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు. గౌరీనాథ్ కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని తెలిపారు.

లోకేష్‌ను కలిసిన పలువురు ఎమ్మెల్యేలు

టిడిపి నుంచి గెలిచిన పలువురు ఎమ్మెల్యేలు, పార్టీ ముఖ్యనేతలు లోకేష్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఉండవల్లిలోని లోకేష్ నివాసంలో సోమవారం కలిశారు. సార్వత్రిక ఎన్నికల్లో ఘన విజయం సాధించినందుకు పరస్పరం అభినందనలు తెలుపుకున్నారు. భారీ మెజార్టీతో గెలిచిన ఎమ్మెల్యేలు, ఎన్నికల్లో కష్టపడి పనిచేసిన నాయకులు, కార్యకర్తలను అభినందించారు. ఎమ్మెల్యేలు జ్యోతుల నెహ్రూ, బెందాళం అశోక్, వేగుల జోగేశ్వరరావు, మాజీ ఎమ్మెల్సీ అంగ రపు రామ్మోహన్ తదితరులు లోకేష్‌ను కలిసిన వారిలో ఉన్నారు.

వైసిపికి నెల్లూరు మేయర్ రాజీనామా

ప్రజాశక్తి-నెల్లూరు సిటీ

వైసిపికి షాక్ తగిలింది. నెల్లూరు మేయర్ స్రవంతి, ఆమె భర్త జయవర్ధన్ వైసిపికి రాజీనామా చేశారు. నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి వెంట నడుస్తామని ప్రకటించారు. నెల్లూరు నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం వారు విలేకరులతో మాట్లాడారు. వైసిపిని శ్రీధర్‌రెడ్డి వీడినప్పుడు తాము కూడా ఆయన వెంటే నడిచేందుకు మేయర్ పదవికి రాజీనామా చేసేందుకు సిద్ధపడ్డామన్నారు. వైసిపి నేతలు తమను తిరిగి వైసిపిలోకి రావాలని తీవ్ర ఒత్తిడి చేశారనీ, పార్టీలోకి రాకపోతే మేయర్ పదవి నుండి తొలగిస్తామని బెదిరించారన్నారు. విధిలేని పరిస్థితుల్లో వైసిపిలోనే కొనసాగాల్సి వచ్చిందని తెలిపారు. శ్రీధర్‌రెడ్డిని ఎన్నోసార్లు అవమానించామని, వ్యక్తిగతంగా విమర్శించామని చెప్పారు. శ్రీధర్‌రెడ్డి తమను క్షమించి అక్కున చేర్చుకోవాలని విజ్ఞప్తి చేశారు. రాజకీయ బిక్ష పెట్టిన శ్రీధర్‌పై తమకు గౌరవం ఉందని, పొరపాటు జరిగి ఉంటే క్షమించాలని కోరారు.

వారం సెలవుపై టిటిడి ఇఒ ధర్మారెడ్డి

- రాష్ట్రం దాటి వెళ్లకూడదని షరతు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

తిరుమల తిరుపతి దేవస్థానం ఇఒ ధర్మారెడ్డి వారం రోజులు సెలవుపై వెళ్లారు. ఈ నెల 11 నుంచి 17 వరకు వ్యక్తిగత పనుల కోసమంటూ సెలవుకు దరఖాస్తు చేయగా, సిఎస్ నీరబ్‌కుమార్ ప్రసాద్ సెలవును మంజూరు చేశారు. ఈ వారం రోజులు రాష్ట్రం విడిచి వెళ్లరాదని, హెడ్ క్వార్టర్స్‌లో మాత్రమే ఉండాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఇఒపై జనసేన నేతలు తిరుపతిలో ఎసిబి అధికారులకు ఫిర్యాదు చేసిన సంగతి పాఠకులకు విధితమే. నూతన ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు ఈ నెల 12న ప్రమాణస్వీకారోత్సవం చేసిన అనంతరం తిరుమలకు వెళ్లనున్నారు. అదేరోజు రాత్రి అక్కడే బస చేసి 13న ఉదయం వెంకటేశ్వరస్వామిని దర్శనం చేసుకోనున్నారు. ఈ నేపథ్యంలో ఇఒ సెలవు పెట్టడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

బాలకృష్ణకు చంద్రబాబు జన్మదిన శుభాకాంక్షలు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు, సినీ నటులు నందమూరి బాలకృష్ణకు ఆ పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు, ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ సోమవారం పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు. తెలుగు సినిమా రంగంలో అన్‌స్టాపబుల్ అనిపించుకున్న బాలకృష్ణకు హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతూ ఎక్స్‌లో పోస్టు చేశారు. సినీ, రాజకీయ రంగాల్లో తిరుగులేని ప్రజాదరణతో నిండు నూరేళ్ల ఆనంద, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు.

టిడిపి కార్యాలయంలో వేడుకలు

బాలకృష్ణ జన్మదిన వేడుకలు టిడిపి కార్యాలయంలో జరిగాయి. ఆ పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యులు వర్ల రామయ్య కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ అశోక్ బాబు, ఎపి నాటక అకాడమీ ఛైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణ, సినీ నిర్మాత కాట్రగడ్డ ప్రసాద్, రాష్ట్ర మహిళా కమిషన్ మాజీ అధ్యక్షులు నన్నపనేని రాజకుమారి, పార్టీ నేతలు రఫీ తదితరులు పాల్గొన్నారు.

టిడిపి నేతల దాడిపై ఫిర్యాదు

- కేసు నమోదు చేసిన పోలీసులు

ప్రజాశక్తి - చిలకలూరిపేట (పల్నాడు జిల్లా)

వైసిపికి చెందిన తనను గుంటూరు జిల్లా మంగళగిరి నియోజకవర్గ టిడిపి నాయకులు చిత్రహింసలకు గురిచేయడంతోపాటు అర్ధనగ్నంగా మోకాళ్లపై కూర్చోబెట్టి లోకేష్ ఫొటోకు క్షమాపణలు చెప్పించారని బాధితుడు రాజ్‌కుమార్ సోమవారం పల్నాడు జిల్లా చిలకలూరిపేట రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు.. గుంటూరు జిల్లా పొన్నూరు మండలం జూపూడికి చెందిన పాలేటి రాజ్‌కుమార్ బయోమెడికల్ ఇంజనీరింగ్ పనులు చేస్తుంటారు. ఉద్యోగం నిమిత్తం మంగళగిరి మండలం పెదవడ్లపూడిలో కుటుంబంతో కలిసి నివాసం ఉంటున్నారు. రాజ్‌కుమార్ భార్య కృష్ణవేణి వైసిపి రాష్ట్ర అధికార ప్రతినిధిగా ఇటీవల ఎన్నికల్లో మంగళగిరి నియోజకవర్గంలో పని చేశారు. ఇటీవల వేసవి సెలవుల నిమిత్తం రాజ్‌కుమార్ కుటుంబం చిలకలూరిపేట మండలం బొప్పూడిలోని అత్తగారింటికి వచ్చింది. ఈ క్రమంలో మంగళగిరి నియోజకవర్గానికి చెందిన టిడిపి నాయకుడు జవ్వాది కిరణ్ తన అనుచరులైన నరేంద్ర, షేక్ బాజీ, జానీ, జానీ సోదరుడితో పాటు మరికొందరు ఆదివారం సాయంత్రం బొప్పూడికి వచ్చారు. కుటుంబీకులతో ఉన్న రాజ్‌కుమార్‌ను దూషిస్తూ ఇంట్లోకి చొరబడి వస్తువులను ధ్వంసం చేశారు. ఆయన భార్యతో పాటు అత్త అనురాధ, బావమరిది భార్య విజయలక్ష్మిని దుర్భాషలాడారు. అనంతరం రాజ్‌కుమార్‌ను కారులో మంగళగిరికి తీసుకొచ్చి దాడి చేశారు. లోకేష్ బొమ్మ ఉన్న జెండా ఎదుట అర్ధనగ్నంగా మోకాళ్లపై కూర్చోబెట్టి క్షమాపణలు చెప్పించారు. సోమవారం ఉదయం యడ్లపాడు మండలం బోయపాలెం హైవే పక్కన కారులో నుండి కిందకు తోసేసి వెళ్లిపోయారు. ఈ ఘటనపై బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. రాజ్‌కుమార్‌ను వైద్య పరీక్షల నిమిత్తం ఆస్పత్రికి పంపించామని, కేసు నమోదు చేశామని ఎస్ఐ రవికృష్ణ తెలిపారు.



పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న బాధితుడు రాజ్‌కుమార్

ఫైళ్లు మాయం చేసేందుకు యత్నం!

- వాసుదేవరెడ్డిపై కొనసాగుతున్న విచారణ
- ఫైళ్లు, హార్డ్ డిస్కులు స్వాధీనం
- అప్రూవర్‌గా మారతారనే ప్రచారం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఎక్సైజ్ శాఖలో గతంలో ఉన్న పాలసీకి సంబంధించి జరిగిన అవకతవకల్లో ప్రధాన ఆరోపణలు ఎదుర్కొంటున్న మాజీ మేనేజింగ్ డైరెక్టర్ వాసుదేవరెడ్డి చుట్టూ ఉచ్చు బిగుసుకుంటోంది. ఎన్నికల అనంతరం కీలక ఫైళ్లను తన సొంత ఇంటికి మార్చుకున్నారని వచ్చిన ఆరోపణలపై విచారించిన సిఐడి అధికారులు హైదరాబాద్‌లో అతని నివాసంలో కొన్ని కీలకఫైళ్లు స్వాధీనం చేసుకున్నారు. దీంతో ఉద్దేశపూర్వకంగానే ఫైళ్లు తరలించారని పోలీసులు నిర్ధారణకు వచ్చారు. దీంతోపాటు అతని ఇంట్లో, ల్యాప్‌ట్యాప్‌కు సంబంధించిన కీలక డిస్కులు స్వాధీనం చేసుకున్నారు. త్వరలోనే వాటికి సంబంధించిన డేటాను క్రోడీకరించి నివేదికను రూపొందించనున్నట్లు తెలిసింది. ప్రస్తుతం తెలంగాణలో రూ.1000 ఉన్న మద్యాన్ని ఇక్కడ రూ.1600కు విక్రయించారని, రూ.650 ఉన్న మద్యాన్ని రూ.1400కు విక్రయించారని ఇటీవల వివరాలను బయటపెట్టారు. వాటితోపాటు డిజిటల్ లావాదేవీలను అంగీకరించలేదు. బయట బేవరేజస్ కార్పొరేషన్ లావాదేవీలను చూపించి తనఖా పెట్టి అప్పులు తీసుకున్నారు. వాటికి సంబంధించిన ఫైళ్లు వాసుదేవరెడ్డి నివాసంలో దొరికినట్లు తెలిసింది. వీటి ద్వారా ఎవరెవరికి ఎంత లబ్ధి కలిగింది, ఎంతకు కొన్నారు? ఎంతకు అమ్మారు? మిగులు ఎంత? దాని లాభాలు ఏ ఖాతాల్లో వేశారు? అనే వివరాలను సిఐడి అధికారులు తెలుసుకున్నారు. దీనిపై తొలుత ఆయన స్పందించేందుకు నిరాకరించినా కేసు వివరాలు, మరింత ఇబ్బందులు పడే అవకాశాలను దృష్టిలో ఉంచుకుని ప్రాథమిక వివరాలను అధికారులకు ఇచ్చారని సమాచారం. దీంతోపాటు అధికారులు అప్రూవర్‌గా మారితే ఎసిబి కేసుల్లోనూ, సిఐడి కేసుల్లోనూ వారిని సాక్షిగా పరిగణిస్తారే తప్ప నిందితుడిగా చూడరు. ఈ నేపథ్యంలో అతను అప్రూవర్‌గా మారతారనే ప్రచారం జరిగింది.



రాక్ పరిశ్రమ ఎదుట ప్లకార్డులతో ధర్నా నిర్వహిస్తున్న కార్మికులు

రాక్ సిరామిక్స్ కార్మికుల ధర్నా

- తొలగించిన వారిని విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్

ప్రజాశక్తి - సామర్లకోట(కాకినాడ జిల్లా)

అక్రమంగా తొలగించిన కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ కాకినాడ జిల్లా సామర్లకోటలోని రాక్ సిరామిక్స్ పరిశ్రమ గేటు ఎదుట సిఐటియు ఆధ్వర్యంలో కార్మికులు సోమవారం ధర్నా నిర్వహించారు. ప్లకార్డులు ప్రదర్శిస్తూ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి డి.క్రాంతికుమార్ మాట్లాడుతూ.. పరిశ్రమలో 15 ఏళ్లుగా పని చేస్తున్న 25 మంది కార్మికులను ఎటువంటి కారణం లేకుండా అర్ధాంతరంగా తొలగించడం దారుణమన్నారు. దేశవ్యాప్తంగా అత్యంత లాభాలతో నడుస్తున్న రాక్ సిరామిక్స్ పరిశ్రమ మరింత లాభాలు ఆర్జించే ప్రయత్నం చేస్తోందని తెలిపారు. కార్మిక చట్టాలు అమలు చేయకుండా, ముందుగా ఎటువంటి నోటీసులు ఇవ్వకుండా కార్మికులను తొలగించడం సరికాదన్నారు. కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని కార్మిక శాఖ అధికారులు చెప్పినా పెడచెవిన పెట్టిందని తెలిపారు. తక్షణం కార్మికులను విధుల్లోకి తీసుకోని పక్షంలో ఆందోళనను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఆందోళనలో రాక్ సిరామిక్స్ వర్కర్లు చంద్రశేఖర్, సతీష్, రామకృష్ణ, వరప్రసాద్, మల్లికార్జునరావు, గంగాధర్, క్రాంతి, మంగారావు, అర్జున్‌రావు, మూర్తి, సత్యనారాయణ, చంద్రన్న పాల్గొన్నారు.

టిడిపి నేత హత్యతో సిఐ, ఎస్ఐ బదిలీ

- బాధ్యతలు స్వీకరించిన కొత్త సిఐ, ఎస్ఐ

ప్రజాశక్తి-వెల్దుర్తి

కర్నూలు జిల్లా వెల్దుర్తి మండలం బొమ్మిరెడ్డిపల్లెలో ఆదివారం టిడిపి నాయకుడు గిరినాథ్ చౌదరి హత్య జరిగిన నేపథ్యంలో వెల్దుర్తి సిఐ, ఎస్ఐలను అధికారులు సోమవారం బదిలీ చేశారు. ఈ ఘటనపై సిఐ సురేష్ కుమార్ రెడ్డి, ఎస్ఐ చంద్రశేఖర్ రెడ్డి విధులలో నిర్లక్ష్యం వహించారంటూ వారిని విఆర్‌కు పంపిస్తూ ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. వారి స్థానంలో వెల్దుర్తి సిఐగా కర్నూలు సర్కిల్ పోలీసు స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న మధుసూదన్ రావును, ఎస్ఐగా కర్నూలు నాలుగవ పట్టణ పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న సునీల్ కుమార్‌ను నియమించారు. దీంతో వారు బాధ్యతలు స్వీకరించారు.

హత్య కేసులో 16 మందిపై కేసు నమోదు

హత్య గురైన గిరినాథ్ చౌదరి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు వైసిపి కార్యకర్తలు రమేష్, రామకృష్ణలతో కలిపి 16 మందిపై కేసు నమోదు చేసినట్లు నూతనంగా బాధ్యతలు చేపట్టిన సిఐ మధుసూదన్ రావు, ఎస్ఐ సునీల్ కుమార్ తెలిపారు. హత్యకు కారకులైన వారిని త్వరలోనే అరెస్టు చేస్తామన్నారు. ఈలోపు వెల్దుర్తి మండల ప్రజలు,. ఇరు పార్టీల కార్యకర్తలు సంయమనం పాటించాలని సూచించారు. ఎటువంటి ఘర్షణలకు పాల్పడకుండా పోలీసులకు సహకరించాలని కోరారు. బొమ్మిరెడ్డి పల్లె గ్రామంలో పోలీసు బందోబస్తుతో పికెటింగ్ ఏర్పాటు చేశామని, ఏవైనా ఘర్షణలు జరిగితే తమ దృష్టికి తీసుకురావాలన్నారు.

కెజిబివి టీచింగ్ సిబ్బందిని రెన్యువల్ చేయాలి

- సమగ్రశిక్షా కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఎంప్లాయీస్ జెఎసి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

సమగ్రశిక్షాలోని కెజిబివి టీచింగ్ సిబ్బందిని ఉన్న పద్ధతి ప్రకారమే రెన్యువల్ చేయాలని ఎపి సమగ్రశిక్షా కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ గౌరవాధ్యక్షులు ఎవి నాగేశ్వరరావు సోమవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. పర్ఫామెన్స్ ఇండికేషన్ పేరుతో రెన్యువల్ చేసే విధానాన్ని రద్దు చేయాలని కోరారు. ఏప్రిల్ 30వ తేదీ ఒక్కరోజు మాత్రమే గ్యాప్ ఇచ్చి మే ఒకటి నుంచి యథావిధిగా రెన్యువల్ చేశారని వివరించారు. ఇందుకు భిన్నంగా సమగ్రశిక్షా డైరెక్టర్ ఆదేశాలు ఇవ్వడం అందరినీ బాధిస్తుందని తెలిపారు. వేతనాలు కట్ చేసే కొత్త పద్ధతిని అవలంభిస్తూ ఆర్థికంగా నష్టాన్ని చేకూరుస్తున్నారని పేర్కొన్నారు. తక్కువ వేతనాలు తీసుకున్న ఉద్యోగులకు నాలుగు రోజుల వేతనం కోత విధించడాన్ని తాము వ్యతిరేకిస్తున్నామన్నారు. కొత్తగా ఏర్పాటుకానున్న ప్రభుత్వం చొరవ తీసుకుని ఎలాంటి షరతులు లేకుండా కెజిబివి మహిళా టీచింగ్ సిబ్బందిని ఒక్కరోజు గ్యాప్‌తోనే రెన్యువల్ చేసి పూర్తి వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు.

రిటైర్డ్ ఉన్నతాధికారి నేతృత్వంలో ఆర్థికశాఖపై విచారణ?

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమావతి

గత ఐదేళ్ల కాలంలో ఆర్థికశాఖలో జరిగిన వ్యవహారాలపై రిటైర్డ్ ఉన్నతాధికారితో విచారణ నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించినట్లు తెలిసింది. ముఖ్యమంత్రిగా చంద్రబాబునాయుడు బాధ్యతలు స్వీకరించిన తరువాత ఈ దిశలో ఆదేశాలు వెలువడనున్నట్లు సమాచారం. బాబు కార్యాలయం నుండి దీనికి సంబంధించిన సంకేతాలు ఉన్నతాధికారలుకు అందడంతో ఈ విషయం చర్చనీయాంశంగా మారింది. విచారణాధికారిగా ఎవరిని నియమించే అవకాశం ఉందన్న అంశంపై ఆసక్తికరమైన చర్చ సాగుతోంది. గతంలో ఆర్థికశాఖలో కీలక పదవిలో పనిచేసి పదవీ విరమణ చేసిన ఒక అధికారికి ఈ బాధ్యతలు అప్పగించేలా ఆలోచన చేస్తున్నట్లు సచివాలయ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. ఆ అధికారికి ఓఎస్‌డి లేదా సలహాదారు వంటి పదవి కట్టబెట్టే ఆలోచన కూడా ఉందని తెలుస్తోంది. మరోవైపు ఎన్నికల ఫలితాలు వెలువడిన తరువాత ఆర్థికశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సెలవుపై వెళ్లిన విషయం తెలిసిందే. ఆయన స్థానంలో కొత్త అధికారిని నియమించాలని, ఇతర శాఖ నుండి డిప్యుటేషన్ మీద ఆర్థికశాఖలో కార్యదర్శిగా పనిచేస్తున్న మరో అధికారిని సొంత శాఖకు పంపకూడదని ప్రభుత్వం భావిస్తున్నట్లు సమాచారం. వివిధ వనరుల ద్వారా ఖజానాకు చేరిన రాష్ట్ర ఆదాయంతో పాటు, పెద్ద మొత్తంలో చేసిన అప్పులను దేనికోసం ఖర్చు చేశారో అర్థంకాని పరిస్థితి ఏర్పడిందని టిడిపి వర్గాలు అంటున్నాయి. భారీ మొత్తంలో ఉన్న ఈ నిధులు ఏమయ్యాయో తేల్చాల్సిఉందని వారు అంటున్నారు.

ఆ పేషీలపైనా నిఘా

ఆర్థికశాఖలోని ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, కార్యదర్శి పేషీల్లో గతం నుంచి పనిచేసిన, పనిచేస్తున్న వారిపైనా నిఘా పెట్టాలని భావిస్తున్నట్లు తెలిసింది. ఇప్పటివరకు జరిగిన చెల్లింపులు, ఇతర లావాదేవీల వ్యవహారాలు వారికి పూర్తిగా తెలిసే అవకాశాలు ఉంటాయని అభిప్రాయపడుతున్నారు.

గోదావరిలో మునిగి తల్లీకొడుకు మృతి

ప్రజాశక్తి - వేలేరుపాడు (ఏలూరు జిల్లా)

గోదావరిలో మునిగి ప్రమాదవశాత్తు తల్లీకుమారుడు మృతి చెందిన సంఘటన ఏలూరు జిల్లా వేలేరుపాడు మండలంలో సోమవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... తెలంగాణ రాష్ట్రం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట చిన్నశెట్టి బజారుకు చెందిన 15 మంది సోమవారం ఏలూరు జిల్లా వేలేరుపాడు మండలం కట్కూరులోని శివాలయానికి వచ్చారు. వారందరూ అక్కడ జల్లు స్నానాలు చేశారు. వారితో పాటు వచ్చిన అల్లంశెట్టి తేజశ్రీనివాస్ (23) గోదావరి నదిలో స్నానం చేసేందుకు దిగారు. స్నానం చేస్తుండగా ప్రమాదవశాత్తూ నీట మునిగారు. కుమారుడిని రక్షించేందుకు తల్లి నాగమణి (45) గోదావరిలో దిగగా ఇద్దరూ గల్లంతయ్యారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని గాలింపు చర్యలు చేపట్టగా ఇద్దరి మృతదేహాలు లభ్యమయ్యాయి. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు.

రేపు మొండి బాకీల పరిష్కారానికి సదవకాశం

- బిఒఐ 'వన్ టైం సెటిల్‌మెంట్' పథకం

ప్రజాశక్తి - విజయవాడ

రుణగ్రహీతల మొండి బకాయి ఋణ ఖాతాలను పరిష్కరించుకోవడానికి జూన్ 12న సదావకాశం కల్పిస్తున్నట్లు బ్యాంక్ ఆఫ్ ఇండియా (బిఒఐ) తెలిపింది. దేశవ్యాప్తంగా ఉన్న తమ అన్నీ బిఒఐ శాఖలు, జోన్లలో సంఝౌత దినోత్సవాన్ని నిర్వహిస్తోన్నట్లు ఆ బ్యాంక్ విజయవాడ జోన్ చీఫ్ మేనేజర్ (రికవరీ) పేరుతో ఓ ప్రకటన విడుదల చేసింది. ఏదైనా నిజమైన కారణం వల్ల సకాలంలో రుణాన్ని తిరిగి చెల్లించలేని మొండి బకాయి రుణగ్రహీతల కోసం సంఝౌత దినం ప్రత్యేకంగా రూపొందించబడిందని తెలిపింది.. చిన్న ఖాతాలు, మధ్యస్థ ఖాతాలను పరిష్కరించడానికి తమ బ్యాంక్ వన్ టైం సెటిల్‌మెంట్ (ఒటిఎస్) ప్రత్యేక పథకాన్ని కలిగి ఉందని వెల్లడించింది. దీంతో మొండి బకాయి ఖాతాలు ఉన్న రుణగ్రహీతలకు ప్రత్యేక డిస్కౌంట్లను అందిస్తుందని తెలిపింది. ఈ సువర్ణావకాశాన్ని వినియోగించుకోవాలని మొండి బకాయి ఖాతాలు ఉన్న రుణగ్రహీతలందరికి విజ్ఞప్తి చేస్తున్నట్లు పేర్కొంది.

సిఐటియు బలోపేతమే పర్సకు నిజమైన నివాళి

- సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎంఎ.గఫూర్
- కర్నూలు, పుట్టపర్తిల్లో శత జయంతి ఉత్సవాలు

ప్రజాశక్తి- కర్నూలు కార్పొరేషన్, పుట్టపర్తి అర్బన్ (శ్రీసత్యసాయి జిల్లా)



కర్నూలులో పర్స సత్యనారాయణ జయంతి ఉత్సవాల్లో మాట్లాడుతున్న సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎంఎ.గఫూర్

సిఐటియును బలోపేతం చేయడమే కార్మికోద్యమ నేత, తెలంగాణ సాయుధ పోరాట యోధుడు పర్సా సత్యనారాయణకు మనం ఇచ్చే ఘనమైన నివాళని సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎంఎ.గఫూర్ అన్నారు. పర్స సత్యనారాయణ శత జయంతి ఉత్సవాలు కర్నూలులోనూ, శ్రీసత్యసాయి జిల్లా పుట్టపర్తిలోనూ సోమవారం జరిగాయి. ముందుగా ఆయన చిత్రపటానికి నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు. కర్నూలులోని కార్మిక, కర్షక భవన్‌లో సిఐటియు జిల్లా అధ్యక్షులు పిఎస్ రాధాకృష్ణ అధ్యక్షతన జరిగిన ఉత్సవాల్లో ఎంఎ.గఫూర్ మాట్లాడుతూ పర్సా సత్యనారాయణ, నండూరి ప్రసాదరావు కలిసి సిఐటియు నిర్మాణానికి కృషి చేశారని తెలిపారు. సింగరేణి కాలరీస్‌లో కార్మిక సంఘాన్ని పర్స సత్యనారాయణ ఎంతో కష్టపడి నిర్మించారని వివరించారు. అనేక కష్టాలు ఎదుర్కొన్నారని, అనేక సంవత్సరాల పాటు అజ్ఞాత జీవితం గడపాల్సి వచ్చిందని, తొమ్మిదేళ్లపాటు జైలు జీవితం అనుభవించారని గుర్తు చేశారు. విశాఖ ఉక్కు కోసం శాసనసభ సభ్యత్వాన్ని త్యాగం చేసిన ఘనత పర్సాకే దక్కుతుందన్నారు. ఆంధ్రప్రదేశ్ సిఐటియు అధ్యక్షులుగా, గౌరవాధ్యక్షుడిగా, సిఐటియు జాతీయ ఉపాధ్యక్షులుగా, కార్మికలోకం సంపాదకులుగా అనేక సంవత్సరాలు పర్సా పనిచేశారని తెలిపారు. మన రాష్ట్రంలో సిఐటియు ఉద్యమం పెట్టుబడిదారులకు వ్యతిరేకంగా వర్గపోరాటాలు నిర్వహించారని వివరించారు. పర్సా లాంటి ఎందరో కార్మిక నేతల పోరాట ఫలితంగా సాధించుకున్న 44 కార్మిక చట్టాలను పదేళ్లగా దేశాన్ని పాలించిన బిజెపి ప్రభుత్వం హరిస్తూ కార్మికులకు అన్యాయం చేస్తోందన్నారు. పర్స ఉద్యమ స్ఫూర్తితో ఆయన ఆశయాలను కొనసాగిస్తూ హక్కుల కోసం ఉద్యమించాలని కోరారు.

విస్తరించడానికి ఆయన చేసిన కృషి ఎనలేనిదన్నారు.

శ్రీ సత్యసాయి జిల్లా కేంద్రం పుట్టపర్తి పట్టణంలోని సాయి ఆరామం అతిథి గృహంలో శ్రామిక మహిళ సమైక్య అధ్యక్షురాలు దిల్షాద్ అధ్యక్షతన పర్స సత్యనారాయణ జయంతి ఉత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు మాట్లాడుతూ జీవిత కాలం కార్మికుల సంక్షేమం, కార్మిక హక్కుల కోసం ఉద్యమాలు నడిపిన ఉద్యమ సారథి పర్స సత్యనారాయణ అని అన్నారు. తెలంగాణ సాయుధ పోరాటంలో, విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు ఉద్యమంలో కీలకపాత్ర పోషించారని తెలిపారు. సామ్రాజ్యవాదులకు,

అంబేద్కర్‌ను అవమానించిన వారిని అరెస్ట్ చేయాలి

డిఆర్‌ఒకి వ్యవసాయ కార్మిక సంఘం, కెవిపిఎస్ వినతి

ప్రజాశక్తి - అమలాపురం, రాజమహేంద్రవరం


అమలాపురంలో డిఆర్‌ఒకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా కె.గంగవరం మండలం ఎర్ర పోతవరం లాకుల వద్ద అంబేద్కర్ విగ్రహానికి చెప్పుల దండ వేసి అవమానించిన దోషులను వెంటనే అరెస్టు చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కారెం వెంకటేశ్వరరావు, కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు శెట్టిబత్తుల తులసీరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు డిఆర్ఒ ఎం.వెంకటేశ్వరావుకు సోమవారం వినతిపత్రం అందజేశారు. అంబేద్కర్ విగ్రహాలపై జరుగుతున్న దాడులను ఖండిస్తూ తొలుత గొల్లగూడెంలోని ప్రజా సంఘాల కార్యాలయం వద్ద సమావేశం జరిగింది. ఈ సమావేశంలో వారు మాట్లాడుతూ.. అంబేద్కర్ విగ్రహాలపై ఇలాంటి దాడులు జరగడం దురదృష్టకరమన్నారు. రాజకీయ పార్టీల ముసుగులో అంబేద్కర్ విగ్రహాలను అవమానపరుస్తుంటే చూస్తూ ఊరుకోబోదని స్పష్టం చేశారు. పోలీస్ ఉన్నతాధికారులు వెంటనే స్పందించి పూర్తిస్థాయి దర్యాప్తు చేపట్టి దోషులను అరెస్ట్ చేయాలని కోరారు.

రాజమహేంద్రవరంలో ధర్నా

అంబేద్కర్ విగ్రహానికి చెప్పుల దండ వేయాన్ని నిరసిస్తూ తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం గోకవరం బస్టాండ్‌లోని అంబేద్కర్ విగ్రహం వద్ద కెవిపిఎస్ నాయకులు ధర్నా చేశారు. కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి జువ్వల రాంబాబు మాట్లాడుతూ.. ఇలాంటి చర్యలకు పాల్పడేవారిని ఏ పార్టీలోనూ కొనసాగనీయకుండా బహిష్కరించాలని అన్ని రాజకీయ పార్టీలను కోరారు. ధర్నాలో కెవిపిఎస్, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

పోలీసు కస్టడీలో ఉండగా నాపై హత్యాయత్నం

- గుంటూరు ఎస్‌పికి రఘురామ కృష్ణరాజు ఫిర్యాదు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

తనపై తప్పుడు కేసులు పెట్టి అరెస్టు చేయడమే కాకుండా పోలీసు ఉన్నతాధికారులు చంపుతామని బెదిరించారని, తీవ్రంగా కొట్టి హింసించారని గుంటూరు ఎస్‌పికి ఉండి ఎమ్మెల్యే కనుమూరి రఘురామ కృష్ణరాజు ఫిర్యాదు చేశారు. జగన్‌కు వ్యతిరేకంగా మాట్లాడితే ఊరుకోబోమని సిబిసిఐడి అదనపు డిజి సునీల్‌కుమార్, ఐజి సీతారామాంజనేయులు, సిఐడి ఎస్‌పి విజయపాల్ లాఠీలు, రబ్బరు షీట్లతో తీవ్రంగా కొట్టారని ఫిర్యాదులో పేర్కొన్నారు. గుండెలపై ఆపరేషన్ చేసిన చోట చేయివేసి గట్టిగా నొక్కి గుండె నొప్పి వచ్చేలా చేశారని పేర్కొన్నారు. వైసిపి ప్రభుత్వ హయాంలో నరసాపురం ఎంపిగా ఉన్న కనుమూరి రఘురామ కృష్ణరాజును సిఐడి పోలీసులు అరెస్టు చేసిన సంగతి తెలిసిందే. ఆ సమయంలో తనను కొట్టి చంపబోయారని, గుండెలపై తన్నారని, కాళ్లపై కొట్టారని పార్లమెంటు స్పీకర్‌కు లేఖ రాశారు. విచారణ అనంతరం అతన్ని గుంటూరు జనరల్ ఆస్పత్రికి తరలించగా గాయాలు లేవని జిజిహెచ్ సూపరింటెండెంట్ పద్మలత రిపోర్టు ఇచ్చారు. దీనిపై కోర్టుకు వెళ్లగా సికింద్రాబాద్ మిలటరీ ఆస్పత్రిలో రఘురామకు పరీక్షలు నిర్వహించి కాళ్లలో పగుళ్లు ఉన్నాయని నిర్ధారించారు. ఈ ఘటన అనంతరం అతను ఎపికి రాకుండా పోలీసు అధికారులు అడ్డుకున్నారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో ఉండి నుండి టిడిపి అభ్యర్థిగా పోటీచేసి గెలుపొందిన రఘురామ సోమవారం గుంటూరు ఎస్‌పిని కలిసి లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. తనను పివి సునీల్‌కుమార్, సీతారామాంజనేయులు, విజయపాల్ లాఠీలు, రబ్బరు షీట్లతో కొట్టారని తెలిపారు. జగన్‌ను ఏమీ అనొద్దని హెచ్చరించారని పేర్కొన్నారు. దీనిపై వారి ముగ్గురితోపాటు అప్పటి సిఎం జగన్‌పై కేసు నమోదు చేసి విచారణ జరపాలని రఘురామ కోరారు.



కాలుష్యాన్ని అరికట్టాలని ఆందోళన చేస్తున్న సిపిఎం నాయకులు

కాలుష్యాన్ని అరికట్టాలని ధర్నా

ప్రజాశక్తి- భీమవరం టౌన్

కాలుష్యాన్ని అరికట్టాలని కోరుతూ భీమవరంలోని ప్రకాశం చౌక్ సెంటర్‌లో యనమదుర్రు డ్రెయిన్ వంతెనపై సిపిఎం ఆధ్వర్యంలో సోమవారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఎం పశ్చిమగోదావరి జిల్లా కార్యదర్శి బి.బలరాం మాట్లాడుతూ జిల్లాలోని అనేక పరిశ్రమలు వాటి వ్యర్థ జలాలను శుద్ధి చేయకుండా యథేచ్ఛగా పంట కాలువలు, డ్రెయిన్లలోకి వదిలేస్తూ చట్టాలను ఉల్లంఘిస్తున్నాయన్నారు. దీనివల్ల ఏ పంట కాలువ చూసినా కాలుష్యమయమైందని తెలిపారు. ఆ నీటినే తాగునీటి చెరువులకు, పంటలకు వాడుతున్నారన్నారు. దీంతో, ప్రజలు గుండె, లివర్, ఊపిరితిత్తులు, కేన్సర్, చర్మ తదితర వ్యాధుల బారినపడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. భీమవరం మధ్య నుంచి ప్రవహిస్తున్న యనమదుర్రు డ్రెయిన్ ఒకప్పుడు స్వచ్ఛమైన నీటితో జీవ నదిలా కళకళలాడుతూ ఉండేదన్నారు. అనేక గ్రామాల ప్రజలకు సాగు, తాగు ఇతర అవసరాలకు ఈ నీటినే వాడేవారని, వేలాది మత్స్యకార కుటుంబాలు చేపల వేట ద్వారా జీవనోపాధి పొందేవారని గుర్తు చేశారు. నేడు పరిశ్రమల కాలుష్యంతో పూర్తిగా మురికి కూపంగా మారిపోయిందన్నారు. వెంకయ్యవయ్యేరు, కాజ డ్రెయిన్, బొండాడ డ్రెయిన్ల పరిస్థితి కూడా ఈ విధంగానే ఉందని తెలిపారు. కాలుష్య నియంత్రణ మండలితో జిల్లా కలెక్టర్ వెంటనే సమావేశం ఏర్పాటు చేసి కాలుష్యాన్ని అరికట్టే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. అనంతరం కలెక్టరేట్‌కు చేరుకుని జిల్లా కలెక్టర్‌కు ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పట్టణ కార్యదర్శి బి.వాసుదేవరావు, జిల్లా కమిటీ సభ్యులు ఎం.వైకుంఠరావు తదితరులు పాల్గొన్నారు.

నీట్ ఆరోపణలపై సమగ్ర విచారణకు ఎస్ఎఫ్ఐ డిమాండ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

నీట్ ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపించాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు ఎ అశోక్, కె ప్రసన్నకుమార్ సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. నీట్ యుజి-2024 ఫలితాల్లో హర్యానాకు చెందిన ఒకే పరీక్షా కేంద్రంలో ఏడుగురు విద్యార్థులకు జాతీయ స్థాయిలో మొదటి ర్యాంకు రావడం, వారందరికీ 720/720 మార్కులు రావడం ఎన్నో అనుమానాలు వస్తున్నాయని తెలిపారు. ఎంతో మంది విద్యార్థులకు సాధ్యం కాని విధంగా 718, 719 మార్కులు వచ్చాయని వివరించారు. నీట్ వివాదంపై నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టిఎ) ఇచ్చిన వివరణ సంతృప్తికరంగా లేదని పేర్కొన్నారు. జూన్ 14న ఫలితాలు విడుదల చేస్తామని ప్రకటించి, జూన్ 4నే విడుదల చేశారని, దీనిపై అనేక సందేహాలు ఉన్నాయని తెలిపారు. విద్య వికేంద్రీకరణలో భాగంగా నీట్ పరీక్షను కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చి విద్యను ప్రైవేటీకరణ చేస్తుందని విమర్శించారు. దేశం మొత్తం ఒకే పరీక్ష ఉండాలని విద్యార్థులపై ఒత్తిడిని పెంచిందని, ఇది పూర్తిగా రాష్ట్రాల హక్కులను కాలరాయడమే అవుతుందని అన్నారు. ఎన్‌టిఎ నిర్వహించిన అన్ని పరీక్షలపై విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. నిర్వహణలో వైఫల్యం చెందినందుకు ఏజెన్సీని రద్దు చేయాలని కోరారు.



సాలూరులో మున్సిపల్ కార్మికుల సమ్మె

- కార్యాలయం వద్ద శిబిరం

ప్రజాశక్తి - సాలూరు (పార్వతీపురం మన్యం జిల్లా)

తమ సమస్యలను పరిష్కరించడంలో మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యానికి నిరసనగా పార్వతీపురం మన్యం జిల్లా సాలూరులో సోమవారం నుంచి కాంట్రాక్టు కార్మికులు విధులు బహిష్కరించి, సమ్మె బాటపట్టారు. కార్మికులకు వేతనాలు చెల్లించాలంటూ గతంలో మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ పట్టణ కమిటీ ఆధ్వర్యాన కార్మికులు దశలవారీగా ఆందోళన చేపట్టారు. అయినా సమస్యల పరిష్కారానికి అధికారులు చర్యలు తీసుకోకపోవడంతో గత్యంతరం లేని పరిస్థితుల్లో సమ్మె బాట పట్టారు. ఈ సమ్మెలో ఫెడరేషన్ నాయకులు టి శంకరరావు, టి రాముడు మాట్లాడుతూ ఈ ఏడాది జనవరికి సంబంధించిన వెయ్యి రూపాయల పండుగ ఖర్చులు, వేతన బకాయిలు, డ్రైవర్లకు రూ.24,500 వరకు పెంచిన వేతనాలు అమలు చేయాలని, మరణించిన కార్మికుల కుటుంబాలకు ఉద్యోగాలివ్వాలని డిమాండ్ చేశారు. తమ సమస్యల పరిష్కారం పట్ల మున్సిపల్ కమిషనర్ నిర్లక్ష్యంగా వ్యవహరించడం దారుణమన్నారు. గత రెండు నెలలుగా సమస్యలు పరిష్కరించాలని ఆందోళన చేపడుతున్నామని, అయినా అధికారుల్లో స్పందన కరువైందని ఆగ్రహం వ్యక్తం చేశారు. సమస్యలు పరిష్కరించే వరకూ సమ్మె కొనసాగిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఫెడరేషన్ నాయకులు టి వెంకటరావు, శ్రామిక మహిళా కన్వీనర్ టి ఇందు పాల్గొన్నారు.


arthan FINANCE

అర్థన్ ఫైనాన్స్‌కు రూ.50 కోట్ల నిధులు

ముంబయి : స్వయం ఉపాధి పొందిన నానో, మైక్రో ఎంటర్‌ప్రెన్యూర్‌ల కోసం అవసరమైన రుణాలను అందించే రుణ సంస్థ అర్థన్ ఫైనాన్స్ రూ.50 కోట్ల నిధులు సమీకరించినట్లు తెలిపింది. ఈ బ్యాంకింగేతర విత్త సంస్థ తమ సిరీస్ బి ఫండింగ్ రౌండ్‌లో భాగంగా ఇన్‌కోఫిన్ ఇండియా ప్రోగ్రెస్ ఫండ్, మైఖేల్ అండ్ సుసాన్ డెల్ ఫౌండేషన్ సంస్థల నుంచి ఈ నిధులు పొందినట్లు వెల్లడించింది. ఈ ఫండ్‌ను కంపెనీ విస్తరణ, సాంకేతిక పురోగతికి ఉపయోగించనున్నట్లు అర్థన్ ఫైనాన్స్ వ్యవస్థాపకుడు, డైరెక్టర్ కునాల్ మెహతా తెలిపారు. ఇప్పటి వరకు, అర్థన్ ఫైనాన్స్ సుమారు రూ.83 కోట్ల సమీకరించిందన్నారు. తమ సంస్థ రూ.2,000 నుండి రూ.20 లక్షల వరకు రుణ మొత్తాలతో 20,000 కంటే ఎక్కువ మంది రుణగ్రహీతలకు రూ. 500 కోట్లకు పైగా పంపిణీ చేసిందని అర్థన్ ఫైనాన్స్ సిఇఒ ప్రవాష్ దాష్ తెలిపారు.

హెరిటేజ్ షేర్ల విలువ రెట్టింపు

- 12 సెషన్లలోనే వృద్ధి
- రూ.1,225 కోట్లు పెరిగిన చంద్రబాబు కుటుంబ సంపద



ముంబయి : కేంద్ర ప్రభుత్వ ఏర్పాటులో కీలకంగా మారిన టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు కుటుంబ సంపద రెండు వారాల్లోనే రెట్టింపు అయ్యింది. హెరిటేజ్ ఫుడ్స్ షేర్లు భారీగా పెరగడమే ఇందుకు కారణం. గడిచిన 12 ట్రేడింగ్ సెషన్లలో ఈ కంపెనీ షేర్లు 105 శాతం పెరిగాయి. దీంతో చంద్రబాబు కుటుంబ సభ్యుల సంపద రూ.1,225 కోట్లు ఎగిసింది. సోమవారం బిఎస్‌ఇలో హెరిటేజ్ ఫుడ్స్ షేరు ఇంట్రాడేలో 10 శాతం అప్పర్ సర్క్యూట్ తాకి రూ.727.9కి చేరింది. తాజాగా 52 వారాల గరిష్ట స్థాయికి ఎగిసిన ఈ సూచీ.. మే 23న కేవలం రూ.354.5 వద్ద నమోదయ్యింది. కాగా.. ఎన్నికల ఫలితాల ముందు జూన్ 3 నుంచి జూన్ 10 మధ్య ఈ స్టాక్స్‌కు భారీగా డిమాండ్ పెరిగింది.

హెరిటేజ్ ఫుడ్స్‌లో చంద్రబాబు కుటుంబానికి 35.71 శాతం వాటాకు సమానమైన 3,31,36,005 షేర్లు ఉన్నాయి. 2024 మార్చి 31 నాటికి లోకేష్ బాబుకు 10.82 శాతం వాటాలు ఉన్నాయి. భువనేశ్వరీ, దేవాన్ష్‌కు వరుసగా 24.37 శాతం, 0.06 శాతం చొప్పున వాటాలున్నాయి. నారా బ్రహ్మణికి 0.46 శాతం వాటా ఉంది. 2024 జూన్ 10 నాటికి భువనేశ్వరీ సంపద రూ.1,631.6 కోట్లకు చేరగా.. లోకేష్ రూ.724.4 కోట్ల సంపదను కలిగి ఉన్నారు. హెరిటేజ్ ఫుడ్స్ స్టాక్స్‌లో వారి కుటుంబం మొత్తానికి ప్రస్తుతం రూ.2,391 కోట్ల సంపద ఉంది.

పాల ఉత్పత్తుల్లో హెరిటేజ్ ఫుడ్స్ దేశంలోనే కీలక బ్రాండ్‌గా ఉంది. అదే విధంగా అనుబంధ సంస్థగా హెరిటేజ్ న్యూట్రివెట్ లిమిటెడ్ (హెచ్ఎన్ఎల్) పేరుతో పశువుల దానను విక్రయిస్తోంది. దేశంలోని 11 రాష్ట్రాల్లో 15 లక్షల కుటుంబాలు హెరిటేజ్ ఫుడ్స్‌కు చెందిన పాలు, పాల ఉత్పత్తులు అయినా పెరుగు, నెయ్యి, పన్నీరు, ఫ్లేవర్డ్ మిల్క్ తదితర ఉత్పత్తులను ఉపయోగిస్తున్నారని ఆ సంస్థ వర్గాల అంచనా. 2023-24లో హెరిటేజ్ ఫుడ్స్ రెవెన్యూ 17 శాతం, లాభాలు 83 శాతం చొప్పున పెరగ్గా.. మార్కెట్లు షేర్ విలువ 126 శాతం పెరిగింది. సోమవారం చివరకు బిఎస్‌ఇలో హెరిటేజ్ ఫుడ్స్ షేర్ విలువ 4.90 శాతం పెరిగి రూ.694.15 వద్ద ముగిసింది. ఐదు సెషన్లలోనే ఏకంగా 61.39 శాతం లేదా రూ.264 పెరిగింది.

పేటియంలో ఉద్యోగులకు ఉద్వాసన..!



బెంగళూరు : ప్రముఖ ఫిన్‌టెక్ సంస్థ పేటియంలో భారీగా ఉద్యోగుల కుదింపునకు నిర్ణయం జరిగింది. ఇప్పటికే పలువురి సిబ్బందికి పేటియం మాతృసంస్థ వన్97 కమ్యూనికేషన్స్ పింక్ స్లిప్స్ పంపిణీ చేసిందని రిపోర్టులు వచ్చాయి. అయితే ఎంత మందిని ఇంటికి పంపించేది తెలియాల్సి ఉంది. తమ సంస్థల్లో ఉద్యోగాలు కోల్పోయిన వారికి ఇతర సంస్థల్లో ఉపాధి కల్పనకు కావాల్సిన మద్దతు ఇవ్వనున్నట్లు పేటియం తెలిపింది. ఇందుకోసం రాజీనామా చేసిన ఉద్యోగులకు కొత్త ఉద్యోగాల కల్పనకు 30 సంస్థలతో కలిసి తమ హెచ్ఆర్ విభాగం పని చేస్తుందని వెల్లడించింది. ఉద్యోగులకు ఉద్వాసన పలకనున్న నేపథ్యంలో సిబ్బందికి పెండింగ్‌లో ఉన్న బోనస్ కూడా విడుదల చేసింది. ఉద్యోగుల తొలగింపు విషయమై తాము అత్యంత పారదర్శకంగా వ్యవహరిస్తున్నట్లు పేటియం పేర్కొంది. 'కంపెనీ పునర్వ్యవస్థీకరణ చర్యల్లో భాగంగా ఉద్యోగ కోతలు చేపట్టాల్సి వచ్చిందని తెలిపింది. 2024 మార్చి నాటికి పేటియంలో 36,521 మంది పనిచేస్తున్నారు. అంతకుముందు త్రైమాసికంతో పోలిస్తే ఈ సంఖ్య 3,500 వరకు తగ్గింది. పలు రెగ్యులేటరీ నిబంధనలు ఉల్లంఘించిన పేటియం పేమెంట్స్ బ్యాంక్‌పై జనవరిలో రిజర్వ్ బ్యాంక్ చర్యల నేపథ్యంలో పేటియం ఉద్యోగ కోతలు చేపట్టింది. ఇప్పుడు మరోసారి ఉద్యోగులకు ఉద్వాసన పలకాలని నిర్ణయించింది.

క్వాంటం డాట్ ఫీచర్‌తో సామ్‌సంగ్ టివిలు



గూర్‌గావ్ : ప్రముఖ ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తుల కంపెనీ సామ్‌సంగ్ కొత్తగా క్వాంటం డాట్ ఫీచర్‌తో 2024 క్యూఎల్ఇడి 4కె ప్రీమియం టివి సిరీస్‌ను విడుదల చేసినట్లు సోమవారం ప్రకటించింది. దీని ప్రారంభ ధరను రూ.65,990గా ప్రకటించింది. క్వాంటం టెక్నాలజీతో వినియోగదారులు నిజమైన రంగుల బిలియన్ షేడ్స్‌ను ఆస్వాదించడానికి వీలు కల్పిస్తుందని తెలిపింది. 55, 65,75 అంగుళాల్లో లభించనున్న ఈ టివిలతో ప్రీమియం ఎంటర్‌టైన్‌మెంట్ ప్రపంచంలోకి ప్రవేశించడానికి వినియోగదారులకు మార్గం సుగమం చేస్తుందని పేర్కొంది.

సోనాలికా ట్రాక్టర్ అమ్మకాల్లో 5.2% వృద్ధి

న్యూఢిల్లీ : ఇంటర్నేషనల్ ట్రాక్టర్స్ లిమిటెడ్‌కు చెందిన సోనాలికా బ్రాండ్ గడిచిన మేలో దేశీయంగా 5.2 శాతం వృద్ధితో 11,130 యూనిట్లను విక్రయించింది. గతేడాది ఇదే నెలలో 10,577 యూనిట్ల అమ్మకాలు చేసింది. పరిశ్రమ వృద్ధిని అధిగమించి అమ్మకాలను నమోదు చేసినట్లు ఆ కంపెనీ ఎండి రమన్ మిట్టల్ తెలిపారు. రైతులు సరైన ధరలకు సోనాలికా హెవీ డ్యూటీ ట్రాక్టర్‌లను కొనుగోలు చేసేలా తాజాగా 'జూన్ జాక్‌పాట్' ఆఫర్‌ను కూడా ప్రారంభించామన్నారు.

బహిరంగ ప్రకటన

(ఇన్‌సాల్వెన్సీ & బ్యాంక్రప్టసీ కోడ్, 2016 ("ఐబిసి") యొక్క సెక్షన్ 102 క్రింద)

శ్రీమతి ఎల్. రామలక్ష్మమ్మ యొక్క రుణదాతలు శ్రద్ధవహించుట కొరకు

ఇందుమూలంగా ప్రకటన ఇవ్వడమేమనగా, కార్పొరేట్ డెటర్ అనగా., మెసర్స్ లాన్కో ఇన్‌ఫ్రాటెక్ లిమిటెడ్‌కు వ్యక్తిగత హామీ(లు) పొడిగింపు కొరకు వ్యక్తిగత హామీదారుల పై ఐబిసి యొక్క సెక్షన్ 95 క్రింద, (రిసొల్యూషన్ ప్రొఫెషనల్ ద్వారా ఫైల్‌చేయబడినది) స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాచేత ఫైల్‌చేయబడిన **సిపి (ఐబి) నం.2/95/హెచ్‌డిబి/2021 లో సిపి (ఐబి) నం. 2/95/హెచ్‌డిబి/2021 & ఐఎ (ఐబిసి) 226/2024 లో, గౌరవ నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్, హైదరాబాద్ బెంచ్-1 వారు, ఐబిసి యొక్క సెక్షన్ 100 క్రింద దీని ఆదేశం తేది 03.06.2024 (ఆర్డర్ అప్‌డేట్ చేసిన తేది: 08.06.2024) ఆధారంగా శ్రీమతి ఎల్. రామలక్ష్మమ్మ** యొక్క ఇన్‌సాల్వెన్సీ రిసొల్యూషన్ ప్రక్రియను ప్రారంభించవలసిందిగా ఆదేశించారు.
దాని అనుసరించి, శ్రీమతి ఎల్. రామలక్ష్మమ్మ యొక్క రుణదాతలుకు సిఫారసుచేసిన ఫారం బి లో రుజువుతోపాటు వారి క్లెయింను 02.07.2024న లేదా ముందుగా, **ఎఆర్‌సికె రీసొల్యూషన్ ప్రొఫెషనల్స్ ఎల్ఎల్‌పి, 409, అన్సల్ భవన్ 16, కె.జి. మార్గ్ (సి.పి) న్యూఢిల్లీ-110001** వద్ద చిరునామాకు లేదా **ఇమెయిల్:** personalinsolvency.lanco@gmail.com వద్ద ద్వారా దాఖలుచేయవచ్చును లేదా ఫైల్‌చేయవచ్చును.
రుణదాతలు వారి క్లెయిం వివరాలను ఎలక్ట్రానిక్ విధానాలు ద్వారా లేదా స్వయంగా లేదా రిజిస్టర్డు పోస్టు ద్వారా, లేదా స్పీడ్ పోస్టు ద్వారా లేదా కొరియర్ ద్వారా దాఖలు (రిజిస్టర్) చేసుకోవచ్చును.

	శ్రీమతి ఎల్. రామలక్ష్మమ్మ వ్యక్తిగత హామీదారుల వివరాలు	
1)	వ్యక్తిగత హామీదారు పేరు	శ్రీమతి ఎల్. రామలక్ష్మమ్మ
2)	వ్యక్తిగత హామీదారు చిరునామా	ఫ్లాట్ నం.103, ప్లాట్ నం.132, సాయి కృష్ణ రెసిడెన్సీ, ఫేజ్-2, కావూరి హిల్స్, జూబ్లీ హిల్స్, హైదరాబాద్-500033.
3)	ఇన్‌సాల్వెన్సీ ప్రారంభ తేది	03.06.2024
4)	ఇన్‌సాల్వెన్సీ రీసొల్యూషన్ ప్రక్రియ ముగింపు అంచనా తేది	30.11.2024
5)	క్లెయింలు సమర్పించుటకు చివరి తేది	02.07.2024
	రీసొల్యూషన్ ప్రొఫెషనల్ వివరాలు	
6)	రీసొల్యూషన్ ప్రొఫెషనల్‌గా వ్యవహరిస్తున్న ఇన్‌సాల్వెన్సీ ప్రొఫెషనల్ పేరు& రిజిస్ట్రేషన్ నంబరు	శ్రీ అనిల్ కోహ్లి IBBI/IPA-001/IP-P00112/2017-2018/10219 AFA Valid Till: 30.06.2025
7)	బోర్డుతో రిజిస్టరైనట్లుగా రీసొల్యూషన్ ప్రొఫెషనల్ చిరునామా& ఇ-మెయిల్	**చిరునామా:** ఫ్లాట్ నం. 409, 4వ అంతస్తు, అన్సల్ భవన్, 16 కస్తూర్బ గాంధీ మార్గ్, కొన్నహట్ ప్లేస్, న్యూ ఢిల్లీ-110001, ఇ-మెయిల్: insolvency@arck.in
8)	రీసొల్యూషన్ ప్రొఫెషనల్‌తో సంప్రదించుట కొరకు వినియోగించు చిరునామా& ఇమెయిల్.	**చిరునామా:** ఫ్లాట్ నం. 409, అన్సల్ భవన్, 16 కస్తూర్బ గాంధీ మార్గ్, కొన్నహట్ ప్లేస్, న్యూ ఢిల్లీ-110001, ఇ-మెయిల్: personalinsolvency.lanco@gmail.com ఫోన్ నం.: 011-45101111/40078344.

అబద్ధపు లేదా తప్పుత్రోవ పట్టించు క్లెయింలను దాఖలుపరిచినట్లైతే, ఇన్‌సాల్వెన్సీ& బ్యాంక్రప్టసీ కోడ్, 2016 లేదా ఏదేని ఇతర వర్తించు చట్టాల యొక్క నియమాలతో అనుసరించి జరిమానాకు బాధ్యులగుదురు.

తేది: 11.06.2024
ప్రదేశం: న్యూ ఢిల్లీ

సం/-
అనిల్ కోహ్లి
రీసొల్యూషన్ ప్రొఫెషనల్.


పాడి రైతులను అభినందిస్తున్న కృష్ణా మిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని.

పాడి రైతుల అభ్యున్నతికి కృషి : చలసాని

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు (కృష్ణాజిల్లా)

పాడి రైతుల అభ్యున్నతికి కృష్ణా మిల్క్ యూనియన్ నిరంతరం కృషి చేస్తోందని కృష్ణా మిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు అన్నారు. కృష్ణా జిల్లా గుడ్లవల్లేరు మండలంలోని నాగవరం, వడ్లమన్నాడు పాల ఉత్పత్తిదారుల పరస్పర సహాయ సహకార సంఘాల వద్ద 'పాడి రైతు సంక్షేమం మన మతం- అలుపెరగని సేవ మన అభిమతం' అనే కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పాడి రైతుల సమస్యలను ఆయన అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ యూనియన్ పాడి రైతులకు అందించే ధర వ్యత్యాసం, కల్యాణమస్తు, క్షీరబంధు, ప్రతిభా, ఆక్సిడెంట్ కేర్ ట్రస్ట్ పథకాల గురించి, పాడి పశువులకు అందించే పశు బీమా, డీ వార్మింగ్, పశు దాణా, కాల్షియం, మినరల్ మిక్సర్ వాడటం వలన కలిగే ప్రయోజనాలను పాడి రైతులకు తెలియజేశారు. యూనియన్ వారు అందించే సెమెన్ విశాఖ ద్వారా పుట్టిన దూడలు భవిష్యత్‌లో ఎక్కువ పాల చార కలిగిన పశువులుగా రైతులకు అధిక లాభాలు ఆర్జించగలవని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా పాలకవర్గ సభ్యులు విబికెవి సుబ్బారావు, గుడ్లవల్లేరు పాల శీతల కేంద్రం మేనేజర్ తోట సత్యనారాయణ, నాగవరం వడ్లమన్నాడు సంఘం అధ్యక్షులు మోదుగమూడి మంగారావు, తోట సుబ్రహ్మణ్యం, సూపర్‌వైజర్ పెయ్యేటి బసవ రాజకుమార్, పాల ఉత్పత్తి దారులు పాల్గొన్నారు.

సిఐఎస్ఎఫ్ జవాన్‌పై కేసు రద్దు చేయాలి

- ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రైతు ఉద్యమాన్ని అవహేళన చేసిన కంగనా రనౌత్‌పై చేయి చేసుకున్న సిఐఎస్ఎఫ్ జవాన్‌పై సస్పెన్షన్, క్రిమినల్ కేసులను రద్దు చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వి కృష్ణయ్య, కె ప్రభాకరరెడ్డి సోమవారం ప్రకటన విడుదల చేశారు. మూడు నల్లచట్టాలకు వ్యతిరేకంగా 13 నెలలకుపైగా ఢిల్లీలో జరిగిన రైతు ఉద్యమం సందర్భంగా ఆ ఉద్యమంలో పాల్గొన్న రైతులనుద్దేశించి కంగనా రనౌత్ చేసిన అవహేళనను నిరసిస్తూ ఛండీగఢ్ విమానాశ్రయంలో జూన్ 4న ఒక రైతుబిడ్డ స్పందనగా సిఐఎస్ఎఫ్ జవాన్ కుల్‌వీందర్‌కౌర్ చర్యను చూడాలని వారు కోరారు. ఇప్పటికైనా కంగనా రనౌత్ లాంటి వారు రైతుల ఉద్యమాన్ని అవహేళన చేయడం మానుకోవాలని విజ్ఞప్తి చేశారు.

జులై 29, ఆగస్టు 3న ప్రత్యేక లోక్ అదాలత్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

సుప్రీంకోర్టులో పెండింగ్‌లో ఉన్న కేసుల పరిష్కారం కోసం జులై 29, ఆగస్టు 3న ప్రత్యేక లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు ఎపి రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ సభ్య కార్యదర్శి ఎం బబిత తెలిపారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. సంబంధిత జిల్లా లేదా రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థలు ఫిజికల్/వర్చువల్ విధానంలో ముందస్తుగా లోక్ అదాలత్ సమావేశాల్లో పాల్గొని కేసుల్లో రాజీ కుదుర్చుకునేందుకు కక్షిదారులకు వీలు కల్పిస్తున్నట్లు తెలిపారు. అదనపు సమాచారం కోసం కక్షిదారులు లేదా వారి న్యాయవాదులు టోల్ ఫ్రీ నెంబరు 15100కు లేదా వారి సమీప కోర్టు ప్రాంగణంలోని న్యాయసేవాధికార సంస్థను సంప్రదించవచ్చన్నారు. లోక్ అదాలత్ ద్వారా కేసుల పరిష్కారానికి ఎటువంటి రుసుము చెల్లించాల్సిన అవసరం లేదని ఆమె పేర్కొన్నారు.

సంపాదకీయం


హిందూత్వ-కార్పొరేట్ దిశ

నరేంద్ర మోడీ నేతృత్వాన కేంద్రంలో బిజెపి సంకీర్ణ ప్రభుత్వం ఆదివారం అట్టహాసంగా కొలువుదీరింది. మొత్తం 71 మందితో ప్రధాని మోడీ తన కొత్త మంత్రి మండలిని నియమించగా, 30 మందికి కేబినెట్, ఐదుగురికి స్వతంత్ర, 36 మందికి సహాయ మంత్రి హోదా కల్పించారు. యువత, అనుభవజ్ఞ నేతల కలబోతగా మోడీ స్వీయ భుజకీర్తులు తగిలించుకున్నప్పటికీ, ఆర్ఎస్ఎస్, విహెచ్‌పి, పరివార్‌లకు చెందిన కీలక వ్యక్తులకే ప్రాధాన్యతనిచ్చారని ప్రమాణస్వీకారం చేసిన మంత్రుల జాబితాను చూస్తే అర్థమైపోతుంది. కేబినెట్‌లోకి తీసుకున్న రాజ్‌నాథ్‌సింగ్, అమిత్‌షా, నితిన్ గడ్కరీ, జెపి నడ్డా, శివరాజ్‌సింగ్ చౌహాన్, నిర్మలా సీతారామన్, జైశంకర్, మనోహర్‌లాల్ ఖట్టర్ తదితరులందరూ సంఘ్ నాయకులే. గత రెండు పర్యాయాలకు భిన్నంగా ఈమారు బిజెపికి సొంతంగా ప్రభుత్వం ఏర్పాటు చేసేందుకు సరిపడా మెజార్టీ కోల్పోయింది. ఎన్‌డిఎ భాగస్వామ్య పార్టీలతో కలిసి మూడవ తడవ సంకీర్ణ సర్కారును ఏర్పాటు చేసింది. అయినప్పటికీ తన హిందూత్వ ఎజెండా అమలును వీడకుండా మంత్రి మండలిలో సంఘ్ పరివార్ నేతలను చొప్పించడం సాహసమే! తద్వారా తమ అసలు సిసలు లక్ష్యం నుంచి పక్కకు పోలేదని స్పష్టమైన సంకేతమే ఇచ్చింది.

మోడీ ప్రభుత్వాన్ని '3.0' అని బిజెపి హోరెత్తిస్తుండగా, నియమించిన 71 మంది మంత్రుల్లో ఒక్కరు కూడా ముస్లిం మైనార్టీ లేరు. ఆ సామాజిక తరగతికి చెందిన లోక్‌సభ, రాజ్యసభ సభ్యులెవరూ బిజెపికి లేరని తప్పించుకోడానికి కుదరదు. రెండు సభల్లో సభ్యత్వం లేకుండానే పంజాబ్‌కు చెందిన రవనీత్‌సింగ్ బిట్టు, కేరళకు చెందిన జార్జి కురియన్‌లను మంత్రులను చేశారు మోడీ. కేరళలో ఎల్‌డిఎఫ్, పంజాబ్‌లో ఆప్ ప్రభుత్వాలున్నందున, అక్కడ రాజకీయ లబ్ధిని ఆశించి ఎం.పి.లు లేకపోయినా ఆ కేబినెట్‌లోకి తీసుకున్నారు. దీన్నిబట్టి చూస్తే కావాలనే ముస్లింలకు మంత్రి మండలిలో చోటు కల్పించలేదని అర్థమవుతుంది. మహిళలు ఏడుగురికే అవకాశమిచ్చారు. మోడీ టీంలోకి ఏడుగురు ఎస్‌సిలను, ముగ్గురు ఎస్‌టిలను మాత్రమే తీసుకున్నారు. ఇదీ 'అత్యద్భుత' 3.0 మోడీ కేబినెట్‌లో అమలు జరిపిన సామాజిక న్యాయం. మోడీ పీఠానికి ఉన్న నాలుగు కాళ్లల్లో ఒకటి టిడిపి, కాగా రెండవది జెడియు. చంద్రబాబు, నితీష్ కుమార్ పార్టీలు లేకపోతే మోడీ సర్కారు లేదు. వీరిద్దరూ మహిళాభ్యున్నతికి, సామాజిక న్యాయానికి, ముస్లింల రక్షణకు కట్టుబడి ఉన్నామంటారు. మోడీ కేబినెట్‌లో మహిళలకు, ఎస్‌సి, ఎస్‌టిలకు సరైన ప్రాతినిధ్యం కల్పించకపోయినా, ఒక్క ముస్లింనూ మంత్రిని చేయకపోయినా ఎందుకు గమ్మునున్నారో తెలీదు.


కేంద్రంలో సంకీర్ణ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసినప్పటికీ, బిజెపి, మోడీ తమ భాగస్వామ్య పక్షాలను అదుపులోనే ఉంచారని మంత్రుల ఎంపికను చూస్తే అవగతమవుతుంది. ఎ.పి.లో 16 ఎం.పి. స్థానాలను గెలిచిన టిడిపికి ఒక కేబినెట్, ఒక సహాయ మంత్రితో సరిపెట్టారు. జెడియుకు సైతం అంతే. ఒకటి రెండు సీట్లున్న పార్టీలకూ అదే మోతాదులో మంత్రి పదవులిచ్చారు. కేరళలో ఒకే ఒక్క సీటును బిజెపి గెలవగా ఆ ఒక్కరికీ మంత్రి పదవి కట్టబెట్టారు. ఒక్క సీటూ గెలవకపోయినా తమిళనాడు నుంచి ఇద్దరిని మంత్రులను చేశారు. తెలుగు రాష్ట్రాల విషయానికొస్తే తెలంగాణకు ఇచ్చిన ఇద్దరు మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్ నేపథ్యం సంఘ్‌తోనే ముడిపడి ఉంది. ఎ.పి.లో బిజెపి మూడు స్థానాలు గెలవగా మంత్రి పదవి వచ్చిన భూపతిరాజు శ్రీనివాస వర్మది విహెచ్‌పి, ఎబివిపి బడే. సంఘ్ మూలాలు లేనందునే పురందేశ్వరి, సిఎం రమేష్‌లకు, తెలంగాణలో భారీ మెజార్టీతో గెలిచినప్పటికీ ఈటల రాజేందర్‌కు ఛాన్స్ ఇవ్వలేదని అర్థమవుతుంది. పట్టాభిషేక మహోత్సవంగా జరిగిన ప్రమాణస్వీకార కార్యక్రమానికి కార్పొరేట్ దిగ్గజాలైన ముఖేష్ అంబానీ, అనంత్ అంబానీ, గౌతం అదానీ, ఆనంద్ పిరమాళ్ వంటి వారు స్వయంగా హాజరయ్యారు. సంఘ్ నేతలతో మోడీ కేబినెట్, ఆ బృందానికి కార్పొరేట్ల సంపూర్ణ ఆశీర్వచనాలను చూస్తుంటే తిరిగి హిందూత్వ-కార్పొరేట్ పాలనే కొనసాగుతుందని అర్థమవుతోంది. యావత్ ప్రతిపక్షం, ప్రజలు అప్రమత్తమై సమర్థవంతంగా ఎదుర్కోవాల్సి ఉంది.

మంచి మాట



విప్లవ సౌశీల్యాన్ని పుణికి పుచ్చుకున్న వారు కష్టాలకు, కడగండ్లకు, వైఫల్యాలకు వెరవరు. తమ దీక్ష నుంచి వైదొలగరు. వెనుకంజ వేయరు. పార్టీ, విప్లవం, వర్గం, దేశం, తోటి మానవుల ప్రయోజనాల కోసం స్వంత ప్రయోజనాలను త్యాగం చేయడానికి కూడా తటపటాయించరు.

- హోచిమిన్



విశ్లేషణ

గెలుపు-పాఠాలు-సవాళ్లు

ఎం.వి.ఎస్. శర్మ



తన నవ రత్నాలూ తమ పార్టీని గ్యారంటీగా గెలిపిస్తాయని జగన్ బలంగా నమ్మారు. దానినే పదే పదే చెప్తూ వచ్చారు. కాని ఆ నవరత్నాలు జగన్ పార్టీకి 40 శాతం ఓట్లను తెచ్చిపెట్టాయి తప్ప గెలుపును ఇవ్వడానికి సరిపోలేదు. ప్రజలకు ఏమిచ్చాం మనం అనేది మాత్రమే సరిపోదని, ఎలా పరిపాలించాం, వారితో పదవీ కాలమంతా ఎలా మెలిగాం అన్నది కూడా ప్రధానం అని ఫలితాలు చెప్తున్నాయి. ప్రజాస్వామ్యంలో ప్రజల మనోభావాలను ఎప్పటికప్పుడు పట్టించుకుంటూ వుండాలి అన్నది పాలకులు విస్మరించకూడదు. దానిని విస్మరించి ప్రజాసంఘాలతో గాని, ఉద్యమాల ప్రతినిధులతోగాని, తక్కిన రాజకీయ పక్షాలతోగాని జగన్ ఏనాడూ సంప్రదింపులు చేయలేదు. వారిచ్చిన సలహాలను గాని, వారి డిమాండ్లను గాని చెవిన పెట్టనూలేదు. పైగా నిరంకుశంగా ప్రజా ఉద్యమాలను అణచివేశారు. నిర్బంధాలకు పూనుకున్నారు.

ఎన్నికల్లో ఓడిపోయినవారు ఎందుకు తాము ఓటమి పాలయ్యామని మథనపడతారు, ఆ ఓటమిని జీర్ణించుకున్నాక అది నేర్పిన పాఠాలేమిటో తెలుసుకుంటారు. ఐతే, గెలిచినవారు ఆ గెలుపు నుండి నేర్చుకుంటారా అన్నది ప్రశ్న. ఓటమి మాదిరిగానే గెలుపు కూడా ఒక అనుభవమే. ప్రతీ అనుభవమూ పాఠాలను మన ముందుంచుతుంది. నేర్చుకోవడం, లేదా పట్టించుకోకపోవడం అనేది మన వంతు.

తెలుగుదేశం కూటమి సాధించినది నిస్సందేహంగా ఘన విజయమే. రాజకీయ పండితుల అంచనాలను మించిపోయి 164 సీట్లు గెలుచుకున్నారు. దాదాపు ఇదే స్థాయిలో గత ఎన్నికలలో 151 సీట్లు ఒక్క వైసిపినే గెలుచుకుంది. ఐదేళ్ళు పూర్తయ్యేసరికి అందులో మధ్యన ఉన్న '5' అదృశ్యమై 11 సీట్లు మాత్రం మిగిలాయి. కాబట్టి ఐదేళ్ళ తర్వాత మళ్ళీ ప్రజల వద్దకు పోయి తీర్పు కోరవలసి వుంటుంది అనేది పదవీ కాలం మొత్తంలో మరిచిపోకూడదని ఇప్పుడు గెలిచినవారు గుర్తుంచుకోవాలి.

తన నవ రత్నాలూ తమ పార్టీని గ్యారంటీగా గెలిపిస్తాయని జగన్ బలంగా నమ్మారు. దానినే పదే పదే చెప్తూ వచ్చారు. కాని ఆ నవరత్నాలు జగన్ పార్టీకి 40 శాతం ఓట్లను తెచ్చిపెట్టాయి తప్ప గెలుపును ఇవ్వడానికి సరిపోలేదు. ప్రజలకు ఏమిచ్చాం మనం అనేది మాత్రమే సరిపోదని, ఎలా పరిపాలించాం, వారితో పదవీ కాలమంతా ఎలా మెలిగాం అన్నది కూడా ప్రధానం అని ఫలితాలు చెప్తున్నాయి. ప్రజాస్వామ్యంలో ప్రజల మనోభావాలను ఎప్పటికప్పుడు పట్టించుకుంటూ వుండాలి అన్నది పాలకులు విస్మరించకూడదు. దానిని విస్మరించి ప్రజాసంఘాలతో గాని, ఉద్యమాల ప్రతినిధులతోగాని, తక్కిన రాజకీయ పక్షాలతోగాని జగన్ ఏనాడూ సంప్రదింపులు చేయలేదు. వారిచ్చిన సలహాలను గాని, వారి డిమాండ్లను గాని చెవిన పెట్టనూలేదు. పైగా నిరంకుశంగా ప్రజా ఉద్యమాలను అణచివేశారు. నిర్బంధాలకు పూనుకున్నారు. ఈ మారు గెలిచిన తర్వాత చంద్రబాబు మాట్లాడుతూ తాను పూర్తిగా మారిపోయానని, మారిన చంద్రబాబును మీరంతా చూడబోతున్నారని ప్రకటించారు. అందరు చెప్పేవీ విని పని చేస్తానని కూడా చెప్పారు. మంచిదే. ఐతే ఇది ఆచరణలో తేలే విషయం. కనుక ఐదేళ్ళ పాటూ ప్రజాస్వామ్యయుతంగా పని చేయనున్నారా లేదా పాత, ఏకపక్ష పోకడలలోకే మళ్ళీ వెనుదిరుగుతారా అన్నది చూడాల్సిందే. ఏమైనా, జగన్ నిరంకుశ పాలనను తిరస్కరించాలనుకున్నారు గనుకనే ప్రజలు తమకు ఈ గెలుపునిచ్చారు అన్నది చంద్రబాబు మరిచిపోకూడని విషయం. అప్పటి నవరత్నాలు, లేదా ఇప్పుడు సూపర్ సిక్స్ మాత్రమే సరిపోవు.

ఆంధ్రప్రదేశ్‌లో ఎన్డీయే కూటమి ఘన విజయం సాధించింది అని మోడీతో సహా చాలామంది చెబుతున్నారు. కాని కాస్తంత వివరాల్లోకి పోతే ఈ రాష్ట్ర ప్రజలు టిడిపి, జనసేనలకు ఇచ్చిన మోతాదులో బిజెపికి విజయాన్ని ఇవ్వలేదు అన్నది కనిపిస్తుంది. ముఖ్యంగా పార్లమెంటు సీట్లు పరిశీలిస్తే, 17 స్థానాలకు పోటీ చేసిన టిడిపి 16 స్థానాల్లో గెలిచింది. రెండింటికి పోటీ చేసి జనసేన రెండింటిలోనూ గెలిచింది. కాని 6 స్థానాల్లో పోటీ చేసిన బిజెపి ఇంత వెల్లువలో కూడా మూడింట్లోనే గెలిచింది. బిజెపి ఓడిపోయిన మూడింట్లోనూ వైసిపి గెలిచింది. అవి గాక తమ పునాది అయిన కడపలో మాత్రమే వైసిపి గెలిచింది. తిరుపతి పార్లమెంటు సీటు పరిధిలోని ఏడు అసెంబ్లీ స్థానాలనూ టిడిపి, జనసేనలు గెలుచుకున్నాయి. కాని ఆ పార్లమెంటు సీటును మాత్రం వైసిపి గెలుచుకుంది. తిరుపతి ఒక ఆధ్యాత్మిక కేంద్రంగా ఉన్నందున దానిని ఆధారం చేసుకుని తమ మత విద్వేష రాజకీయాలను నడపడానికి బిజెపి, దాని పరివారం ప్రయత్నిస్తూనే వున్నాయి. అక్కడ బిజెపిని తిరస్కరించి అసెంబ్లీ స్థానాల్లో టిడిపి, జనసేనలను గెలిపించిన ప్రజలు మత విద్వేష రాజకీయాలకు వ్యతిరేకంగా తీర్పునిచ్చారు. అరుకు పార్లమెంటు పరిధిలో టిడిపి, జనసేన ఐదు అసెంబ్లీ స్థానాలను గెలిచాయి. అరుకు అసెంబ్లీ స్థానంలో బిజెపి ఏకంగా మూడో స్థానానికి పడిపోయింది. పార్లమెంటు స్థానంలోనూ ఓడిపోయింది. మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న ఆదివాసీ వ్యతిరేక విధానాలను ప్రజలు తిరస్కరించారన్నది స్పష్టంగా కనపడుతోంది. గిరిజన ప్రజల మనోగతం చంద్రబాబుకు బోధపడితే ఆ విధానాల నుండి విడగొట్టుకుని నిలబడాల్సి వుంటుంది. రాష్ట్ర ప్రజలు తమ ముందు ఉన్నవి ప్రధానంగా రెండే ఆప్షన్లు అని అనుకున్నారు. జగన్ నిరంకుశ పాలనకు, విపరీతంగా మోపిన భారాలకు వ్యతిరేకంగా స్పందించారు గనుక రెండో ఆప్షన్‌గా తాము గుర్తించిన టిడిపి కూటమిని గెలిపించారు. అదే సమయంలో కేంద్రం లోని మోడీ పాలనను కూడా తమకు అవకాశం ఉన్న మేరకు తిరస్కరించారు.

ఇప్పుడు చంద్రబాబు తాను మరోసారి కింగ్ మేకర్‌గా ఉన్నానని సంతోష పడవచ్చు. కాని తనను ఇక్కడ కింగ్‌ని చేసిన ప్రజలు అసలైన కింగ్ మేకర్లు. వాళ్ళకి మోడీ పట్ల ఎంత వ్యతిరేకత ఉందో కనిపిస్తూనే వుంది. అయినా, ఎన్డీయేలోనే కొనసాగుతాం అని టిడిపి, జనసేనలు ప్రకటించాయి. పొత్తు ధర్మం అని ఇప్పుడు సమర్థించుకోవచ్చు. కాని మోడీ ప్రభుత్వం అనుసరించే విధానాలు దేశ లౌకిక స్వభావానికి విరుద్ధంగా ఉన్నప్పుడు టిడిపి, జనసేన భవిష్యత్తులోనైనా ప్రతిఘటిస్తాయా లేదా అన్నది ప్రజలు చూస్తారు. ఆ విషయాన్ని చంద్రబాబు, పవన్ కళ్యాణ్ గుర్తుంచుకోవాలి.

బేషరతుగా ప్రతీసారీ మోడీ చట్టాలకి అనుకూలంగా చేతులెత్తి, కేంద్రం ఆదేశాలకు తలొగ్గి ప్రజలమీద భారాలను మోపిన జగన్ మాదిరిగానే రానున్న రోజుల్లో చంద్రబాబు వ్యవహరిస్తారా? అన్నది ప్రజలు తప్పకుండా నిశితంగా పరిశీలిస్తారు. లౌకిక తత్వం, ప్రజాస్వామ్యం, రాష్ట్రాల హక్కులు, సామాజిక న్యాయం, స్వావలంబన వంటి విషయాలు ప్రజలకు అర్థం కాని విషయాలని, వాళ్ళకు ఏవో కొన్ని సంక్షేమ పథకాలను అమలు చేసేస్తే సరిపోతుందని ప్రజా చైతన్యాన్ని తేలికగా తీసుకుంటే ఏమౌతుందో చంద్రబాబుకు తెలియాలి. 2019లో ఒకసారి ప్రజలు తెలియజెప్పారు కూడా. ఒకే పాఠాన్ని మళ్ళీ మళ్ళీ చెప్పించుకోవడం చంద్రబాబు వంటి అనుభవజ్ఞుడైన రాజకీయవేత్తకు తగదు.


మరో ముఖ్యమైన విషయం విభజన హామీలు. బిజెపి చేసిన ద్రోహాన్ని ఈ రాష్ట్ర ప్రజలు మరిచిపోలేదు. మెజారిటీ ఇస్తే ఆ హామీలను సాధిస్తానని చెప్పి ఆ తర్వాత వాటి ఊసే ఎత్తని జగన్‌నూ క్షమించలేదు. ఇప్పుడు వాటి విషయంలో చంద్రబాబు, పవన్ ఏం చేయబోతున్నారో ప్రజలు నిశితంగా పరిశీలిస్తారు. ప్రత్యేక హోదా, పోలవరం నిర్వాసితుల పునరావాసం, తదితర విభజన చట్టపు హామీల అమలు కోసం చంద్రబాబు ఏం చేయబోతారనేది చూస్తారు. "నాకు మెజారిటీ ఇచ్చినా, కేంద్రంలో మోడీకి కూడా మెజారిటీ ఇచ్చారు గనుక ఒత్తిడి చేయలేకపోతున్నాను" అని గతంలో జగన్ అన్నారు. ఇప్పుడు అటువంటి వాదన చంద్రబాబు చేయలేరు. ఎందుకంటే మోడీకి ఉన్న బలాన్ని ప్రజలు దిగ్గోశారు. ఇప్పుడు మోడీ పట్ల మిత్ర ధర్మం పాటించడం అనే పేరుతో మోడీ ఏం చేసినా తలూపాల్సిన అగత్యం ఏమీ లేదు. అదే మిత్ర ధర్మాన్ని మోడీ కూడా పాటించి మిత్రుల డిమాండ్లను నెరవేర్చాలి. కాని బిజెపికి మిత్ర ధర్మం అనేది ఏనాడూ పడని మాట. ఒకప్పటి ఆ పార్టీ మిత్రులను ఎవరిని అడిగినా చెప్తారు. అంతెందుకు? 2014 లోనూ బిజెపి ఇక్కడ టిడిపి కి మిత్రుడే కదా? మరి ఎందుకు 2018లో విడగొట్టుకుని మోడీతో తలపడవలసి వచ్చింది? అందుచేత అనివార్యంగా రాష్ట్ర ప్రయోజనాల కోసం బలంగా కేంద్రంతో తలపడాల్సి వుంటుంది. ఆ విధంగా తలపడతారా? లేక వన్ సైడ్ లవ్ మాదిరిగా ప్రతీసారీ మోడీకి అనుకూలంగా చేతులెత్తుతూ వుంటారా? ఇది చంద్రబాబు, పవన్ ల ముందున్న సవాలు.

మరో విషయం రాజధాని. మూడు రాజధానులంటూ జగన్ ముందుకు తెచ్చిన అర్థంలేని ప్రతిపాదనను ప్రజలు ఎప్పుడూ ఆమోదించలేదు. రాయలసీమలోనూ, ఉత్తరాంధ్ర లోనూ ఆ ప్రతిపాదనకు ఆది నుంచీ సానుకూలత వ్యక్తం కానేలేదు. ఆ విషయమై తీర్పు ఇచ్చేటప్పుడు ప్రజలు జగన్ ది తప్పు అని తేల్చేశారు. మరి అమరావతి అనే రంగుల కలను ప్రజలకు, ముఖ్యంగా ల్యాండ్ పూలింగ్‌లో భూములిచ్చిన రైతులకు చూపించిన చంద్రబాబు ఇప్పుడు ఆ కలను ఎంతమేరకు సాకారం చేస్తారో చూడాలి. దానినీ పోలవరం మాదిరిగానే దశాబ్దాల తరబడి సాగదీసి ఎటూ కాకుండా చేస్తారా లేక వేగంగా అడుగులు పడతాయా అన్నది ప్రజలు చూస్తారు. 'విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు' అని సాధించుకున్న ప్రతిష్టాత్మక కర్మాగారాన్ని ప్రైవేటీకరించాలన్న నిర్ణయాన్ని చంద్రబాబు-పవన్ కళ్యాణ్ కేంద్ర ప్రభుత్వం చేత ఉపసంహరింపచేయాలి. మూడేళ్లకు పైగా అక్కడి కార్మిక వర్గం, రాష్ట్ర ప్రజలూ ప్రతిఘటించడం వల్ల ఆగినా ఆ కుట్రకు ఇప్పటికైనా ముగింపు పలకాలి. రాష్ట్రంలోని నిరుద్యోగ యువత చంద్రబాబు ఐ.టి రంగంలో ఏవో మార్పులు చేయగలరు అని అనుకుంటున్నారు. హైదరాబాద్ లో ఐ.టి ని తానే అభివృద్ధి చేశానని చంద్రబాబు పదే పదే చెప్తూ వస్తున్నారు. అదే వాస్తవం అయితే ఇప్పుడు ఆంధ్రప్రదేశ్ లోనూ అభివృద్ధి చేస్తారు కదా అని సాఫ్ట్‌వేర్ నిరుద్యోగులంతా ఆశపడుతున్నారు. ఐదేళ్ళ తర్వాతనైనా వాళ్ళకి సమాధానం చెప్పవలసి వుంటుందని చంద్రబాబు మరిచిపోకూడదు. ముఖ్యంగా ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ టెక్నాలజీ ప్రపంచ వ్యాప్తంగా సాఫ్ట్‌వేర్ రంగంలోని ఉపాధి అవకాశాలను సవాలు చేస్తున్న నేపథ్యంలో హైదరాబాద్ తరహాలోనో, బెంగళూరు తరహాలోనో మరో ఐ.టి కేంద్రం అభివృద్ధి కావడం అనేది ప్రశ్నార్థకం. మరి చంద్రబాబు, లోకేశ్ ఏమైనా వినూత్న పద్ధతులను ఆవిష్కరిస్తారేమో చూడాలి.

గెలుపు నేర్పుతున్న పాఠాలను సక్రమంగా స్వీకరించి ముందడుగులు వేస్తే తీర్పిచ్చిన ప్రజలకు న్యాయం జరుగుతుంది.

అరుకు అసెంబ్లీ స్థానంలో బిజెపి ఏకంగా మూడో స్థానానికి పడిపోయింది. పార్లమెంటు స్థానంలోనూ ఓడిపోయింది. మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న ఆదివాసీ వ్యతిరేక విధానాలను ప్రజలు తిరస్కరించారన్నది స్పష్టంగా కనపడుతోంది. గిరిజన ప్రజల మనోగతం చంద్రబాబుకు బోధపడితే ఆ విధానాల నుండి విడగొట్టుకుని నిలబడాల్సి వుంటుంది. రాష్ట్ర ప్రజలు తమ ముందు ఉన్నవి ప్రధానంగా రెండే ఆప్షన్లు అని అనుకున్నారు. జగన్ నిరంకుశ పాలనకు, విపరీతంగా మోపిన భారాలకు వ్యతిరేకంగా స్పందించారు గనుక రెండో ఆప్షన్‌గా తాము గుర్తించిన టిడిపి కూటమిని గెలిపించారు. అదే సమయంలో కేంద్రం లోని మోడీ పాలనను కూడా తమకు అవకాశం ఉన్న మేరకు తిరస్కరించారు.

కవిత్వం



ఓ.. అయ్యా...!!

ఏలిక పగ్గాలు పట్టించాం
పదవి బండిఎక్కించినాం
నువ్వు నడిపే తీరులోనే
సమస్తం ఆసీనమై వుంది
ఓ అయ్యా
ఏలుబడికి కాస్త
ముసుగు తీసి నడపండి.

మరమ్మతులన్నీ
గుడ్లప్పగించి చూస్తున్నాయి
వెనుకబడిన బతుకులన్నీ
గుమ్మంకేసి కాచుక్కూర్చున్నాయి
మెతుకంటని కడుపులన్నీ
ఏలికనే కలవరిస్తున్నాయి
పట్టాభిషేకమయ్యాక
కూసింత కన్ను తెరవండి.

ఆగిపోయిన పనులన్నీ
అంగలారుస్తున్నాయి
జరగాల్సిన ముచ్చట్లన్నీ
మూగబోయి కూర్చున్నాయి
విత్తుకునే శక్తి లేదని
విత్తనాలు నవ్వుతున్నాయి
కలవరింతలన్నీ
పథకాల వైపే చూస్తున్నాయి
కాసింత కాలు కదపండి.

ఎగుడు దిగుడు దారులన్నీ
నడుం విరిగి కూలబడ్డాయి
ఊపిరి సలుపని జీవనాలన్నీ
భరోసాల వైపు చూస్తున్నాయి
సర్దుబాట్లు దిద్దుబాట్లు చేశాక
ముద్ద గడవని గూడుకింత
రెక్కలాడే శక్తిని నింపండి.

ఓ అయ్యా
నమ్మి ముద్దరేసిన వేలికి
ఇంకు మరక పోనేలేదు
వాగ్దానాలన్నీ
మస్తిష్కంలో కదులుతున్నాయి
కాసింత నమ్మికకు
గోరంత ఆయువు పోయండి.

- నరెద్దుల రాజారెడ్డి
సెల్:9666016636

వ్యాఖ్య

ఫలితం ఇలా కూడా...

'నీవు చేసిన పాపం నీడలా నీ వెంటే వస్తుంది' - భగవద్గీత శ్లోకం.

చాలా మంది రాజకీయ నేతలకు ఫలితాలు అలానే అర్థమవుతున్నాయి. కానీ బాలీవుడ్ సెలబ్రిటీ కంగనా రనౌత్‌కు మరో రూపేణా అర్థమయింది.

ఢిల్లీ వెళ్ళేందుకు గురువారం నాడు చండీగఢ్ విమానాశ్రమానికి వచ్చిన కంగనాకు ఈ చేదు అనుభవం ఎదురయింది. ఎయిర్ పోర్టులో సెక్యూరిటీ చెక్ పూర్తి చేసుకుని లోపలికి వెళ్తుంటే ఓ మహిళా కానిస్టేబుల్ ఆమెకు హఠాత్తుగా ఎదురొచ్చి చెంప చెళ్ళుమనిపించింది.

'నా రైతులకు మద్దతుగా నేనీ పని చేశా...!' అని ఘాటుగా జవాబిచ్చింది.

నాలుగేళ్ళ క్రితం భారత రైతాంగానికి వ్యతిరేకంగా మోడీ ప్రభుత్వం మూడు నల్ల చట్టాలను తీసుకువచ్చింది. కొందరు వాటిని నిస్సిగ్గుగా సమర్థించారు. ఆ చట్టాలను బేషరతుగా రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఎండనకా వాననకా చలిగాలులను కూడా లెక్క చేయకుండా, చివరకు నీటిఫిరంగులు, బాష్పవాయువులు, లాఠీచార్జీ వంటి పోలీసు దమనకాండను సైతం ఎదుర్కొని వేల సంఖ్యలో రైతులు నెలల తరబడి రాజధాని రోడ్లపై బైఠాయించారు.

అప్పుడు ఆ రైతులను దూషిస్తూ వీళ్ళంతా కేవలం 100 రూపాయల కోసం వచ్చిన బాపతుగాళ్ళంటూ కంగనా కించపరిచారు. "ఆనాడు ధర్నా చేసిన వారిలో మా అమ్మ కూడా ఉన్నది. మా అమ్మ రైతు. మా అన్న రైతు. మాది రైతు కుటుంబం. ఆమెకు నిజం తెలిస్తే... ఓ రైతులాగా ఆమె రోడ్డు మీద కూర్చొని ధర్నా చేయగలదా...? అంటూ ఆ మహిళా కానిస్టేబుల్ ఆక్రోశంతో ప్రశ్నించారు.

ఇప్పుడు ఆ వీడియో వైరల్ అవుతూ 'భారత్ కి బేటీ' అనే ప్రశంసల పాటతో మోగుతున్నది.

కంగనా రనౌత్ ఎంపీ కూడా. అయినా ఆ కానిస్టేబుల్ ఆమెపై చేయి చేసుకున్నారు. పంజాబ్‌లో ఉగ్రవాదం, హింసాత్మక ఘటనలు పేట్రేగిపోతున్నాయని కంగనా అంటున్నారు.

సదరు కానిస్టేబుల్ కుల్వీందర్ కౌర్‌ను సస్పెండు చేసి ఎఫ్.ఐ.ఆర్. నమోదు చేసి కేసు దర్యాప్తు ప్రారంభించామని హర్యానా ముఖ్యమంత్రి నయాబ్ సింగ్ సైనీ చెప్పారు. ఘటన ఎయిర్‌పోర్ట్‌లో జరిగింది



గనుక, ఆ కానిస్టేబుల్ సి.ఐ.ఎస్.ఎఫ్ ఉద్యోగి గనుక, కోర్ట్ ఆఫ్ ఎంక్వైరీని నిర్వహిస్తున్నట్టు తెలిపారు.

కంగనా బిజెపి మౌత్ పీస్ అనే విషయం తెలిసిందే. గోడీ మీడియా ఆమెను అలానే హైలెట్ చేసింది కూడా. చివరకు ఆమె 2014 వరకు భారత్ ప్రజలకు నిజమైన స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు ఏమిటో, తెలియవని, మోడీ ప్రధాని అయ్యాకే అవి ప్రజలకు లభించాయని సెలవిచ్చారు.

ఒక మనిషిని ఒకే పార్శ్వం నుండి చూసి అర్థం చేసుకోవడం సరికాదని, ప్రతి మనిషికి ఆత్మగౌరవమే (సెల్ఫ్ డిగ్నిటీ) అసలైన చిరునామా అని ఈ ఘటన ద్వారా మరోసారి విదితమవుతున్నది.

ఒక వస్తువును ఒక పార్శ్వం నుండి చూస్తే ఒకలా మరో పార్శ్వం నుండి చూస్తే మరోలా కనిపిస్తుంది. నాణేన్ని బొమ్మ వైపు చూసిన వారికి బొమ్మగానూ, బొరుసువైపు నుండి చూసిన వారికి బొరుసుగానూ, కన్పిస్తుంది. ఎవరిది వారికి కరెక్ట్‌గానే కన్పిస్తుంది. నాదే కరెక్టు. అవతలివారిదే తప్పు అంటే కుదరదు. అది మూర్ఖత్వం అవుతుంది. నీది నీకెంత కరెక్టో అవతలవారిది వారికి అంతే కరెక్ట్ అనే గ్రహింపు ఉండాలి. దీనినే వస్తుగత దృష్టి (ఆబ్జెక్టివ్ రియాలిటీ) అంటారు.

కాగా, ఇంగ్లీషులో 'ఎంపథీ అనే పదం ఉన్నది. దీనినే తెలుగులో 'సహానుభూతి' అంటారు. ఉదాహరణకు బస్టాండ్‌లో, రైల్వేస్టేషన్‌లో అంధ బిచ్చగాళ్ళు కన్పిస్తుంటారు. మనకు జాలివేసి ఐదో, పదో రూపాయలు దానం చేయవచ్చు. అయ్యో పాపం.. అనుకోవచ్చు. అది కేవలం సానుభూతి (సింపథీ) మాత్రమే. ఎంపథీ అంటే నేనే ఆ గుడ్డి బిచ్చగాని స్థానంలో ఉంటే... (ఫీల్ లైక్ ఎ క్లైంట్, ఫీల్ లైక్ ఎ పేషెంట్, ఫీల్ లైక్ ఎ రోల్) ఆ బాధ, ఆ నొప్పి, ఆ కష్టం ఏమిటో కొంతలో కొంతైనా అర్థమవుతుంది. అదీ నిజాయితీగా ఉంటేనే సుమా....

మెడిసిన్, సైకాలజీ, సోషల్ వర్క్ విద్యార్థులకు ఇది పాఠంగా కూడా ఉంటుంది. అలాగే రంగస్థలం (థియేటర్) విద్యార్థులకు కూడా. ఎందుకంటే వారు రకరకాల పాత్రలు అభినయించాల్సి ఉంటుంది కదా...

మరింత పెద్ద సెలబ్రిటీ కంగనా రనౌత్‌కు ఆ మాత్రం తెలియదా? రైతుల బాధలంటే ఏమిటో...? కష్టాలంటే ఏమిటో...? తెలియకపోవచ్చు. ఒకవేళ తెలిసినా తమ స్వప్రయోజనాన్ని ప్రేమించినంతగా ఇతరులను వారు ప్రేమించలేరు. అసలు ఇతరులను అర్థం చేసుకోలేరు. అనే విషయం మనకు అర్థమవుతుంది. అయితే ఆత్మాభిమానం (ఆత్మగౌరవం) దెబ్బ తింటే ఎప్పుడైనా, ఎవరైనా, ఎక్కడైనా ప్రతీకారం తీర్చుకుంటారనే విషయం కూడా తెలుసుకోవాలి. చర్యకు ప్రతి చర్య లాంటిది. అది ఏ రూపంలోనైనా సరే... ఎన్నికల ఫలితాలు చాలా వరకు అదే విషయాన్ని చెప్తున్నాయి కదూ....!

- కె. శాంతారావు,
సెల్ : 9959745723

నాలుగేళ్ళ క్రితం భారత రైతాంగానికి వ్యతిరేకంగా మోడీ ప్రభుత్వం మూడు నల్ల చట్టాలను తీసుకువచ్చింది. కొందరు వాటిని నిస్సిగ్గుగా సమర్థించారు. ఆ చట్టాలను బేషరతుగా రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఎండనకా వాననకా చలిగాలులను కూడా లెక్క చేయకుండా, చివరకు నీటిఫిరంగులు, బాష్పవాయువులు, లాఠీచార్జీ వంటి పోలీసు దమనకాండను సైతం ఎదుర్కొని వేల సంఖ్యలో రైతులు నెలల తరబడి రాజధాని రోడ్లపై బైఠాయించారు. అప్పుడు ఆ రైతులను దూషిస్తూ వీళ్ళంతా కేవలం 100 రూపాయల కోసం వచ్చిన బాపతుగాళ్ళంటూ కంగనా కించపరిచారు. "ఆనాడు ధర్నా చేసిన వారిలో మా అమ్మ కూడా ఉన్నది. మా అమ్మ రైతు. మా అన్న రైతు. మాది రైతు కుటుంబం. ఆమెకు నిజం తెలిస్తే.... ఓ రైతులాగా ఆమె రోడ్డు మీద కూర్చొని ధర్నా చేయగలదా...? అంటూ ఆ మహిళా కానిస్టేబుల్ ఆక్రోశంతో ప్రశ్నించారు.

అభిప్రాయం

ఆకలి బాల్యం

ప్రపంచ వ్యాప్తంగా ప్రతి నలుగురు బాలల్లో ఒకరు తీవ్రమైన ఆహార కొరతతో బాధపడుతున్నారని 'యునిసెఫ్' నివేదిక పేర్కొంది. కనీసం కడుపు నిండా తిండి లేక అనేక పేద, మధ్య ఆదాయ దేశాల్లో బాలలు తీవ్రమైన అనారోగ్యాలతో ఇబ్బంది పడుతున్నారు. దాదాపు 44 కోట్ల మంది బాలలు సుమారు 100 అత్యల్ప ఆదాయ దేశాల్లో క్షుద్బాధతో కునారిల్లుతున్నట్లు యునిసెఫ్ తాజాగా తెలిపింది. బాలలు సంపూర్ణ ఆరోగ్యంగా ఎదగడానికి పాలు, ఆహార పదార్థాలు, విటమిన్లు, మినరల్స్, ప్రోటీన్లు వంటివి అవసరం. వీటిలో కేవలం రైస్, కొంత మేరకు పాలు మాత్రమే సగం బాలలకు అందుతున్నట్లు తెలుస్తోంది. ఇటువంటి పరిస్థితుల్లో సంపూర్ణ పోషకాహార లోపంతో భవిష్యత్తులో యువత చదువులోనూ, ఆరోగ్యంలోనూ తీవ్రమైన ఇబ్బంది పడుతుందని ఆరోగ్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. వ్యాధి నిరోధక శక్తి లేకపోవడం వలన తరచూ వ్యాధులు, రోగాల బారినపడే అవకాశం ఉంది.

ఆహార కొరతతో బాధపడుతున్న ఈ 44 కోట్ల మందిలో సుమారు 18 కోట్ల మంది తీవ్రమైన ఆహార కొరతతో బాధపడుతున్నారు. వీరిలో అత్యధికులు సోమాలియా లోనే ఉన్నారు. తరువాత స్థానంలో గినియా, ఆఫ్ఘనిస్తాన్ వంటి దేశాల్లో ఉన్నారు. మన దేశంలో కూడా అనేకమంది బాలలు తినడానికి తిండి లేక అలమటిస్తూ మన కళ్ళ ముందే కనపడుతున్నారు. భిక్షాటన చేస్తున్నారు. అయితే, రకరకాల వేడుకల్లో, విజయోత్సవ సంబరాల్లో విగ్రహాలకు, చిత్రపటాలకు అభిమానంతో "పాలాభిషేకం, క్షీరాభిషేకం" చేస్తూ ఉంటారు. పిల్లలు తాగే పాలు ఇలా వృథా చేయడం భావ్యమా...!? ఇకనైనా అందరూ ఆలోచన చేయాలి. ఇటువంటి పాలు బాలలకు అందించడం మంచిది.

సరైన పోషకాహారం లేకపోవడం వలన... రేపటి యువతగా మారాల్సిన నేటి తరం బాలలు తీవ్రమైన అనారోగ్యాలకు గురవుతూ, శారీరక మానసిక ఆరోగ్యం లేక ప్రపంచ వ్యాప్తంగా పెద్ద సమస్యగా మారుతున్నది. కావున ప్రతీ దేశం తమ తమ దేశంలో బాలల సంరక్షణకు ప్రత్యేక దృష్టి సారించాలి. అభివృద్ధి చెందిన దేశాలు బాలల సంక్షేమానికి యునిసెఫ్ వంటి సంస్థలకు ఆర్థిక సహకారం అందించాలి. వారి ఆరోగ్య రక్షణలో కీలక పాత్ర పోషించాలి. ఉద్రిక్తతలు, యుద్ధాల సమయంలో బాలల సంరక్షణకు, పోషణకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి. పాలస్తీనాలో ఇజ్రాయిల్ చేస్తున్న దమనకాండలో అభం శుభం ఎరుగని బాలలు ఆకలితో అల్లాడుతున్నారు. భవిష్యత్తులో ఇటువంటి పరిస్థితులు లేకుండా ఐక్యరాజ్యసమితి ప్రధాన పాత్ర పోషించాలి.

- ఐ.పి.రావు

కేంద్ర మంత్రివర్గంలో రాష్ట్రానికి అన్యాయం

- సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో



కేంద్ర మంత్రి పదవుల విషయంలో, శాఖల కేటాయింపు అంశంలో రాష్ట్రానికి మరోమారు అన్యాయం జరిగిందని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ అన్నారు. ఈ మేరకు సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రధాని మోడీ నేతృత్వంలోని కేంద్ర బిజెపి ఎపికి మరోమారు అన్యాయం చేసిందన్నారు. రాష్ట్రం నుంచి ఒక పూర్తిస్థాయి మంత్రినే మంత్రివర్గంలోకి తీసుకుందని, అది కూడా రాష్ట్రానికి ఏమాత్రం ప్రయోజనం చేకూర్చని పౌర విమానయానశాఖను కేటాయించిందని అన్నారు. రాష్ట్రాభివృద్ధికి, మౌలిక సదుపాయాల కల్పనకు అవకాశం ఉన్న శాఖలను కేటాయించకపోవటం విచారకరమన్నారు. జనసేనకు కేంద్ర మంత్రివర్గంలో అసలు చోటే కల్పించలేదన్నారు. ఇద్దరికి సహాయ మంత్రి పదవులు ఇచ్చినప్పటికీ వారికి స్వతంత్ర హోదా లేదన్నారు.

తాగునీటికి ప్రాధాన్యత

- రాజధానిలో 10 ఎంఎల్‌డి ప్లాంటు నిర్మాణం
- తాగునీటి ఇబ్బందుల్లేకుండా ప్రభుత్వం నిర్ణయం
- వేగంగా పనులు చేస్తున్నాం : కమిషనర్ వివేక్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాజధాని నిర్మాణ పనులకు సంబంధించి పనులు వేగవంతం అవడంతో అక్కడకు వచ్చేవారికి, ఇప్పుడున్న భవనాల్లోకి వచ్చేవారికి, హైకోర్టుకు తాగునీటి అవసరాలు తీర్చే అంశంపై సిఆర్‌డిఎ అధికారులు దృష్టి సారించారు. వీలైనంత తొందరగా 10 ఎంఎల్‌డి ప్లాంటు ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నుండి ఆదేశాలు అందాయి. దీంతో ఇప్పటికే సగం నిర్మాణం పూర్తయిన ప్లాంటు పనులను వేగవంతం చేశారు. సోమవారం సిఆర్‌డిఎ కమిషనర్ వివేక్‌యాదవ్ అక్కడకు వెళ్లి పరిశీలించారు. రాజధానిలో తక్షణ అవసరంగా 75 వేల మందికి నీటి అవసరాలు తీర్చేలా ప్లాంటును సిద్ధం చేయాలని స్థానిక అధికారులను ఆదేశించారు. ఎపి సచివాలయం, హైకోర్టు, అసెంబ్లీ భవనాలకు ఈ ప్లాంటు నుంచి నీటిని సరఫరా చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఇప్పటికే రాజధానిలో ముళ్ల కంప తొలగింపు పనులు 24 గంటలూ జరుగుతున్నాయని చెప్పారు. వారంరోజుల్లో దాదాపు క్లియర్ చేస్తామని, నేలచదును పనులు కూడా చేపడతామని అన్నారు. రాయపూడిలో సిఆర్‌డిఎ కార్యాలయానికి సోమవారం నుంచి రంగులు వేసే పని మొదలుపెట్టారు.

రాయపూడి నుండే పర్యవేక్షణ

అమరావతి రాజధాని పనులను రాయపూడి కార్యాలయం నుండే పర్యవేక్షణ చేయాలని సిఆర్‌డిఎ అధికారులు నిర్ణయించారు. వీలైనంత త్వరగా ఇంటీరియర్ పూర్తయితే అక్కడ నుంచే పనులు చేపట్టనున్నారు. అలాగే అమరావతి నిర్మాణ ప్రక్రియ మొత్తం పర్యవేక్షించేందుకు అందులోనే కంట్రోల్ రూము కూడా ఏర్పాటు చేయనున్నారు. ఇక నుండి ప్రధాన సమీక్షలన్నీ ఆ భవనం నుండే చేయాలని నిర్ణయించారు.

వేగంగా సుందరీకరణ

తొలిదశలో రాజధాని అమరావతిలో రోడ్లపక్కన కంపను తొలగించి వీధిలైట్లు ఏర్పాటు చేయనున్నారు. దీనిలో భాగంగా ఉండవల్లి, ప్రకాశం బ్యారేజీ నుండి రాయపూడి వరకూ సీడ్ యాక్సెస్ రోడ్డును పూర్తిగా విద్యుదీకరించారు. అలాగే ఇప్పుడున్న పూలమొక్కలతోపాటు పెద్దయెత్తున అక్కడ గ్రీనరీ పనులు చేయాలని అధికారులను కమిషనర్ వివేక్ యాదవ్ ఆదేశించారు.

బిజెపి ఐటి సెల్ చీఫ్
అమిత్ మాలవీయ లైంగిక వేధింపులు

- ఆర్‌ఎస్‌ఎస్ నాయకుడు శంతను సిన్హా పోస్ట్
- లీగల్ నోటీసులిచ్చిన అమిత్

న్యూఢిల్లీ : బిజెపి ఐటి సెల్ చీఫ్ అమిత్ మాలవీయ లైంగిక వేధింపులకు పాల్పడ్డారని ఆర్‌ఎస్‌ఎస్ సభ్యుడు శంతను సిన్హా ఆరోపించారు. ఈ మేరకు సిన్హా సోషల్ మీడియాలో ఒక పోస్టు చేశారు. బిజెపి నాయకుడు రాహుల్ సిన్హా అనుయాయుడిగా చెబుతారు. 'బిజెపి ఐటి సెల్ చీఫ్ అమిత్ మాలవీయ నీచమైన కార్యాకలాపాలకు పాల్పడుతున్నాడు. మహిళలపై లైంగిక దోపిడీ చేస్తున్నాడు. కేవలం ఫైవ్ స్టార్ హోటళ్లలోనే కాదు, పశ్చిమ బెంగాల్‌లోని బిజెపి కార్యాయాల్లోనూ మహిళలపై లైంగిక దోపిడీ చేస్తున్నాడు' అని శంతను సిన్హాను తన పోస్టులో ఆరోపించారు. అమిత్ మాలవీయ ఎదుర్కొంటున్న ఆరోపణలపై కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా స్పందించింది. ఆర్‌ఎస్‌ఎస్‌కు చెందిన వ్యక్తే బిజెపి నాయకుడుపై లైంగిక ఆరోపణలు చేయడం అందరూ గుర్తించాల్సి విషయని కాంగ్రెస్ నాయకులు సుప్రియా శ్రీనాటే విలేకరుల సమావేశంలో అన్నారు. అమిత్ మాల్యవియాను తక్షణమే పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. 'మేం బిజెపిని కోరేది ఒక్కటే. మహిళలకు న్యాయం చేయమని. ప్రధాని మోడీ ప్రమాణ స్వీకారం చేసిన 24 గంటల్లోపే బిజెపికి చెందిన ప్రముఖ నాయకుడిపై లైంగిక దోపిడీకి సంబంధించిన తీవ్రమైన ఆరోపణలు వచ్చాయి' అని ఆమె అన్నారు.

శంతను సిన్హాకు అమిత్ లీగల్ నోటీసు

తనపై వచ్చిన ఆరోపణలను అమిత్ మాలవీయ ఖండించారు. శంతను సిన్హాకు లీగల్ నోటీసు పంపారు. ఈ నోటీసు అందిన మూడు రోజుల్లోగా పోస్టును వెంటనే తొలగించాలని, భేషరతుగా క్షమాపణలు చెప్పాలని కోరారు. లేనిపక్షంలో తనకు పరువునష్టం, మానసిక వేదన కలిగించినందుకు నష్టపరిహారంగా రూ.10 కోట్లుచెల్లించాల్సి వుంటుందని హెచ్చరించారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు దుర్మరణం

- ఎనిమిది మందికి గాయాలు
- పెదకాకాని వద్ద వరుసగా వాహనాలు ఢీకొనడంతో ప్రమాదం

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

గుంటూరు జిల్లా పెదకాకాని వద్ద సోమవారం రాత్రి ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఆగి ఉన్న లారీని వరసగా నాలుగు వాహనాలను ఢీకొనడంతో ఇద్దరు మృతి చెందారు. ఎనిమిది మంది తీవ్రంగా గాయపడ్డారు. పోలీసుల కథనం ప్రకారం.. పెద్దకాకాని వద్ద రెడీమిక్స్ వాహనాన్ని ఒక లారీ, ప్రయాణికులతో మంగళగిరి వెళ్తున్న టాటా మ్యాజిక్ వాహనం, మరో లారీ ఒకదానికొకటి వరుసగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో టాటా మ్యాజిక్ వాహనంలో ప్రయాణిస్తున్న తేజ (20), కుర్రా రాంబాబు (40) మృతి చెందగా, ఎనిమిది మందికి గాయాలయ్యాయి. తీవ్రంగా గాయపడిన జి.రవికుమార్, ఎ.తేజస్వినీ, ఎ. వాసుమతి, గుర్రం రఘురాం, కార్తికేయను గుంటూరులోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వీరికి, గుంటూరు జిజిహెచ్ సూపరింటెండెంట్ కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో చికిత్స అందిస్తున్నారు. మృతుల వివరాలు తెలియాల్సి ఉంది.

రాష్ట్రానికి రూ.5,655.72 కోట్లు పన్నుల వాటా

దేశవ్యాప్తంగా 28 రాష్ట్రాలకు రూ.1,39,750 కోట్లు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

కేంద్ర పన్నుల్లో వాటా కింద రాష్ట్రానికి రూ.5,655.72 కోట్లు విడుదలైంది. తెలంగాణకు రూ.2,937.58 కోట్లు విడుదలైంది. ఈ మేరకు సోమవారం కేంద్ర ఆర్థిక మంత్రిత్వశాఖ ఈ నిధులను విడుదల చేసింది. దేశవ్యాప్తంగా 28 రాష్ట్రాలకు కేంద్ర ప్రభుత్వం పన్నుల్లో వాటా కింద రూ.1,39,750.92 కోట్లను రాష్ట్రాలకు పంపిణీ చేసింది. అత్యధికంగా ఉత్తరప్రదేశ్‌కు రూ.25,066.88 కోట్లు, బీహార్‌కు రూ.14,056.12 కోట్లు, మధ్యప్రదేశ్‌కు రూ.10,970.44 కోట్లు, పశ్చిమబెంగాల్‌కు రూ.10,513.46 కోట్లు విడుదలయ్యాయి.

నిందితులు తెలిసినా అరెస్టు చేయలేదు

- పల్నాడు, తిరుపతి, అనంతపురం ఘటనలపై సిట్ నివేదిక
- కేసులు నీరుగారే విధంగా ఎఫ్ఐఆర్‌లు
- 264 పేజీలతో రెండు వ్యాల్యూములు
- డిజిపి, ఇసి కార్యాలయానికి నివేదిక

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఎన్నికల సమయంలో తలెత్తిన ఘర్షణల్లో నిందితులను రక్షించే విధంగా అప్పటి పోలీసు అధికారులు వ్యవహరించారని సిట్ నివేదిక పేర్కొంది.

ఎన్నికల రోజు, అనంతరం పల్నాడు, తిరుపతి, అనంతపురం జిల్లా తాడిపత్రిలో జరిగిన హింసపై ఎన్నికల సంఘం సిట్ ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. దీనికి ఐజి వినీత్ బ్రిజ్‌లాల్‌ను చీఫ్‌గా నియమించింది. ప్రాథమిక విచారణ అనంతరం 267 పేజీలతో కూడిన రెండు వ్యాల్యూములను సోమవారం డిజిపి హరీష్‌కుమార్ గుప్తాకు, ఎన్నికల సంఘానికి సమర్పించారు. ఈ నివేదికలో అనేక కీలక అంశాలను ప్రస్తావించారు. ఎన్నికల రోజు పల్నాడు జిల్లాలో ఇవిఎంలు పగులకొట్టింది ఎవరో తెలిసినా వారి పేర్లు నమోదు చేయలేదని సిట్ పేర్కొంది. బిఎల్‌ఒలు కూడా వారి పేర్లతో లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేయలేదని, ఫలితంగా అగంతకులుగా పేర్కొంటూ ఎఫ్ఐఆర్ నమోదు చేశారని తెలిపారు. అది కూడా ఎన్నికలకు సంబంధించి కఠిన నిబంధనలు కాకుండా సర్వసాధారణ సెక్షన్లు పెట్టారని నివేదికలో తెలిపారు. పల్నాడు జిల్లాలో ఓ ఎమ్మెల్యే ఇవిఎంను పగులకొడితే అక్కడ ఎవరూ ఫిర్యాదు కూడా చేయలేదని, పోలీసులూ పట్టించుకోలేదని గుర్తు తెలియని వ్యక్తులు పగులగొట్టారని చెప్పడంతోపాటు అసలు ఏం జరిగిందో కూడా విచారణ చేయలేదని తెలిపారు. నిందితులను కూడా ప్రశ్నించలేదని పేర్కొన్నారు. అలాగే బాధితుల నుండి వివరాలూ తీసుకోలేదని, వారికి వైద్య పరీక్షలు చేయించడం, చికిత్స నివేదికలు పొందుపరచడం వంటి అంశాలను కూడా కేసుల్లో చేర్చలేదని తెలిపారు. దీనివల్ల కేసు నీరుగారిపోయే అవకాశం ఉందని పేర్కొన్నారు. తాడిపత్రిలో వైసిపి, తెలుగుదేశం పార్టీల అభ్యర్థులకు ద్విచక్ర వాహన ర్యాలీలు చేసుకునేందుకు అవకాశం కల్పించారని వివరించారు. ఇది 144 సెక్షన్‌కు విఘాతం కలిగేలా చేసిందని వివరించారు. తిరుపతి, పల్నాడు జిల్లాల్లో అల్లరిమూకలు విధ్వంసం సృష్టించాయని, ఈ కేసుల్లో పోలీసుల వాహనాలు ధ్వంసం చేసినా పోలీసులు సరిగ్గా పట్టించుకోలేదని నివేదికలో పేర్కొంది. పల్నాడు జిల్లాలో పోలీసులు ఘటనలను అసలు సీరియస్‌గా తీసుకోలేదని వివరించారు. దాడులు చేసింది ఎవరో తెలిసినా వారిని అరెస్టు చేయలేదని, నివాస ప్రాంతాల్లో దాడులు జరిగినా సాక్షులను విచారించలేదని తెలిపింది. మొత్తంగా 37 కేసులు నమోదు చేశారని, రెండు కేసుల్లో చార్జిషీటు దాఖలు చేశారని పేర్కొన్నారు. ఈ కేసుల్లో నిందితులకు శిక్షలు పడే వారకూ ఎస్‌పిలు, డిఐజిలు పర్యవేక్షించాలని సిట్ సూచించింది. లేనిపక్షంలో కేసులు నీరుగారిపోతాయని పేర్కొంది. మొత్తంగా సిట్‌లో 11 మంది అధికారులు ప్రత్యక్ష విచారణలు జరిపి నివేదికలు తయారు చేశారు.

ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో
వైఎస్ఆర్ విగ్రహం తొలగింపు



ప్రజాశక్తి- ఎఎన్‌యు (గుంటూరు జిల్లా)

ఆచార్య నాగార్జున యూనివర్సిటీ పరిపాలన భవనం ఎదురుగా ఉన్న డాక్టర్ వైఎస్.రాజశేఖర్‌రెడ్డి విగ్రహాన్ని యూనివర్సిటీ అధికారులు సోమవారం తొలగించారు. ఈ విగ్రహాన్ని ఇక్కడి నుంచి తొలగించాలంటూ టిడిపి, బిజెపికి చెందిన విద్యార్థి, ఉద్యోగ సంఘాల నాయకులు గొడవ చేయడంతో విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య పి.రాజశేఖర్ వారిని సముదాయించేందుకు ప్రయత్నించారు. విగ్రహాన్ని తొలగించాల్సిందేనని వారు పట్టుబట్టడంతో గత్యంతరం లేక ఆ విగ్రహాన్ని తొలగించేందుకు అంగీకరించారు. ఆ వెంటనే జెసిబితో విగ్రహాన్ని తొలగించారు. తొలగింపు కార్యక్రమంలో టిఎన్‌టియుసి, టిఎన్ఎస్ఎఫ్, బిఎంఎస్, ఎంఆర్‌పిఎస్, వికాస, జనసేన నాయకులు పాల్గొన్నారు.

దళితుల మద్దతు కోల్పోయిన బిజెపి

- 16 సిట్టింగ్ రిజర్వుడ్ స్థానాల్లో ఓటమి
- 'ఇండియా'కే జై కొట్టిన ఎస్‌సిలు
- ఆ పార్టీలకు 46 శాతం ఓట్లు



న్యూఢిల్లీ : దశాబ్ద కాలం తర్వాత లోక్‌సభలో బిజెపి మెజారిటీ కోల్పోయింది. 240 స్థానాలు గెలుచుకొని సభలో అతి పెద్ద పార్టీగా అవతరించింది. భారీ మెజారిటీతో బిజెపి అధికారంలోకి వస్తే రాజ్యాంగాన్ని మార్చేస్తుందంటూ ప్రతిపక్షాలు చేసిన ప్రచారాన్ని ఓటర్లు విశ్వసించారు. ముఖ్యంగా షెడ్యూల్డ్ కులాల వారు బిజెపిని పక్కన పెట్టి ఇండియా బ్లాక్‌కు ఓటేశారు. దేశంలో 156 లోక్‌సభ స్థానాల్లో ఎస్‌సిల ప్రభావం గణనీయంగా ఉంది. వీటిలో ఇండియా బ్లాక్‌కు 93, ఎన్‌డిఎకు 57, ఇతరులకు 6 స్థానాలు లభించాయి. ఎస్‌సిల ప్రాబల్యం అధికంగా ఉన్న స్థానాలకు సంబంధించి 2019 ఎన్నికలతో పోలిస్తే ఇండియా బ్లాక్ 53 సీట్లను అదనంగా గెలుచుకోగా, ఎన్‌డిఎ 34 స్థానాలను కోల్పోయింది. ఇతర పార్టీలు కూడా 19 స్థానాలను చేజార్చుకున్నాయి. రాజ్యాంగాన్ని మారిస్తే తమ మనుగడే ప్రమాదంలో పడుతుందని, తమ ఉపాధి వనరులు దెబ్బతింటాయని ఎస్‌సిలు ఆందోళన చెందారు. తాము గతంలో బిజెపికే ఓటు వేశామని, ఆ పార్టీ అధికారంలోకి వస్తే రాజ్యాంగాన్ని మార్చి తమకు నష్టం కలిగిస్తుందని, అందుకే ఈసారి సమాజ్‌వాదీ పార్టీకి ఓటేశామని ఉత్తరప్రదేశ్‌కు చెందిన కొందరు బాహాటంగానే చెప్పారు.

ఎవరికి ఎన్ని ?

ఉత్తరప్రదేశ్‌లో బిజెపి గతంతో పోలిస్తే సగం స్థానాలను కోల్పోయింది. 2019 ఎన్నికల్లో కంటే ఆ పార్టీకి ఏకంగా 9 శాతం ఓట్లు తగ్గాయి. దళితులు, వెనుకబడిన తరగతుల వారు బిజెపిని వ్యతిరేకించారు. ముఖ్యంగా దళితులంతా ప్రతిపక్ష కూటమికే జై కొట్టారు. దేశ జనాభాలో ఎస్‌సిలు 17 శాతంగా ఉన్నారు. వీరిలో అత్యధికుల మద్దతును ఎన్‌డిఎ కోల్పోయిందని ఇండియా టుడే-యాక్సిస్ మై ఇండియా సర్వే స్పష్టం చేసింది. ఆ మద్దతు ఈసారి ప్రతిపక్షాలకు లభించింది. ఎస్‌సిల్లో బిజెపి నేతృత్వంలోని ఎన్‌డిఎ 6 శాతం ఓట్లను కోల్పోగా కాంగ్రెస్ నేతృత్వంలోని ఇండియా బ్లాక్ రెండంకెల ఓటు షేర్‌ను పొందింది. 2019 ఎన్నికల్లో ఎన్‌డిఎకు 41 శాతం ఓట్లు రాగా, ఇప్పుడు 35 శాతం మాత్రమే వచ్చాయి. అదే సమయంలో ప్రతిపక్ష కూటమి ఓట్లు 46 శాతానికి పెరిగాయి. 2019 ఎన్నికలతో పోలిస్తే ఇది 18 శాతం ఎకుదచీశీఅవగ్కవ. ఈ ఎన్నికల్లో ఎన్‌డిఎ, ఇండియా బ్లాక్ సాధించిన ఓట్ల మధ్య 11 శాతం వ్యత్యాసం ఉంది. ఇతర పార్టీలకు లభించిన ఓట్లు 31 శాతం నుంచి 19 శాతానికి తగ్గిపోయాయి.

ఏ గట్టునా లేని వారికీ నిరాశే

ఎస్‌సిలలో ఎన్‌డిఎ యేతర, ఇండియా బ్లాక్ యేతర పార్టీల ఓటింగ్ 12 శాతం పడిపోయింది.

2019 ఎన్నికల్లో ఎన్‌డిఎ, ఇతరులతో పోలిస్తే ప్రస్తుత ఇండియా బ్లాక్‌లోని పార్టీలకు ఎస్‌సిల్లో పెద్దగా ఆదరణ లభించలేదు. ఈ ఎన్నికల్లో సీన్ రివర్స్ అయింది. ఎస్‌సిల్లో దాదాపు సగం (46 శాతం) ఓట్లు ఇండియా బ్లాక్‌కు పడ్డాయి.

రిజర్వ్‌డ్ స్థానాల్లో...

లోక్‌సభలో 84 ఎస్‌సి రిజర్వ్‌డ్ స్థానాలు ఉన్నాయి. 2014లో వీటిలో కాంగ్రెస్‌కు 7, బిజెపికి 40, ఇతరులకు 37 స్థానాలు వచ్చాయి. 2019లో కాంగ్రెస్‌కు 6, బిజెపికి 46, ఇతరులకు 32 సీట్లు లభించాయి. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు 20, బిజెపికి 30, ఇతరులకు 34 స్థానాలు దక్కాయి. ఓట్ల శాతం విషయానికి వస్తే 2014లో కాంగ్రెస్‌కు 17.6 శాతం, బిజెపికి 27.6 శాతం, ఇతరులకు 54.8 శాతం ఓట్లు వచ్చాయి. 2019లో కాంగ్రెస్‌కు 16.7 శాతం, బిజెపికి 35.3 శాతం, ఇతరులకు 47.9 శాతం ఓట్లు పడ్డాయి. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు 21.1 శాతం, బిజెపికి 35.2 శాతం, ఇతరులకు 43.7 శాతం ఓట్లు లభించాయి. 2019లో కాంగ్రెస్‌కు వచ్చిన ఓట్ల కంటే బిజెపికి రెట్టింపు ఓట్లు వచ్చాయి. ప్రస్తుత ఎన్నికలకు వచ్చేసరికి కాంగ్రెస్ ఓట్లు 21 శాతానికి పెరిగాయి. ఓట్లు సుమారు ఐదు శాతం పెరగ్గా సీట్లు మాత్రం మూడు రెట్లకు పైగా పెరిగాయి. అదే సమయంలో బిజెపి భారీగా... 16 స్థానాలు నష్టపోయింది. ఈ ఎన్నికల్లో బిజెపి కోల్పోయిన మొత్తం స్థానాల్లో ఇది నాలుగో వంతు.

బిఎస్‌పి దెబ్బతినడంతో...

ఒకప్పుడు ఎస్‌సిల ఓట్లను అధిక సంఖ్యలో సాధించి ఓ వెలుగు వెలిగిన బిఎస్‌పి ఇప్పుడు పూర్తిగా కనుమరుగయ్యే పరిస్థితికి చేరింది. గతంలో కాంగ్రెస్‌కు వెన్నుదన్నుగా ఉన్న ఎస్‌సిలు ఇప్పుడు మళ్లీ ఆ పార్టీ వైపు మొగ్గు చూపుతున్నారు. ఈ పరిణామం బిజెపికి నష్టం కలిగిస్తోంది. ఇండియా టుడే పత్రికకు చెందిన ఎలక్షన్ ఇంటెలిజెన్స్ డాష్‌బోర్డు ప్రకారం 156 లోక్‌సభ స్థానాల్లో ఎస్‌సిల సంఖ్య గణనీయంగా ఉంది. వీటిలో ఇండియా బ్లాక్ 93, ఎన్‌డిఎ 57 స్థానాలు గెలుచుకున్నాయి. 2019తో పోలిస్తే ఇండియా బ్లాక్ 53 స్థానాలను అదనంగా గెలుచుకోగా, ఎన్‌డిఎ 34 సీట్లు కోల్పోయింది.

నేడు ఇఎపి సెట్ ఫలితాలు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఇఎపి సెట్ ఫలితాలు మంగళవారం విడుదల చేయనున్నట్లు అధికారులు తెలిపారు. ఇంజినీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కామన్ ఎంట్రన్స్ టెస్ట్ పరీక్షలు ఇటీవల పూర్తయిన సంగతి తెలిసిందే. వీటికి సంబంధించి ఫలితాలు మంగళవారం విడుదల కానున్నాయి.

మలావీ ఉపాధ్యక్షుడి విమానం అదృశ్యం

గాలింపు చర్యలు ముమ్మరం



బ్లాంటైర్ : ఆఫ్రికా దేశమైన మలావీ ఉపాధ్యక్షుడు ప్రయాణిస్తున్న సైనిక విమానం అదృశ్యమైంది. దేశాధ్యక్షుడు లాజరస్ చక్వేరా కార్యాలయం ఈ విషయాన్ని ధ్రువీకరించింది. గాలింపు చర్యలు కొనసాగుతున్నట్లు వెల్లడించింది. మలావీ ఉపాధ్యక్షుడు సావులోస్ చీలిమాతోపాటు మరో తొమ్మిది మందితో ఓ సైనిక విమానం సోమవారం దేశ రాజధాని లిలాంగ్వే నుంచి బయల్దేరింది. షెడ్యూల్ ప్రకారం 45 నిమిషాల అనంతరం ఎంజుజు అంతర్జాతీయ విమానాశ్రయంలో దిగాల్సి ఉంది. కానీ, ఆ సమయానికి అక్కడికి చేరుకోలేదు. ఆ విమానం రాడార్ నుంచి మాయమైందని, దీంతో విమానయాన అధికారులు దాంతో కాంటాక్ట్ కోల్పోయారని అధ్యక్ష కార్యాలయం తెలిపింది. వెంటనే గాలింపు చర్యలు చేపట్టాలని ఆదేశించిన అధ్యక్షుడు చక్వేరా.. తన బహామాస్ పర్యటనను రద్దు చేసుకున్నట్లు వెల్లడించింది.

ఇటీవల ఇరాన్ అధ్యక్షుడు ఇబ్రహీం రైసీ (63) హెలికాప్టర్ ప్రమాదంలో మరణించిన విషయం తెలిసిందే. ఆయన ప్రయాణిస్తున్న హెలికాప్టర్ దట్టమైన అటవీ ప్రాంతంలో కూలిపోయింది.

గాజాలో మానవతా సాయం ఆపాం

- డబ్ల్యుఎఫ్‌పి వెల్లడి

గాజా : గాజాపై ఇజ్రాయిల్ దాడులు కొనసాగుతునే వున్నాయి. దాడుల్లో గాయపడిన వారితో ఆస్పత్రులన్నీ కిటకిటలాడుతున్నాయి. గత 8మాసాలుగా సాగుతున్న దాడులతో ఆస్పత్రులన్నీ బాగా దెబ్బతినడంతో సరైన మౌలిక వసతులు, తగినంత మంది సిబ్బంది కూడా లేకుండా పనిచేయాల్సి వస్తోంది. వెల్లువలా వస్తున్న రోగులకు సరైన చికిత్సనందించలేకపోతున్నామని డాక్టర్లు వాపోతున్నారు. మరోవైపు రఫాలో క్రాసింగ్ మూసివేయడంతో మానవతా సాయం అందడం కూడా కష్టమైపోతోంది. భద్రతా కారణాల రీత్యా అమెరికా ఏర్పాటు చేసిన కారిడార్ మీదుగా తాము వెళ్లలేమని, అందుకే సహాయం నిలిపివేశామని ప్రపంచ ఆహార కార్యక్రమం (డబ్ల్యుఎఫ్‌పి) వెల్లడించింది. ఈ నేపథ్యంలో కాల్పుల విరమణ ప్రతిపాదన ఆమోదించాల్సిగా ఇజ్రాయిల్‌పై ఒత్తిడి వస్తోంది. ఇరుపక్షాల మధ్య మూడంచెల ఒప్పందం కుదిరేలా చూడాలని ప్రయత్నాలు జరుగుతున్నా అవి ఒక కొలిక్కి రావడం లేదు. ఇందుకు సంబంధించిన ముసాయిదా తీర్మానంపై భద్రతా మండలిలో ఓటింగ్ జరగనున్న నేపథ్యంలో ఇజ్రాయిల్‌ను ఒప్పించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని ఐక్యరాజ్య సమితిలో అమెరికా డిప్యూటీ రాయబారి రాబర్ట్ వుడ్ తెలిపారు. ఇదిలావుండగా శనివారం నుస్రత్ శరణార్థ శిబిరంపై జరిగిన దాడిలో 274మంది పాలస్తీనియన్లు మరణించారని, వీరిలో 64మంది పిల్లలే వున్నారని పాలస్తీనా గ్రూపు పేర్కొంది. ఈ దాడిని యుద్ధ నేరంగా పరిగణించాలని డిమాండ్‌చేసింది.

సీనియర్లకు పాత శాఖలే

- 30 మందికి కేబినెట్, ఐదుగురికి స్వతంత్ర హోదా
- మరో 36 మందికి సహాయ మంత్రి పదవులు
- రామ్మోహన్‌నాయుడుకు విమానయానశాఖ



ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

కేంద్రంలో కొలువుదీరిన ఎన్‌డిఎ సంకీర్ణ సర్కారు మంత్రులకు శాఖలు కేటాయించింది. ఆదివారం ప్రధాన మంత్రి నరేంద్ర మోడీతోపాటు 71 మంది కేంద్ర మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేశారు. వీరిలో 30 మందికి కేబినెట్ హోదా, ఐదుగురికి స్వతంత్ర హోదా, 36 మంది సహాయ మంత్రులుగా ఉన్నారు. వీరికి తాజాగా శాఖలు కేటాయించారు. కీలకమైన శాఖలను బిజెపి తన వద్దే ఉంచుకుంది. మళ్లీ కేంద్ర హోంమంత్రి బాధ్యతలు అమిత్ షా చేపట్టగా, రక్షణశాఖను రాజ్‌నాథ్ సింగ్‌కు కేటాయించారు. రోడ్డు, రవాణాశాఖను నితిన్ గడ్కరీకి కేటాయించారు. ఆర్థికశాఖను నిర్మలా సీతారామన్‌కు కేటాయించారు. విదేశీ వ్యవహారాల శాఖను జై శంకర్, రైల్వే, సమాచార, ప్రసార మంత్రి, ఎలక్ట్రానిక్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ శాఖను అశ్విని వైష్ణవ్‌కు కట్టబెట్టారు.

ఆంధ్రప్రదేశ్ నుంచి తొలిసారి కేంద్ర మంత్రివర్గంలో అడుగుపెట్టిన టిడిపి నేత కింజరాపు రామ్మోహన్‌నాయుడుకు పౌర విమానాయానశాఖ కేటాయించారు. అలాగే మరో టిడిపి నేత, కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్‌కు గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్ శాఖను కేటాయించారు. నర్సాపురం బిజెపి ఎంపి, కేంద్ర సహాయ మంత్రి శ్రీనివాస వర్మకు ఉక్కు, భారీ పరిశ్రమలశాఖను కేటాయించారు. తెలంగాణ నుంచి కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి బొగ్గు గనులశాఖ కేటాయించగా, కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్‌కు హోంశాఖను కేటాయించారు.

కేబినెట్ మంత్రులు .. వారి శాఖలు

ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ-పర్సనల్, పబ్లిక్ గ్రీవెన్స్, పెన్షన్స్, ఆటోమిక్ ఎనర్జీ, స్పేస్

1. రాజ్‌నాథ్ సింగ్ – రక్షణ
2. అమిత్ షా – హోం
3 నితిన్ గడ్కరీ – రోడ్డు రవాణా, రహదారులు
4. జెపి నడ్డా – ఆరోగ్య, కుటుంబ సంక్షేమ, రసాయనాలు, ఎరువులు
5. శివరాజ్ సింగ్ చౌహాన్ – వ్యవసాయం, రైతుల సంక్షేమ, గ్రామీణాభివృద్ధి
6. నిర్మలా సీతారామన్ –ఆర్థిక, కార్పొరేట్ వ్యవహారాలు
7. ఎస్. జైశంకర్ – విదేశీ వ్యవహారాలు
8. మనోహర్ లాల్ ఖట్టర్–హౌసింగ్, పట్టణ వ్యవహారాలు, విద్యుత్
9. హెచ్‌డి కుమారస్వామి – భారీ పరిశ్రమలు, ఉక్కు
10. పీయూష్ గోయల్ – వాణిజ్యం, పరిశ్రమలు
11. ధర్మేంద్ర ప్రధాన్ – విద్య
12. జితన్ రామ్ మాంఝీ – సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు
13. రాజీవ్ రంజన్ సింగ్ – పంచాయతీరాజ్‌శాఖ, మత్స్య, పశుసంవర్ధక, పాడి పరిశ్రమలు
14. సర్బానంద సోనోవాల్ – ఓడరేవులు, షిప్పింగ్, జలమార్గాలు
15. వీరేంద్ర కుమార్ – సామాజిక న్యాయం, సాధికారత
16. కింజరాపు రామ్మోహన్‌నాయుడు – పౌర విమానయాన
17. ప్రహ్లాద్ జోషి – వినియోగదారుల వ్యవహారాలు, ఆహారం, ప్రజా పంపిణీశాఖ, కొత్త పునరుత్పాదక ఇంధన
18. జువల్ ఓరం –గిరిజన వ్యవహారాలు
19. గిరిరాజ్ సింగ్ – జౌళి
20. అశ్విని వైష్ణవ్ – రైల్వేశాఖ, సమాచార, ప్రసార మంత్రి, ఎలక్ట్రానిక్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ
21. జ్యోతిరాదిత్య సింధియా –కమ్యూనికేషన్స్, ఈశాన్య ప్రాంత అభివృద్ధి
22. భూపేందర్ యాదవ్ – పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పులు
23. గజేంద్ర సింగ్ షెకావత్ –సాంస్కృతిక శాఖ, పర్యాటక
24. అన్నపూర్ణా దేవి –మహిళా శిశు అభివృద్ధి
25. కిరణ్ రిజిజు– పార్లమెంటరీ వ్యవహారాలశాఖ, మైనారిటీ వ్యవహారాలు
26. హర్దీప్ సింగ్ పూరి– పెట్రోలియం, సహజ వాయువు శాఖ
27. మన్సుఖ్ మాండవియా –కార్మిక, ఉపాధి మంత్రిత్వ, యువజన వ్యవహారాలు, క్రీడలు
28. కిషన్ రెడ్డి – బొగ్గు, గనులశాఖ
29. చిరాగ్ పాశ్వాన్ – ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమలు
30. సిఆర్ పాటిల్ – జలశక్తి

స్వతంత్ర హోదా మంత్రులు

31. రావు ఇంద్రజిత్ సింగ్– స్టాటస్టిక్స్, ప్రోగ్రామ్ ఇంప్లిమెంటేషన్, ప్రణాళికా, సాంస్కృతిక
32. జితేంద్ర సింగ్– సైన్స్ అండ్ టెక్నాలజీ, ఎర్త్ సైన్స్, పర్సనల్, పబ్లిక్ గ్రీవెన్స్, పెన్షన్స్
33. అర్జున్ రామ్ మేఘ్వాల్– న్యాయ, పార్లమెంటరీ వ్యవహారాలు
34. జాదవ్ ప్రతాప్‌రావు– ఆయూష్, హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్
35. జయంత్ చౌదరి–స్కిల్ డవలప్‌మెంట్

సహాయ మంత్రులు

36. జితిన్ ప్రసాద – వాణిజ్య, పరిశ్రమలు, ఐటీ, ఎలక్ట్రానిక్స్
37. శ్రీపాద్ యశోనాయక్ – విద్యుత్తు, పునరుత్పాక ఇంధనం
38. పంకజ్ చౌదరి – ఆర్థికం
39. క్రిషన్ పాల్ – సహకారం
40. రామ్ దాస్ అథవలె – సామాజిక న్యాయం, సాధికారత
41. రామ్‌నాథ్ ఠాకూర్ – వ్యవసాయ, రైతు సంక్షేమం
42. నిత్యానందరాయ్ – హోం
43. అనుప్రియ పటేల్ – ఆరోగ్య, కుటుంబ సంక్షేమం, ఎరువులు – రసాయనాలు
44. వి.సోమన్న – జల్ శక్తి, రైల్వే
45. పెమ్మసాని చంద్రశేఖర్ – గ్రామీణాభివద్ధి, కమ్యూనికేషన్స్
46. ఎస్.పి.సింగ్ బఘేల్ – మత్స్య, పశుసంవర్ధక, డెయిరీ, పంచాయతీ రాజ్
47. శోభా కరంద్లాజే – సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు, కార్మిక, ఉపాధి
48. కీర్తివర్ధన్ సింగ్ – పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పులు, విదేశాంగ
49. బిఎల్ వర్మ – వినియోగదారుల వ్యవహారాలు, ఆహార – ప్రజా పంపిణీ, సామాజిక న్యాయం – సాధికారత
50. శాంతను ఠాకూర్ – పోర్టులు, షిప్పింగ్, వాటర్‌వేస్
51. సురేష్ గోపి – పెట్రోలియం, సహజవాయువులు, పర్యటకం
52. ఎల్.మురుగన్ – సమాచార – ప్రసారాలు, పార్లమెంటరీ వ్యవహారాలు
53. అజయ్ టమ్టా – రోడ్డు రవాణా, హైవేలు
54. బండి సంజయ్ కుమార్ – హోం
55. కమలేష్ పాశ్వాన్ – గ్రామీణాభివద్ధి
56. భగీరథ్ చౌదరి – వ్యవసాయ, రైతు సంక్షేమం
57. సతీశ్ చంద్రదూబే – బొగ్గు, గనులు
58. సంజయ్ సేఠ్ – రక్షణ
59. రవ్‌నీత్ సింగ్ బిట్టూ – ఆహార శుద్ధి పరిశ్రమ, రైల్వేలు
60. దుర్గాదాస్ ఉయికె – గిరిజన వ్యవహారాలు
61. రక్షా నిఖిల్ ఖడ్సే – యువజన వ్యవహారాలు – క్రీడలు
62. సుఖాంత మజుందార్ – విద్య, ఈశాన్య ప్రాంత అభివృద్ధి
63. సావిత్రి ఠాకూర్ – మహిళా, శిశు సంక్షేమాభివృద్ధి
64. టోకన్ సాహూ – గహ నిర్మాణ, పట్టణ వ్యవహారాలు
65. రాజ్ భూషణ్ చౌదరి – జల్ శక్తి
66. భూపతిరాజు శ్రీనివాస వర్మ – భారీ పరిశ్రమలు, ఉక్కు
67. హర్ష్ మల్హోత్రా – కార్పొరేట్ వ్యవహారాలు, రోడ్డు రవాణా – హైవేలు
68. నిముబెన్ జయంతిభాయ్ బాంభణియా – వినియోగదారుల వ్యవహారాలు, ఆహార – ప్రజా పంపిణీ
69. మురళీధర్ మొహోల్ – సహకార, పౌర విమానయానం
70. జార్జ్ కురియన్ – మైనారిటీ వ్యవహారాలు, మత్స్య – పశుసంవర్ధక – డెయిరీ
71. పబిత్ర మార్గరీటా – విదేశీ వ్యవహారాలు, టెక్స్‌టైల్స్

ముస్లింలకు నో ఛాన్స్

- ఈసారి ఎన్‌డిఎ మిత్రపక్షాల నుంచీ ఎంపీగా ఎన్నిక కాని ముస్లిం అభ్యర్థులు

న్యూఢిల్లీ : ప్రధాని మోడీ అండ్ టీం ప్రమాణస్వీకార కార్యక్రమం ఆదివారం ముగిసింది. అయితే, ఇందులో ఒక్క ముస్లిం ఎంపీ కూడా లేడు. ఒక్క ముస్లిం ఎంపీ కూడా మంత్రిగా ప్రమాణం చేయకపోవడం బహుశా ఇదే తొలిసారి అని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. బిజెపి నాయకుడు ముక్తార్ అబ్బాస్ నఖ్వీ రాజ్యసభకు తిరిగి ఎన్నిక కాకపోవటంతో పాత మంత్రివర్గంలోనూ ముస్లిం మంత్రి లేరని వారు గుర్తు చేస్తున్నారు. సాధారణంగా.. ఎన్నికల తర్వాత ప్రమాణ స్వీకారం చేసిన మంత్రి మండలి కూర్పులో కనీసం ఒక ముస్లిం ఎంపీ ఉంటారు. 2014లో ప్రధాని మోడీ తొలిసారి ప్రమాణ స్వీకారం చేసినప్పుడు నజ్మా హెప్తుల్లా మైనారిటీ వ్యవహారాల మంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. 2019లో ముఖ్తార్ అబ్బాస్ నఖ్వీ ప్రమాణస్వీకారం చేసి మైనారిటీ వ్యవహారాల మంత్రి అయ్యారు.

18వ లోక్‌సభకు ఎన్‌డిఎ మిత్రపక్షాల నుంచి ముస్లిం అభ్యర్థి ఎవరూ ఎన్నిక కాకపోవటం కూడా ఈ మంత్రి మండలిలో ముస్లిం ప్రాతినిధ్యం లేకపోవడానికి ఒక కారణంగా రాజకీయ విశ్లేషకులు చెప్తున్నారు. దిగువ సభకు ఎన్నికైన 24 మంది ముస్లిం ఎంపీలలో ఇండియా వేదికలో(టిఎంసితో కలుపుకుంటే), ఎంఐఎంకు చెందినవారున్నారు. ఇందులో స్వతంత్రులూ ఉన్నారు.

2004, 2009లో యూపీఏ రెండు దఫాల్లో మంత్రి మండలిలో వరుసగా నలుగురు, ఐదుగురు ముస్లిం ఎంపీలు ఉన్నారు. 1999లో కూడా, అటల్ బిహారీ వాజ్‌పేయి ప్రభుత్వంలోని మంత్రి మండలిలో ఇద్దరు ముస్లింలు షానవాజ్ హుస్సేన్, ఒమర్ అబ్దుల్లాలు మంత్రులుగా ఎంపికయ్యారు. 1998లో వాజ్‌పేయి మంత్రివర్గంలో ముఖ్తార్ అబ్బాస్ నఖ్వీ మంత్రిగా పని చేశారు.

7 రాష్ట్రాల్లో 13 అసెంబ్లీ స్థానాలకు ఉప ఎన్నిక

- షెడ్యూల్ విడుదల చేసిన ఇసి

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

దేశ వ్యాప్తంగా ఏడు రాష్ట్రాల్లో వివిధ కారణాలతో ఖాళీ అయిన 13 అసెంబ్లీ స్థానాలకు కేంద్ర ఎన్నికల సంఘం (ఇసిఐ) షెడ్యూల్ విడుదల చేసింది. పశ్చిమబెంగాల్ నుంచి 4, హిమాచల్‌ప్రదేశ్ నుంచి 3, ఉత్తరాఖండ్ నుంచి 2, బీహార్, తమిళనాడు, మధ్యప్రదేశ్, పంజాబ్‌లలో ఒక్కో స్థానం షెడ్యూల్ ప్రకటించింది. ఈ మేరకు సోమవారం ఇసిఐ ఒక ప్రకటన విడుదల చేసింది. ఈ ఎన్నికలకు జూన్ 14న నోటిఫికేషన్ విడుదల కానున్నట్లు తెలిపింది. జూన్ 21న నామినేషన్ల ప్రక్రియ ప్రారంభం, జూన్ 24 నామినేషన్ల పరిశీలనకు గడువు ఉంటుందని తెలిపింది. జూన్ 26 నామినేషన్ల ఉప సంహరణకు చివరి తేదీగా వెల్లడించింది. జులై 10న 13 స్థానాలకు పోలింగ్ జరగనుంది. జులై 13న ఎన్నికల ఫలితాలు వెలువడనున్నాయి.



నీట్ స్కామ్‌పై నిగ్గు తేల్చాలి

- అవకతవకలపై దర్యాప్తు చేయాలి
- కేంద్ర విద్యాశాఖ కార్యాలయం ఎదుట ఎస్‌ఎఫ్‌ఐ ఆందోళన

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

జాతీయ అర్హత ప్రవేశ పరీక్ష (నీట్) కుంభకోణంపై నిగ్గు తేల్చాలని ఎస్‌ఎఫ్‌ఐ ఢిల్లీ అధ్యక్ష, కార్యదర్శులు ఐషీ ఘోష్, మయాంక్ డిమాండ్ చేశారు. విద్యార్థులకు న్యాయం చేయాలని, నీట్ పరీక్షల నిర్వహణలో అసమర్థత ప్రదర్శిస్తున్న నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టిఎ) రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ కేంద్ర విద్యా మంత్రిత్వశాఖ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. అలాగే దేశంలో వివిధ ప్రాంతాల్లో కూడా ఆందోళన జరిగింది. హైదరాబాద్, ఉత్తరాఖండ్, తమిళనాడులోని చెన్నైలో ఆందోళనలు జరిగాయి. ప్లకార్డులు చేబూని నినాదాలు హోరెత్తించారు. ఈ సందర్భంగా ఎస్‌ఎఫ్‌ఐ ఢిల్లీ అధ్యక్ష, కార్యదర్శులు ఐషీ ఘోష్, మయాంక్ మాట్లాడుతూ.. నిష్పక్షపాతంగా పరీక్షలు నిర్వహించాల్సిన ఎన్‌టిఎ సామర్థ్యం సరిగ్గా లేదని, ఇటీవలి నీట్ స్కామ్, సెంట్రల్ యూనివర్సిటీస్ ఎంట్రన్స్ టెస్ట్ (సియుఇటి)లో పేపర్ లీకలతో సహా ఏజెన్సీ చుట్టూ ఉన్న వివాదాలు ఉన్నాయని విమర్శించారు. ఈ ఘటనలు విద్యార్థుల్లో తీవ్ర ఒత్తిడిని, ఆందోళనకు గురిచేయడమే కాకుండా వారి భవిష్యత్తును కూడా ప్రమాదంలో పడేశాయని పేర్కొన్నారు. సురక్షితమైన పరీక్షలను నిర్వహించడంలో ఎన్‌టిఎ పదేపదే విఫలమవుతున్నందున దానిని పూర్తిగా రద్దు చేయాలని డిమాండ్ చేశారు. నిష్పక్షపాతమైన, పారదర్శకమైన పరీక్షా విధానాన్ని అమలు చేయాలన్నారు. అసంఖ్యాక విద్యార్థుల భవిష్యత్తు ప్రమాదంలో ఉందని, ఈ క్లిష్టమైన సమస్యలను పరిష్కరించడానికి కేంద్ర విద్యాశాఖ తక్షణ చర్య తీసుకోవాలని డిమాండ్ చేశారు.

జెఎన్‌యు ఎస్‌యు ఉపాధ్యక్షులు అవిజిత్ ఘోష్ మాట్లాడుతూ 'జవాబుదారీతనాన్ని నిర్ధారించడానికి నీట్ పరీక్షలో ఆరోపించిన అవకతవకలపై స్వతంత్ర, పారదర్శక దర్యాప్తు చేయాలని విద్యార్థులు డిమాండ్ చేస్తున్నారు. ప్రవేశ పరీక్షల సమగ్రతను కాపాడేందుకు మరింత విశ్వసనీయమైన, సురక్షితమైన పరీక్షా విధానాన్ని ఏర్పాటు చేయాలని మేము కేంద్ర విద్యాశాఖను డిమాండ్ చేస్తున్నాం' అని అన్నారు. ఎస్‌ఎఫ్‌ఐ ఢిల్లీ జాయింట్ సెక్రటరీ సూరజ్ ఎలామన్ మాట్లాడుతూ.. 'పదేపదే, ఎన్‌టిఎ పరీక్షల నిర్వహణలో లోపభూయిష్ట పద్ధతులతో విద్యార్థులకు వెన్నుపోటు పొడిచింది. ఇటీవలి సియుఇటి పరీక్షల మధ్య కూడా పరీక్షా కేంద్రాల వద్ద జరిగిన వివిధ వ్యత్యాసాల కారణంగా విద్యార్థులు ఇబ్బంది పడాల్సి వచ్చింది. అప్పుడు తగిన చర్యలు తీసుకోలేదు. ఎన్‌టిఎ అవకతవకలు లేకుండా పరీక్షలను నిర్ధారించలేని అసమర్థ సంస్థగా నిరూపితమైంది. ఈ నేపథ్యంలో కేంద్ర విద్యాశాఖ ఎన్‌టిఎని రద్దు చేయడానికి తక్షణమే చర్యలు తీసుకోవాలి' అని అన్నారు.

మణిపూర్ సిఎం భద్రతా కాన్వాయ్‌పై కాల్పులు

- ఇద్దరికి గాయాలు

ఇంఫాల్ : మణిపూర్ ముఖ్యమంత్రి ఎన్.బీరేన్ సింగ్ పర్యటన ఏర్పాట్లు పర్యవేక్షించేందుకు వెళుతున్న భద్రతా సిబ్బంది కాన్వాయ్‌పై గుర్తు తెలియని సాయుధ దుండగులు కాల్పులకు తెగబడ్డారు. ఈ కాల్పుల్లో వాహన డ్రైవర్‌తో సహా ఇద్దరు పోలీసులు గాయపడ్డారు. జాతీయ రహదారి–53పై కోట్లెన్ గ్రామం వద్ద సోమవారం ఘటన జరిగింది. గతవారంలో హింసాకాండ చెలరేగిన జిరిబామ్ పట్టణంలో ముఖ్యమంత్రి బీరేన్‌సింగ్ మంగళవారం పర్యటించనున్నారు. ఈ నేపథ్యంలో అక్కడి ఏర్పాట్లను సిద్ధం చేయడానికి మణిపూర్ పోలీస్‌కు చెందిన ఒక అధునాతన భద్రతా బృందం అక్కడకు బయలుదేరింది. ఈ సమయంలో సాయుధులు అనేక రౌండ్ల పాటు కాల్పులు జరిపారని పోలీసులు తెలిపారు. దీనికి ప్రతిస్పందనగా భద్రతా సిబ్బంది కూడా ఎదురు కాల్పులకు దిగారు. జిరిబామ్ జిల్లాలో ఈ నెల 8న రెండు పోలీసు అవుట్ పోస్టులను, ఒక ఫారెస్ట్ బీట్ ఆఫీస్‌ను, దాదాపు 70 ఇళ్లను సాయుధులు దగ్ధం చేశారు.


కెనడాతో కలిసి పనిచేసేందుకు సిద్ధం

- ప్రధాని మోడీ

న్యూఢిల్లీ : పరస్పర అవగాహన ప్రాతిపదికగా కెనడాతో కలిసి పనిచేసేందుకు సిద్ధంగా వున్నామని ప్రధాని నరేంద్ర మోడీ తెలిపారు. మూడోసారి ప్రధానిగా ప్రమాణ స్వీకారం చేసిన మోడీకి శుభాకాంక్షలు తెలియచేస్తూ కెనడా ప్రధాని జస్టిన్ ట్రుడెయు అభినందనలు తెలియచేశారు. ఈ మేరకు ఆయన ఎక్స్‌లో పోస్టు పెట్టారు. దీనిపై మోడీ స్పందిస్తూ ట్రుడెయుకు ధన్యవాదాలు తెలిపారు. ఒకరి ఆందోళనలను మరొకరు అర్థం చేసుకుని గౌరవించే పద్ధతిలో పరస్పర అవగాహనతో కెనడాతో పనిచేయడానికి భారత్ ఎదురుచూస్తోందన్నారు. తనకు అభినందనలు తెలియచేసిన పలువురు ప్రపంచ నేతలకు మోడీ కృతజ్ఞతలు తెలిపారు. ఆయా దేశాలతో సుహృద్భావ సంబంధాలు నెరిపేందుకు తాము కట్టుబడి వున్నామని చెప్పారు. ఫిన్లాండ్ ప్రధాని ఓర్పోకు పంపిన సందేశానికి సమాధానం పంపుతూ ద్వైపాక్షిక సంబంధాలను మరింత బలోపేతం చేసుకోవడానికి భారత్ ఎదురుచూస్తోందన్నారు. స్లొవేనియా, ఉగాండా నేతలకు కూడా కృతజ్ఞతలు తెలిపారు. భారత్, ఆఫ్రికా దేశాల మధ్య సంబంధాలు మరింత పటిష్టపడాలని కాంక్షిస్తున్నట్లు తెలిపారు. భారత్, ఆఫ్రికా ప్రజల ఆకాంక్షలు ఒక్కటేనని, వారి లక్ష్యాలు కూడా ఒకటేనన్నారు.

ఇయు పార్లమెంట్‌లో అతిపెద్ద శక్తిగా ఇపిపి గ్రూపు

- బ్రస్సెల్స్ కింగ్ మేకర్ మెలోని
- మాక్రాన్‌పై ఫ్రెంచ్ మితవాద పార్టీ పైచేయి



బ్రస్సెల్స్ : యూరోపియన్ పార్లమెంట్‌లోని 720మంది సభ్యులను ఎన్నుకునేందుకు జరుగుతున్న ఎన్నికల్లో లక్షలాదిమంది యురోపియన్లు ఓటు వేశారు. ఇంకా తుది ఫలితాలు రావాల్సివున్న నేపథ్యంలో 27 దేశాల వ్యాప్తంగా ఎవరు విజేతలు, పరాజితులో స్పష్టమవుతోంది. ఫ్రాన్స్ మితవాద పార్టీ నేషనల్ ర్యాలీ గెలిచేందుకు సిద్ధమైందని మొదటి ఎగ్జిట్ పోల్స్‌లో వెల్లడైన నేపథ్యంలోనే ఫ్రాన్స్ అధ్యక్షుడు మాక్రాన్ మధ్యంతర ఎన్నికలకు పిలుపునిచ్చారు. పార్లమెంట్‌ను రద్దు చేశారు. మరోపక్క ఇటలీ నేత జార్జియా మెలొని కీలకమైన బ్రస్సెల్స్ కింగ్ మేకర్‌గా తన స్థానాన్ని మరింత బలోపేతం చేసుకున్నారు. ఆమెకు 28శాతం ఓట్లు లభించాయి. మితవాద ఇపిపి గ్రూపు పార్లమెంట్‌లో అతిపెద్ద గ్రూపుగా అవతరించింది. 2019తో పోలిస్తే 13సీట్లు అదనంగా గెలుచుకున్నారు. ఇక పరాజితుల్లో ఆస్ట్రియా, జర్మనీలోని గ్రీన్స్, వున్నారు. అనుకున్న దానికన్నా వారికి అధ్వానమైన ఫలితాలు వచ్చాయి. 2019తో పోలిస్తే లిబరల్ రెన్యూ గ్రూపు 20సీట్లు కోల్పోయింది. జర్మనీలోని సోషల్ డెమోక్రాట్స్‌లో ఛాన్సలర్ ఓల్ఫ్ షుల్జ్ పార్టీ రెండోస్థానంతో సరిపెట్టుకుంది. యూరోపియన్ పార్లమెంట్ ఎన్నికల ఫలితాల తొలి అంచనాలను పరిశీలించినట్లైతే గ్రీన్, లిబరల్ రెన్యూ పార్టీలు ఒక్కోటి దాదాపుగా 20 స్థానాల వరకు కోల్పోయే అవకాశం వుందని తెలుస్తోంది. ఎన్నికలు ముగిసిన తర్వాత ఆదివారం అర్ధరాత్రి విడుదల చేసిన అంచనాల ప్రకారం గ్రీన్‌పార్టీ 72 నుండి 53 స్థానాలకు దిగిపోయింది. మాక్రాన్ నేతృత్వంలోని రెన్యూ పార్టీ 102 స్థానాల నుండి 83కి పడిపోయింది. ఈ కారణంగానే మాక్రాన్ మధ్యంతర ఎన్నికలకు పిలుపునిచ్చారు.

హిందూత్వ - కార్పొరేట్ల బంధం, నిరంకుశత్వంపై బలమైన పోరాటం

(మొదటి పేజీ తరువాయి)

కమిషన్ అందచేసిన డేటా ప్రకారం పోలైన ఓట్లలో ఎన్‌డిఎ కూటమి మొత్తానికి 43.31 శాతం ఓట్లు రాగా ఇండియా బ్లాక్‌కు 41.69శాతం ఓట్లు వచ్చాయి. అంటే ఈ రెండింటి మధ్య ఓట్ల తేడా రెండు శాతం కూడా లేదు.

ప్రతిపక్షాలపై పెద్దయెత్తున దాడులు, కేంద్ర దర్యాప్తు సంస్థల దుర్వినియోగం, డబ్బును పెద్దయెత్తున ఖర్చు చేయడం, ఎన్నికలకు ముందు ఇద్దరు ముఖ్యమంత్రులను జైలులోపెట్టడం, కాంగ్రెస్, సిపిఎం (కేరళలో ఒక జిల్లాలో) వంటి రాజకీయ పార్టీల బ్యాంక్ ఖాతాలు స్తంభింపజేయడం,. ఎన్‌సిపి, శివసేన వంటి ప్రతిపక్ష పార్టీలను చీల్చడం, ధనబలం, బెదిరింపులు, కేంద్ర ర్యాప్తు సంస్థల ఒత్తిళ్లు. ప్రతిపక్షాలను చీల్చేందుకు అన్ని రకాల రాజకీయ కుతంత్రాలకు బిజెపి పాల్పడింది. జెడి(యు)కు ఎరవేసి ఎన్‌డిఎ కూటమిలోకి తిరిగి లాక్కుంది. ఈ నేపథ్యంలో జరిగిన ఎన్నికల్లో అన్ని పక్షాలకు సమాన అవకాశాలను ఎన్నికల సంఘం కల్పించి వుంటే ఎన్‌డిఏకు మరింత ప్రతికూల ఫలితాలు వచ్చి వుండేవి. బిజెపి ఎజెండాను ముందుకు తీసుకెళ్ళడంలో ఎన్నికల కమిషన్ పాత్ర తక్కువేమీ కాదు. మోడీ, పలువురు బిజెపి నేతలు చేసే రెచ్చగొట్టే మత విద్వేష ప్రసంగాలను అడ్డుకోవడానికి కానీ, ఎన్నికల నియమావళికి కట్టుబడి ఉండేలా చూడడంలో కానీ ఎన్నికల కమిషన్ వెన్నెముక లేనట్టుగా వ్యవహరించింది. పోలైన ఓట్ల వివరాలను వెల్లడించడానికి తొలుత తిరస్కరించడం ద్వారా ఎన్నికల్లో అవకతవకలు చోటుచేసుకోవడంతో అనుమానాలు తలెత్తాయి. ఇది, రాజ్యాంగ సంస్థ అయిన ఎన్నికల కమిషన్ ప్రతిష్టను తీవ్రంగా దెబ్బతీసింది.

మీడియాలో అతిపెద్ద సెక్షన్‌ను బిజెపి పూర్తిగా తన అదుపాజ్ఞల్లో పెట్టుకుంది. వాటి ద్వారా తన అభిప్రాయాలను, భావాలను మాత్రమే ప్రచారం చేసేలా చూసుకుకుంది. ఎగ్జిట్ పోల్స్‌లో బిజెపికి వాస్తవిక బలం కన్నా చాలా ఎక్కువ సీట్లు వస్తాయని చెప్పడంలోనే వీటి నైజం బయటపడింది.కార్పొరేట్ మీడియా భాగస్వామ్యంతో బిజెపి పెద్ద మొత్తంలో డబ్బు ఖర్చు పెట్టి సోషల్‌మీడియా ద్వారా తప్పుడు కథనాలు, తప్పుడు సమాచారాన్ని ప్రచారం చేసింది. ఓటింగ్ సరళిని ప్రభావితం చేసేందుకు పెద్ద మొత్తంలో ధన బలాన్ని ఉపయోగించింది. చాలాచోట్ల ఓటర్లకు నేరుగా వేల కోట్ల రూపాయిలు పంచిపెట్టింది.

నిరుద్యోగం, ధరల పెరుగుదల, వ్యవసాయ సంక్షోభం వంటి ప్రజల జీవనోపాధుల సమస్యలపై ఇండియా బ్లాక్ పక్షాలు దృష్టి పెట్టాయి. వీటితో పాటు మన రాజ్యాంగం, ప్రజాస్వామ్యం, పౌర హక్కులకు ఎదురవుతున్న ముప్పు, బెదిరింపులను ప్రముఖంగా తమ ప్రచారంలో ప్రస్తావించాయి. అన్ని వర్గాలకు చెందిన ప్రజలు వారి జీవనోపాధులపై పెద్ద ఎత్తున నిర్వహించిన పోరాటాలు, ముఖ్యంగా రైతాంగ పోరాటాలు ఈ ఫలితాలకు గణనీయంగా దోహపడ్డాయి. మహారాష్ట్ర, పంజాబ్, రాజస్థాన్, హర్యానా, పశ్చిమ ఉత్తరప్రదేశ్‌ల్లో వ్యవసాయ ప్రాంరతాల్లో 38 సిట్టింగ్ స్థానాలను బిజెపి కోల్పోయింది. తమ జీవనోపాధులను మోడీ సర్కార్ ధ్వంసం చేయడంపై గ్రామీణ భారతం తీవ్రంగా ప్రతిస్పందించింది. మోడీ పదేళ్ల పాలనలో గ్రామీణ వాస్తవిక వేతనాలు పెరగకుండా స్తంభించిపోయాయి. దాదాపు 159 గ్రామీణ నియోజకవర్గాల ప్రజలు మార్పు కోసం ఓటు వేశారని అంచనా.

తన సొంతంగా మెజారిటసాధించలేకపోయినా మోడీ ఆధిపత్యాన్ని తిరిగి కొనసాగించేందుకు, మరింత బలోపేతం కావడానికి యత్నిస్తూనే ఉంటాడు.. హిందూత్వ నిరంకుశవాద ధోరణులను, హిందూత్వ–కార్పొరేట్ బంధాన్ని బలోపేతం చేసే ప్రయత్నాల పట్ల ఇండియా బ్లాక్ పక్షాలు సదా అప్రమత్తంగా వుంటూ వాటిని తీవ్రంగా ప్రతిఘటించాలి. ఓడించాలి. లౌకిక ప్రజాస్వామ్యాన్ని, ప్రజల జీవనోపాధులను, ఆర్థిక సార్వభౌమాధికారాన్ని, సామాజిక న్యాయాన్ని, సమాఖ్యవాదాన్ని పరిరక్షించాలి. ఫాసిస్ట్ పద్ధతులు ఉపయోగిస్తున్న హిందూత్వ నిరంకుశవాదానికి వ్యతిరేకంగా రాబోయే రోజుల్లో పోరాటాన్ని బలోపేతం చేయాలి. పార్లమెంట్ లోపల, వెలుపల ఇది జరగాలి.

వామపక్షాల పనితీరు

ఈ లోక్‌సభ ఎన్నికల్లో వామపక్షాలు కాస్త మెరుగుపడ్డాయి. గతసారి వామపక్షాలకు 5 స్థానాలు ఉండగా ఈ సారి ఆ బలం 8కి పెరిగింది. వీటిలో సిపిఎం నాలుగు స్థానాలు, సిపిఐ రెండు, సిపిఎం(ఎంఎల్) చెరో రెండు స్థానాలు గెలుచుకున్నాయి. సిపిఎం పనితీరు పట్ల ముఖ్యంగా కేరళలో ఫలితాలపై పొలిట్‌బ్యూరో అసంతృప్తిని వ్యక్తం చేసింది. ఆయా రాష్ట్ర పార్టీ శాఖల సమీక్షల ప్రాతిపదికన పార్టీ కూలంకషంగా సమీక్ష జరుపుతుంది.

నీట్ పరీక్ష

నీట్ పరీక్ష నిర్వహణలో అనేక అక్రమాలు, అవకతవకలు చోటుచేసుకున్నట్లు అనేక ఫిర్యాదులొచ్చాయి. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టిఎ) ఈ పరీక్షల నిర్వహణా బాధ్యతలు చేపట్టింది. విద్యను ఉమ్మడి జాబితాలో మన రాజ్యాంగం పెట్టింది. కానీ విద్యను ఇలా కేంద్రీకృతం చేయడమనేది మన రాజ్యాంగ స్ఫూర్తికి పూర్తి విరుద్ధం. రాష్ట్ర ప్రభుత్వాలను ఇలా పూర్తిగా పక్కనబెట్టడమనేది ఎంతమాత్రమూ ఆమోదయోగ్యం కాదు. ఇటీవల నిర్వహించిన నీట్ పరీక్షకు సంబంధించిన అంశాల్లో సరైన దర్యాప్తు జరగాలని సిపిఎం పొలిట్‌బ్యూరో డిమాండ్ చేసింది.

ఫ్రెంచ్ పార్లమెంటు రద్దు

- జూన్, జులైలో ఎన్నికలు : మాక్రాన్ ప్రకటన

పారిస్ : ఫ్రాన్స్ పార్లమెంట్‌ను రద్దు చేసి తిరిగి తాజాగా ఎన్నికలకు వెళ్తున్నట్లు ఫ్రాన్స్ అధ్యక్షుడు ఎమ్మాన్యుయెల్ మాక్రాన్ సోమవారం ప్రకటించారు. ఇయు పార్లమెంటు ఎన్నికల్లో మారిన్ లీపెన్స్‌కి చెందిన మితవాద నేషనల్ ర్యాలీ (ఆర్‌ఎన్) పార్టీ చేతిలో మాక్రాన్ పార్టీ ఓటమి పాలవడంతో ఆయన ఈ నిర్ణయం తీసుకున్నారు. ఆదివారం వచ్చిన యురోపియన్ పార్లమెంట్ ఫలితాలు తమ ప్రభుత్వానికి చాలా నిరాశపరిచాయని, వాటిని ఎంత మాత్రమూ నిర్లక్ష్యం చేయకూడదని తాము భావిస్తున్నట్లు చెప్పారు. జాతినుద్దేశించి ఆయన ప్రసంగిస్తూ, జూన్ 30న దిగువ సభ ఎన్నికలు జరుగుతాయని, జులై 7న రెండో రౌండ్ ఓటింగ్ జరుగుతుందని తెలిపారు. వివరణ ఇవ్వడానికి ఇది చాలా కీలకమైన సమయమని ఆయన వ్యాఖ్యానించారు. మీ ఆందోళనలన్నింటినీ విన్నాను, వాటిని సమాధానం చెప్పకుండా వదిలిపెట్టబోనని చెప్పారు. సామరస్యతతో వ్యవహరించడాలంటే ఫ్రాన్స్‌కు స్పష్టమైన మెజారిటీ అవసరమని అన్నారు. మితవాదపార్టీలు మొత్తంగా అన్ని చోట్లా ముందంజలో వుంటున్నాయని, ఈ పరిస్థితి కారణంగానే తాను రాజీనామా చేయడం లేదన్నారు. మొదటి ఎగ్జిట్ పోల్స్ ప్రకారం లీ పెన్స్ నేషనల్ ర్యాలీ పార్టీ 32శాతం ఓట్లను గెలుచుకుంది. సోషలిస్టులు 14శాతంతో వున్నారు. లీపెన్స్ బలంగా ఎదుగుతుండడం వల్ల అధికారంపై మాక్రాన్ పట్టు బలహీనమవుతుందని భావిస్తున్నారు. దిగ్భ్రాంతి కలిగించే రీతిలో మాక్రాన్ ప్రకటన వెలువడిన వెంటనే లీపెన్ మాట్లాడుతూ, రాబోయే జాతీయ ఎన్నికల్లో ప్రజలు తమపై విశ్వాసముంచితే తాము అధికారం చేపట్టడానికి సిద్ధంగా వున్నామని చెప్పారు.

మళ్లీ పాతప్లాను...!

(మొదటి పేజీ తరువాయి)

మార్చేశారు. తక్కువ ధరకు ఇళ్లు ఇచ్చే పేరుతో ఆర్5 జోన్ ఏర్పాటు చేశారు. దీనికోసం 2020 మార్చి నాలుగోతేదీన డ్రాఫ్ట్ నోటిఫికేషన్ ఇచ్చారు. అదే నెల 10వ తేదీన గెజిట్ కూడా విడుదల చేశారు. నిడమర్రు, కృష్ణాయపాలెం, వెంకటపాలెం, మందడం, నవులూరు, బేతపూడి, కురగల్లు రెవెన్యూ పరిధిలో 900.97 ఎకరాలను ఆర్5 జోన్లోకి మారుస్తున్నట్లు నోటిఫికేషన్లో పేర్కొన్నారు. దానికి అనుగుణంగా మార్పులు చేర్పులు ప్రక్రియ ముగించేశారు. ఈ క్రమంలో వ్యక్తమైన అభ్యంతరాలను పట్టించుకోలేదు. దీనిపై రైతులు కోర్టును ఆశ్రయించారు. తాము ఇచ్చిన భూముల్లో చేపడతామన్న మాస్టర్‌ప్లానుకు విరుద్ధంగా ప్లానులో మార్పులు చేర్పులు చేస్తున్నారని పిటీషన్ దాఖలు చేశారు. దీనిపై విచారించిన కోర్టు తొలుత ప్లానులో మార్పులు ఆపమన్నా అనంతరం ఇళ్లస్థలాలకు అనుమతి ఇచ్చి తుదితీర్పునకు లోబడి నిర్ణయం ఉండాలని తెలిపింది.

సిక్కిం సిఎంగా ప్రేమ్ సింగ్ తమాంగ్ ప్రమాణస్వీకారం



గ్యాంగ్‌టక్ : సిక్కిం ముఖ్యమంత్రిగా వరసగా రెండోసారి ప్రేమ్‌సింగ్ తమాంగ్ సోమవారం ప్రమాణస్వీకారం చేశారు. సిక్కిం క్రాంతికారి మోర్చా (ఎస్‌కెఎం) అధినేత ప్రేమ్ సింగ్ చేత ముఖ్యమంత్రిగా గవర్నర్ లక్ష్మణ్‌ప్రసాద ఆచార్య ప్రమాణస్వీకారం చేయించారు. ఈ కార్యక్రమం పాల్‌జోర్ స్టేడియంలో అట్టహాసంగా జరిగింది. ముఖ్యమంత్రితో పాటు 11 మంది మంత్రులు కూడా ప్రమాణస్వీకారం చేశారు. ఈ కార్యక్రమానికి వేల సంఖ్యలో ఎస్‌కెఎం కార్యకర్తలు, మద్దతుదారులు హాజరయ్యారు. ప్రమాణస్వీకార కార్యక్రమం సందర్భంగా పెద్ద ఎత్తున బాణసంచా కాల్చారు. సిక్కింలో బాణసంచా కాల్చడంపై నిషేధం ఉన్నా ఎస్‌కెఎం కార్యకర్తలు కాల్చారు. ఇటీవల జరిగిన సిక్కిం అసెంబ్లీ ఎన్నికల్లో ఎస్‌కెఎం మొత్తం 32 స్థానాల్లో 31 స్థానాలను గెలుచుకుని వరసగా రెండోసారి అధికారంలోకి వచ్చిన సంగతి తెలిసిందే. మంత్రులుగా ప్రమాణస్వీకారం చేసిన వారిలో సోనమ్ లామా, అరుణ్ కుమార్ ఉప్రెటి, సాండుప్ లెప్చ, భీమ్ హంగ్ లింబూ, భోజ్‌రాజ్ రాయి, జిటి ధుంగెల్, పురన్ కుమార్ గురుంగ్, పింత్సో నాంగ్యాల్ లెప్చ, నార్ బహదూర్ దహల్, రాజు బస్నెట్, థేండుప్ భూటియా ఉన్నారు.

రైసీ చేరుకున్న ఎన్‌ఐఎ బృందం

శ్రీనగర్ : జమ్ముకాశ్మీర్‌లోని రైసీ జిల్లాలో బస్సుపై ఉగ్రదాడి జరిగిన ప్రాంతానికి ఎన్‌ఐఎ బృందం సోమవారం చేరుకుంది. స్థానిక పోలీసుల సమన్వయంతో విచారణ ప్రారంభించింది. మరోవైపు భద్రతా దళాలు భారీ ఎత్తున తనిఖీ కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయి. కాత్రాలోని మాతో వైష్ణోదేవి ఆలయం నుంచి శివఖోరి మందిరానికి వెళుతున్న బస్సుపై ఆదివారం రైసీ జిల్లాలో ఉగ్రవాదులు దాడి జరపడంతో బస్సు లోయలోకి దూసుకెళ్లిన సంగతి తెలిసిందే. ఈ బస్సులో ఉత్తరప్రదేశ్, రాజస్థాన్, ఢిల్లీకి చెందిన యాత్రికులు ఉన్నారు. ఈ దాడిలో రాజస్థాన్‌కు చెందిన రెండేళ్ల చిన్నారి, ఉత్తరప్రదేశ్‌కు చెందిన 14 ఏళ్ల బాలుడితో సహా తొమ్మిది మంది మరణించారు. 41 మంది గాయపడ్డారు. వీరిలో 10 మంది తుపాకీ కాల్పుల్లో గాయపడ్డారు.

వేసవి విడిది

చదువే ప్రధానం



రాము ఐదో తరగతి చదువుతున్నాడు. ఒకరోజు రాము స్కూలు నుంచి ఇంటికి వస్తూనే అమ్మ చేతిలో గుప్పెడు చాక్‌పీస్‌లు పోశాడు. వాటిని చూస్తూనే రాము వాళ్ల అమ్మ గట్టిగా కోప్పడింది. 'నీకు ఇవి ఎవరిచ్చారు?' అని ప్రశ్నించింది. దానికి రాము 'క్లాసుకు వచ్చే ఉపాధ్యాయులు బోర్డు మీద పాఠాలు చెప్పిన తరువాత మిగిలిన చాక్‌పీస్‌లని అక్కడే వదిలేసి వెళ్తార'ని చెప్పాడు. ఉపాధ్యాయులు ప్రతిరోజూ చాక్ పీసులు వదిలేయటం, మా స్నేహితులు పరిగెత్తికెళ్లి వాటిని తీసుకోవటం రోజూ జరుగుతుంది అమ్మా! నేను ఎంత ప్రయత్నించినా ఒక్క చాక్ పీసు కూడా ఇప్పటి వరకు దొరకలేదు. నా స్నేహితులే రోజూ తీసుకుంటున్నారు. ఈ రోజే నాకు దొరికాయి. వాటిని తీసుకుని ఎంతో సంతోషంగా ఇంటికి వస్తే.. నువ్వేమో ఇలా తిడుతున్నావు' అని బుంగమూతి పెట్టాడు.

'చూడు రాము, ఇదేదో గొప్ప ఘనకార్యం అనుకున్నావా! నువ్వు చేసింది మంచి పని కాదు. చాక్ పీసులు సాధించడం గొప్ప కాదు. మంచి మార్కులు సాధించి ఉన్నతంగా నిలవాలి. స్కూలుకి, తల్లిదండ్రులకు మంచిపేరు తేవాలి. చాక్ పీసుల మీద చూపించే శ్రద్ధ పాఠాలపై చూపించాలి. పిల్లలు చదువులో పోటీపడాలి కానీ చాక్ పీసులు సంపాదించటంలో కాదు' అని తల్లి రాముకి అర్థమయ్యేలా చెప్పింది.

తల్లి మాటలకు రాము ఆలోచనలో పడ్డాడు. 'అమ్మా! నువ్వు చెప్పింది నిజమే. నేను తప్పు చేశాను. మరెప్పుడూ చాక్ పీసులు పట్టుకురాను. చదువుపై దృష్టి పెడతాను. శ్రద్ధగా చదువుకుని మంచి మార్కులు తెచ్చుకుంటాను. ఈ విషయం నా స్నేహితులకు కూడా చెబుతాను. వాళ్లల్లో కూడా మార్పు తెస్తాను' అన్నాడు.

- తమ్మవరపు వెంకట సాయి సుచిత్ర.
9492309100.

వర్షం కురిసింది!



మేఘం ఉరిమింది
వర్షం కురిసింది
పుడమి నవ్వింది
ఆహ్లాదం పండింది

వాగు వంక నిండింది
చల్లదనం నింపింది
చెట్టుచేమ మురిసింది
పచ్చదనం పరిచింది

చల్లని గాలి వీచింది
హాయిదనం తెచ్చింది
వ్యవసాయం సాగింది
రైతు పంట పండింది

వాన జోరుగా కురిసింది
కొలనులో మీనం గెంతింది

చిన్నారి కేరింత కొట్టింది
హర్షం మదిలో నిండింది

నదులను నీళ్లతో నింపింది
విద్యుత్ కాంతులు వెదజల్లింది
ప్రకృతికి అందం తెచ్చింది
అందరికీ ఉపాధినిచ్చింది!

– మొర్రి గోపి,
88978 82202.

బొమ్మరిల్లు





కుమ్మరి నవ్య,
డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ సిఓఇ గురుకులం,
అప్పలరాజుపురం, చీడికాడ మండలం.
విశాఖపట్నం.






ఉప్పాడ జై దేవ్,
2వ తరగతి,
రైల్వే న్యూ కాలనీ,
విశాఖపట్నం.





దేవాన్స్ సఫేర్,
4వ తరగతి,
శ్రీ వాణీ ప్రైమరీ స్కూల్,
ఆదోని, కర్నూలు జిల్లా.





టి.లావణ్య హరి చందన,
6వ తరగతి, జెడ్‌పి హైస్కూల్, వెంట్రప్రగడ,
కృష్ణాజిల్లా.

జీవన the family

JEEVANA

జీవన సౌరభం

తన ఆలోచనలను ఇతరులతో పంచుకోవడం, ఎదుటివాళ్ల మాటకు విలువివ్వడం అలవరచుకొంటే జీవితంలో ఉన్నత స్థానానికి చేరుకోవచ్చు.

రాయి కాదు.. 'రత్న'ం.. ఎక్కడైనా మెరుస్తుంది..



సూపరింటెండ్ ఆఫ్ పోలీస్ రోహిత్ రాజు అభినందిస్తున్న సందర్భంగా..



మీ అమ్మ ఏం చేస్తోంది? అని ఎవరైనా అడిగితే, 'మా అమ్మ వంట చేస్తుంది. చదువుతుంది. లా అండ్ ఆర్డర్ కాపాడుతుంది. ఆటలు ఆడుతుంది. పరుగులు పెడుతుంది. బాక్సింగ్ చేస్తుంది. పతకాలు సాధిస్తుంది' అని చెప్పే పిల్లలు ఎంతమంది ఇళ్లల్లో ఉన్నారు? తెలంగాణ, ఖమ్మం జిల్లా కొత్తగూడెంలో ఇన్ని పనులు చేసే మహిళ ఉన్నారు. రెండేళ్ల బిడ్డకు తల్లిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్న బుర్రి రత్నకుమారి, మధిర మండలం కృష్ణాపురం త్రీ టౌన్ పోలీస్ స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. పగలంతా పోలీసు డ్యూటీలో నిమగ్నమైనా, నెలల బిడ్డకు తల్లైనా, ఇల్లాలిగా తీరిక లేని సమయమున్నా, తనకిష్టమైన క్రీడల్లో ఆమె రాణిస్తున్నారు. ఇల్లాలిగా, తల్లిగా, ఉద్యోగినిగా, క్రీడాకారిణిగా, విద్యార్థిగా బహుముఖ ప్రజ్ఞతో రాణిస్తున్న రత్నకుమారి ఎందరో తల్లులకు ఆదర్శం. మరెందరో గృహిణులకు స్ఫూర్తి.

రత్నకుమారి తండ్రి చిన్నతనంలోనే చనిపోయారు. సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో ఆమె విద్యాభ్యాసం కొనసాగింది. ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్‌లో ఇంజినీరింగ్ చదివింది. సబ్–ఇన్‌స్పెక్టర్ కావాలని కలలుగంది. రెండుసార్లు ప్రయత్నించి విఫలమైంది. అయినా వెనుకంజ వేయకుండా కానిస్టేబుల్ పోస్టును సంపాదించి, అందులోనే తన లక్ష్యాన్ని చేరుకోవాలని ఆశ పడుతోంది. బాల్యం నుండి క్రీడల పట్ల ఆసక్తి ఉన్న రత్నకుమారి, ఎప్పటికైనా ఒలింపిక్స్‌లో పతకం తేవాలని లక్ష్యం పెట్టుకున్నారు. పోలీసు విధుల్లో ఉంటూనే పలు క్రీడా పోటీల్లో పాల్గొంటూ తన సత్తా చాటుతున్నారు.

తాజాగా 2024 మే 21 నుండి మాస్టర్స్ గేమ్స్ ఫెడరేషన్ నిర్వహించిన 100 మీటర్లు, 400 మీటర్ల హర్డిల్స్ పరుగు పోటీల్లో పాల్గొని బంగారు పతకం సాధించారు. అంతకుముందు జరిగిన వివిధ జాతీయ స్థాయి పోటీల్లో రజతం, బంగారు పతకాలు కూడా ఆమె ఖాతాలో ఉన్నాయి. ఒక్క పరగు పందెంలోనే కాదు, బాక్సింగ్‌లో కూడా ఆమె రాణిస్తున్నారు. ప్రస్తుతం జాతీయస్థాయి బాక్సింగ్ పోటీకి సిద్ధమవుతున్నారు. ఈ రోజు (జూన్ 11) న్యూఢిల్లీలో పోలీసు శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జాతీయ స్థాయి బాక్సింగ్ పోటీల్లో పాల్గొనబోతున్నారు.

రత్నకుమారి భర్త శ్రీకాంత్ ఓ ప్రైవేట్ సంస్థలో పనిచేస్తున్నారు. 'నా భర్త, బంధువులు ప్రోత్సాహం లేకుండా నేను ఈ విజయాలు సొంతం చేసుకోలేను. విధుల్లో ఉన్నప్పుడు, పోటీలకు వెళ్లినప్పుడు పాప బాధ్యత మొత్తం శ్రీకాంత్ చూసుకుంటారు. అతని సహకారం లేకుండా నేను ఇదంతా సాధించలేను' అంటూ తన విజయం వెనుక కుటుంబ సభ్యుల సహకారం గురించి ఆమె చెబుతున్నారు.


'ఒలింపిక్ పతకం గెలవడం, సబ్ ఇన్‌స్పెక్టర్‌గా ఎంపికవడం నా ముందున్న లక్ష్యాలు. వాటిని సాధించేవరకు వెనుదిరగను' అంటున్న రత్నకుమారి తల్లి కరోనా సమయంలో మరణించారు. తల్లిదండ్రులు లేకపోయినా, అత్తింటి సహకారం, భర్త ప్రోద్బలంతో ఆమె ఈ విజయ పరంపర కొనసాగిస్తున్నారు. ప్రతి మహిళకూ ఇలాంటి సహకారం, ప్రోత్సాహం ఉండాలి. అప్పుడే ఆమె, వంటింటి నుండి విభిన్న రంగాల్లో అడుగు పెడుతుంది. అనితర సాధ్యాలను సుసాధ్యం చేస్తుంది. ఎందరో మహిళల్లో గొప్ప స్ఫూర్తిని నింపుతోన్న రత్నకుమారికి ఈ సందర్భంగా హేట్సాప్ చెప్పకుండా ఉండలేం..

జ్ఞాపకశక్తి ఇలా మెరుగుపరుచుకోండి..



వయసుతో సంబంధం లేకుండా చిన్నా, పెద్దల్లో జ్ఞాపకశక్తి తగ్గుతోందని అందరికీ తెలిసిందే. అయితే ఈ మధ్య కాలంలో ఈ మతిమరుపు సమస్య యువతలో కూడా బాగా కనిపిస్తోంది. దీని నుండి బయటపడాలంటే, కొన్ని రకాల ఆహార పదార్థాలను మన రోజువారీ ఆహారంలో భాగం చేసుకోవాలి.

- ప్రతిరోజూ బాదం, వాల్‌నట్ లేదా జీడిపప్పు తీసుకుంటే జ్ఞాపకశక్తి మెరుగ్గా ఉంటుంది.
- క్యాబేజీ, ఉల్లిపాయలు, బ్రోకలీ వంటి కూరగాయలను రోజువారీ ఆహారంలో భాగం చేసుకోవాలి. వాటిల్లో ఫ్లేవనాయిడ్లు ఉంటాయి. ఇవి జ్ఞాపకశక్తిని పెంచడంలో సహాయపడతాయి.
- పాలు, పెరుగు, కొవ్వు చేపలు, చిక్కుళ్ళు, బీన్స్, గుమ్మడి గింజలు, గోధుమలు, బార్లీ, వోట్స్ మొదలైన మెగ్నీషియం అధికంగా ఉండే ఆహారాలు తీసుకోవడం వల్ల కూడా జ్ఞాపకశక్తి మెరుగుపడుతుంది.
- మొలకలు, బచ్చలికూర, క్యారెట్లు, చిలగడదుంపలు మొదలైన కూరగాయలను తీసుకోవడంతో పాటు పచ్చి కూరగాయలను ఆహారంలో ఎక్కువగా చేర్చుకోవాలి.
- గుడ్డు సొనలు, తృణధాన్యాలు, సోయాబీన్స్, నువ్వుల గింజలు లెసిథిన్ అనే పోషకాన్ని కలిగి ఉంటాయి. ఇది జ్ఞాపకశక్తిని, మెదడు పనితీరును మెరుగుపరచడంలో బాగా సహాయపడుతుంది.
- విటమిన్ బి12 పుష్కలంగా ఉండే గుడ్లు, చికెన్, చేపలు, పాలు వంటి ఆహారాలను తీసుకోవడం వల్ల రోగనిరోధక శక్తి, అలాగే జ్ఞాపకశక్తి పెంచడంలో సహాయపడతాయి.
- నిమ్మ, నారింజ, ఉసిరి, క్యాప్సికం, ఆకు కూరలు వంటి విటమిన్ సి అధికంగా ఉండే సిట్రస్ పండ్లు, కూరగాయలను తీసుకోవడం వల్ల మెదడు పనితీరు మెరుగుపడుతుంది.
- బాదం, వాల్‌నట్‌లు, జీడిపప్పు, అత్తి పండ్లు, గింజలు వంటి విటమిన్– ఇ అధికంగా ఉండే ఆహారాన్ని తినడం వల్ల కూడా జ్ఞాపకశక్తి మెరుగ్గా ఉంటుంది.



త్వరలో 'లాక్‌డౌన్' విడుదల

హీరోయిన్ అనుపమా పరమేశ్వరన్ ప్రధాన పాత్రలో నటించిన చిత్రం 'లాక్‌డౌన్'. ఏఆర్ జీవాను దర్శకుడిగా పరిచయం చేస్తూ లైకా ప్రొడక్షన్స్ నిర్మించింది. టీజర్‌ను మేకర్స్ విడుదల చేశారు. ఈ నెలలోనే ఈ సినిమా విడుదల కానుంది. లాక్‌డౌన్‌లో చిక్కుకుపోయి కష్టాలు పడుతున్న ఓ యువతి నేపథ్యంలో ఈ సినిమా ఉంటుందట. కరోనా వైరస్ గురించిన అంశాలను ఈ సినిమాలో కాస్త సీరియస్‌గానే చూపిస్తారనే టాక్ కోలీవుడ్‌లో వినిపిస్తోంది. చార్లీ, నిరోషా, ప్రియా వెంకట్, లివింగ్‌స్టన్, ఇందుమతి, రాజ్‌కుమార్ కీలక పాత్రల్లో నటించారు. ఎస్ఆర్ రఘునందన్, సిద్ధార్థ్ విపిన్ సంగీతం అందించారు. కెమెరా: వీజే సాబు జోసెఫ్.

శ్రీశ్రీశ్రీ రాజా వారు సెన్సార్ పూర్తి

జూనియర్ ఎన్టీఆర్ బావమరిది నార్నె నితిన్, సంపద హీరో హీరోయిన్లుగా సతీష్ వేగేశ్న దర్శకత్వంలో తెరకెక్కుతున్న యాక్షన్ ఎంటర్ టైనర్ శ్రీ శ్రీ శ్రీ రాజా వారు. ఇటీవలే సెన్సార్ కార్యక్రమాలు పూర్తి చేసుకుంది. శ్రీ వేధాక్షర మూవీస్ పతాకంపై నార్నె నితిన్, సంపద హీరో హీరోయిన్లుగా శతమానంభవతి సినిమాను తీసిన విషయం తెలిసిందే.

బాలకృష్ణ-బాబీ కొత్త సినిమా గ్లింప్స్ విడుదల



నందమూరి బాలకృష్ణ–డైరెక్టర్ బాబీ కాంబినేషన్‌లో ఎన్‌బికె 109 పేరుతో ఒక సినిమా తెరకెక్కుతున్న విషయం తెలిసిందే. తాజాగా ఆ ప్రాజెక్ట్ నుంచి బాలయ్య బర్త్‌డే గ్లింప్స్‌ను మేకర్స్ విడుదల చేశారు. శ్రీకర స్టూడియోస్ సమర్పణలో సితార ఎంటర్టైన్మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ బ్యానర్స్ నుంచి నాగవంశీ, సౌజన్య ఈ ప్రాజెక్ట్‌ను నిర్మిస్తున్నారు. ఈ సినిమాలో బాలీవుడ్ స్టార్ బాబీ డియోల్ విలన్‌గా నటిస్తున్నారు. మ్యూజిక్ డైరెక్టర్ తమన్. గతేడాది చిరంజీవి వాల్తేరు వీరయ్య చిత్రంతో డైరెక్టర్ బాబీ హిట్ కొట్టిన విషయం తెలిసిందే. ఈ సినిమాలో స్పెషల్ సాంగ్‌లో మెరిసిన ఊర్వశి రౌటేలాకు బాబీ మరో ఛాన్స్ ఇచ్చారనేది సమాచారం. చాందిని చౌదరి కూడా ఇందులో కీలక పాత్రలో నటిస్తున్నారు.

కొత్త డైరెక్టర్లకు 'ఆర్‌జివి డెన్' పిలుపు



టాలీవుడ్ డైరెక్టర్ రామ్ గోపాల్ వర్మ కొన్నేళ్ల క్రితం హైదరాబాద్‌లో ఆర్‌జివి డెన్‌ను నిర్మించారు. అక్కడి నుంచే సినిమా కార్యక్రమాలను ఆయన చూస్తూ ఉంటారు. అయితే కొద్దిరోజుల క్రితం ఆయన డెన్ నుంచి ఒక ప్రకటన వచ్చిన విషయం తెలిసిందే. సినిమా ఇండస్ట్రీలో అడుగుపెట్టాలని చాలామందికి కోరిక ఉంటుంది. ఆసక్తి ఉన్న డైరెక్టర్స్, రైటర్స్, మ్యూజిక్ కంపోజర్స్ కావాలంటూ వర్మ ట్వీట్ ద్వారా తెలిపారు. అయితే తాజాగా వర్మ తన డెన్‌లోకి అడుగుబెట్టబోయే వారి లిస్ట్‌ను ప్రకటించారు. డైరెక్టర్స్‌గా వర్మ డెన్‌లో అడుగుబెట్టాలని 419 మంది తన వెబ్‌సైట్ (https://rgvden.com) ద్వారా నమోదు చేసుకుంటే అందులో 11 మందిని సెలక్ట్ చేసి వారి పేర్లను వెబ్‌సైట్‌లో పొందుపర్చారు. వీరందరూ ఈనెల 14న హైదరాబాద్‌లోని ప్రసాద్ ల్యాబ్స్‌కు రావాలని రామ్‌గోపాల్ వర్మ పేర్కొన్నారు. ఇదే క్రమంలో మ్యూజిక్ డైరెక్టర్లుగా 9మంది ఎంపిక య్యారని తెలిపారు. వీరిలో ఒక్కరు మాత్రమే ఫైనల్ అవుతారని, వారిని కూడా ఎలా ఎంపిక చేస్తారనేది వెబ్‌సైట్‌లో వివరించారు. వర్మ డెన్‌కు ఎంపిక అయిన వారందరీ ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలను కూడా వారి పేరు పక్కన చేర్చడం విశేషం. వివరాల కోసం ఈ వెబ్‌సైట్‌లో https://rgvden.com లో చూడాలని కోరారు.

మహరాజ్ మాయ

బంగ్లాదేశ్‌పై దక్షిణాఫ్రికా సంచలన విజయం



న్యూయార్క్: లో స్కోరింగ్ మ్యాచ్‌లకు కేరాఫ్ అయిన న్యూయార్క్ పిచ్‌పై మరో సంచలనం నమోదైంది. దక్షిణాఫ్రికా జట్టు నిర్దేశించిన 114పరుగుల లక్ష్యాన్ని ఛేదించలేక బంగ్లాదేశ్ జట్టు ఓటమిపాలైంది. చివరి ఓవర్లో 11 పరుగులు చేస్తే బంగ్లాదేశ్‌దే విజయం కాగా.. కేశవ్ మహరాజ్ వేసిన బౌలింగ్‌లో 6పరుగులే రాబట్టి ఓటమిపాలైంది. తొలిగా బ్యాటింగ్‌కు దిగిన దక్షిణాఫ్రికా జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 6వికెట్ల నష్టానికి 113పరుగులు చేయగా.. ఛేదనలో బంగ్లాదేశ్ జట్టు 20 ఓవర్లు పూర్తయ్యేసరికి 7వికెట్లు కోల్పోయి 109పరుగులే చేసింది. ఈ గెలుపుతో దక్షిణాఫ్రికా జట్టు గ్రూప్–సిలో వరుసగా మూడో విజయాన్ని సొంతం చేసుకొని 6పాయింట్లతో టాప్‌లో నిలిచింది. టాస్ గెలిచిన దక్షిణాఫ్రికా బ్యాటింగ్ ఎంచుకొని పెద్ద తప్పిదమే చేసింది. బౌన్స్‌కు సహకరిస్తున్న పిచ్‌పై సఫారీ జట్టు తొలి నాలుగు వికెట్లను 23పరుగులకే కోల్పోయింది. ఓపెనర్ రీజా హెండ్రిక్స్(0)ను ఎల్బీగా వెనక్కి పంపిన షకిబ్.. మరో ఓపెనర్ క్వింటన్ డికాక్(18)ను బౌల్డ్ చేసి సఫారీ జట్టుకు పెద్ద షాకిచ్చాడు. 19 పరుగులకే రెండు వికెట్లు కోల్పోయిన దక్షిణాఫ్రికాను తస్కిన్ దెబ్బకొట్టాడు. కెప్టెన్ ఎడెన్ మర్కరమ్(4)ను బౌల్డ్ చేశాడు. ట్రిస్టన్ స్టబ్స్(0) సైతం ఔట్ కావడంతో దక్షిణాఫ్రికా పీకల్లోతు కష్టాల్లో పడింది. ఆ తర్వాత డేవిడ్ మిల్లర్‌కు జతగా హెన్రిచ్ క్లాసెన్ వచ్చి వీరిద్దరూ వికెట్ల పతనాన్ని అడ్డుకున్నా.. భారీ షాట్స్ కొట్టడంలో విఫలమయ్యారు. క్రీజ్‌లో కుదురుకున్నాక భారీ షాట్లు ఆడి జట్టు స్కోర్ 100 దాటించారు. అయితే.. తస్కిన్ అహ్మద్ ఓవర్లో డేంజరస్ క్లాసెన్.. రిషద్ బౌలింగ్‌లో మిల్లర్ బౌల్డ్ కావడంతో సఫారీ జట్టు 113కే పరిమితమైంది. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ క్లాసెన్‌కు దక్కింది.

స్కోర్‌బోర్డు..

దక్షిణాఫ్రికా ఇన్నింగ్స్: డికాక్ (బి)తంజుమ్ హొసైన్ 18, హెండ్రిక్స్ (ఎల్‌బి)తంజుమ్ హొసైన్ 0, మార్క్రమ్ (బి)తస్కిన్ అహ్మద్ 4, స్టబ్స్ (సి)షకీబ్ (బి)తంజుమ్ హొసైన్ 0, క్లాసెన్ (బి)తస్కిన్ అహ్మద్ 46, డేవిడ్ మిల్లర్ (బి)రిషద్ హొసైన్ 29, జాన్సన్ (నాటౌట్) 5, మహరాజ్ (నాటౌట్) 4, అదనం 7. (20 ఓవర్లలో 6వికెట్ల నష్టానికి) 113పరుగులు. **వికెట్ల పతనం:** 1/11, 2/19, 3/23, 4/23, 5/102, 6/106 **బౌలింగ్:** తంజిమ్ హొసైన్ 4–0–18–3, తస్కిన్ అహ్మద్ 4–0–19–2, ముస్తాఫిజుర్ 4–0–18–0, రిషద్ హొసైన్ 4–0–32–1, షకీబ్ 1–0–6–0, మహ్మదుల్లా 3–0–17–0

బంగ్లాదేశ్ ఇన్నింగ్స్: తంజిద్ హసన్ (సి)డికాక్ (బి)రబడా 9, నజ్ముల్ హొసైన్ (సి)మార్క్రమ్ (బి)నోర్జే 14, లింటన్ దాస్ (సి)డేవిడ్ మిల్లర్ (సి)మహరాజ్ 9, షకీబ్ (సి)మార్క్రమ్ (బి)నోర్జే 3, తౌహిద్ హ్రిదయ్ (ఎల్‌బి)రబడా 37, మహ్మదుల్లా (సి)మార్క్రమ్ (బి)మహరాజ్ 20, జాకెర్ అలీ (సి)మార్క్రమ్ (బి)మహరాజ్ 8, రోషద్ హొసైన్ (నాటౌట్) 0, తస్కిన్ అహ్మద్ (నాటౌట్) 1, అదనం 8. (20 ఓవర్లలో 7వికెట్ల నష్టానికి) 109పరుగులు. **వికెట్ల పతనం:** 1/9, 2/29, 3/37, 4/50, 5/94, 6/107, 7/108 **బౌలింగ్:** జాన్సెన్ 4–0–17–0, రబడా 4–0–19–2, బార్ట్‌మన్ 4–0–27–0, మహరాజ్ 4–0–27–3, నోర్జే 4–0–17–2.

ఆ గెలుపు చిరస్మరణీయం

- **పాకిస్తాన్‌పై విజయంతో టాప్‌లోకి టీమిండియా**
- **బుమ్రాను పొగడ్తలతో ముంచెత్తిన కెప్టెన్ రోహిత్ శర్మ**



న్యూయార్క్: పాకిస్తాన్‌పై గెలుపు చిరస్మరణీయమని టీమిండియా కెప్టెన్ రోహిత్ శర్మ అభిప్రాయపడ్డాడు. లో–స్కోరింగ్ గేమ్‌లో పటిష్ట పాకిస్తాన్‌పై గెలుపు బౌలర్లకే దక్కుతుందన్నాడు. ముఖ్యంగా పేస్ గుర్రం జస్ప్రీత్ బుమ్రాను పొగడ్తలతో ముంచెత్తాడు. అతడు టీమిండియా గెలుపుల్లో కీలకపాత్ర పోషిస్తున్నాడన్నాడు. పాకిస్తాన్‌తో ఆదివారం జరిగిన లో–స్కోరింగ్ మ్యాచ్‌లో టీమిండియా ఆరు పరుగుల తేడాతో సంచలన విజయం సాధించిన సంగతి తెలిసిందే. అనంతరం కెప్టెన్ రోహిత్ శర్మ మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశాడు. పాకిస్తాన్‌పై (4–0–14–3) అద్భుత బౌలింగ్‌తో చెలరేగిన బుమ్రా.. ఐర్లాండ్ (3–0–6–2) ఉత్తమ బౌలింగ్ గణాంకాలు నమోదు చేశాడని ఈ సందర్భంగా రోహిత్ గుర్తు చేసుకున్నాడు. పాకిస్తాన్‌కు నిర్దేశించిన 120పరుగుల లక్ష్యాన్ని కాపాడుకొనే క్రమంలో తొలుత కెప్టెన్ బాబర్ అజామ్(13)ను అద్భుత బంతికి ఔట్ చేశాడని, ఆ తర్వాత క్రీజ్‌లో నిలదొక్కుకొని పరుగులు రాబట్టుతున్న రిజ్వాన్(31)ను బౌల్డ్ చేసి మ్యాచ్ స్వరూపాన్ని మార్చేశాడని అన్నాడు. ఇక చివర్లో ఇఫ్తికార్ అహ్మద్(5)ను ఔట్ చేయడం ద్వారా పాకిస్తాన్ విజయాన్ని భారత్‌వైపు తిప్పాడని కెప్టెన్ రోహిత్ శర్మ పొగడ్తలతో బుమ్రాను ముంచెత్తాడు. పాక్‌పై సంచలన విజయంలో కీలకపాత్ర పోషించిన బుమ్రా ఓ రికార్డును తన ఖాతాలో వేసుకున్నాడు. అంతర్జాతీయ టి20ల్లో అత్యధిక వికెట్లు తీసిన రెండో భారత బౌలర్‌గా నిలిచాడు. బుమ్రా టి20ల్లో 64మ్యాచుల్లో 79వికెట్లు తీశాడు. ఇక టీమిండియా స్పిన్నర్ యుజ్వేంద్ర చాహల్ 80 మ్యాచుల్లో 96 వికెట్లతో అగ్రస్థానంలో ఉన్నాడు. ఆ తర్వాత హార్దిక్ 78 వికెట్లతో మూడోస్థానంలో కొనసాగుతున్నాడు. నసావు కౌంటీ స్టేడియంలో ఆదివారం పాకిస్తాన్‌పై తొలిగా బ్యాటింగ్‌కు దిగిన టీమిండియా కేవలం 119పరుగులకే కుప్పకూలగా.. స్వల్ప లక్ష్య ఛేదనకు దిగిన పాక్‌ను 20 ఓవర్లలో 7వికెట్ల నష్టానికి 113 పరుగులే పరిమితం చేసిన సంగతి తెలిసిందే.



పాక్ ఓటమితో కన్నీళ్లు పెట్టుకుంటున్న నసీమ్ షా

ఆ విజయం చిరస్మరణీయం: బుమ్రా

పాకిస్థాన్‌పై విజయం అనంతరం చిరస్మరణీయమని పేస్ గుర్రం జస్ప్రీత్ బుమ్రా తెలిపాడు. తక్కువ స్కోరును కాపాడుకోవడం చాలా ఆనందంగా ఉంది. వర్షంతో బంతి ఎలా తిరుగుతుందో ముందు అర్థం కాలేదు. నెమ్మదిగా ఎండ రావడంతో పిచ్ నుంచి మరింత సహకారం లభించింది. బౌలర్లందరూ క్రమశిక్షణతో బౌలింగ్ చేశారు. పేస్‌తో పాటు వైవిధ్యంగా బంతులేస్తే ఫలితం అనుకూలంగా ఉంటుంది. భారత్‌కు మద్దతు ఇచ్చేందుకు వచ్చిన ప్రేక్షకులకు ధన్యవాదాలు. అదే మాకు స్ఫూర్తినిచ్చింది. రాబోయే మ్యాచుల్లోనూ గెలిచి సూపర్–8కు చేరతాం అని బుమ్రా తెలిపాడు.

పాకిస్థాన్‌కు కష్టమే..

అమెరికా, భారత్ చేతిలో ఓటమితో పాకిస్తాన్ జట్టు సూపర్–8కు చేరడం సంక్లిష్టంగా మారింది. ఈ గ్రూప్‌లో ఉన్న ఆతిథ్య అమెరికా జట్టు వరుసగా రెండు విజయాలతో 2వ స్థానంలో కొనసాగడుతుండగా.. భారతజట్టు మెరుగైన రన్‌రేట్‌తో గ్రూప్–ఎలో టాప్‌లో కొనసాగుతోంది. ఇక పాకిస్తాన్, కెనడాలను ఓడించి అమెరికా సూపర్–8 దిశగా పయనిస్తుండగా.. మరోవైపు పాకిస్తాన్ జట్టు వరుసగా రెండు మ్యాచుల్లో ఓటమితో ఆ ఆశలను సంక్లిష్టం చేసుకుంది. చివరి రెండు మ్యాచుల్లోనూ పాకిస్తాన్ గెలిచినా.. ఇతర జట్ల ఫలితాలపై ఆధారపడాల్సిన పరిస్థితి. ఈ గ్రూప్‌లో భారత్, పాకిస్థాన్, అమెరికా, ఐర్లాండ్, కెనడా జట్లు ఉండగా.. టాప్–2లో నిలిచిన జట్లు సూపర్–8కు చేరనున్నాయి.

సుమిత్ నాగల్‌కు ఒలింపిక్ బెర్త్

కెరీర్ బెస్ట్ ర్యాంక్.. టాప్‌లో సిన్నర్

లండన్: భారత టెన్నిస్ సంచలనం సుమిత్ నాగల్ రికార్డు నెలకొల్పాడు. పారిస్ ఒలింపిక్స్‌కు పురుషుల సింగిల్స్‌కు నేరుగా అర్హతసాధించాడు. అంతర్జాతీయ టెన్నిస్ సమాఖ్య (ఎటిపి) సోమవారం ప్రకటించిన తాజా ర్యాంకింగ్స్‌లో సుమిత్ 77వ ర్యాంక్‌కు ఎగబాకాడు. దీంతో పారిస్ ఒలింపిక్స్‌కు డైరెక్ట్ ఎంట్రీ లభించింది. జర్మనీ వేదికగా జరుగుతున్న నెకర్‌కప్–2024లో ఆదివారం స్విట్జర్లాండ్‌కు చెందిన రిచ్‌హ్యాండ్‌ను ఓడించడంతో అతని ర్యాంక్ మెరుగైంది. హోరాహోరీగా సాగిన ఆ పోరులో సుమిత్ 6–1, 6–7(5–7), 6–3తో ఓడించాడు. దీంతో అతని ఖాతాలో 713 పాయింట్లు జమ అయ్యాయి. ఇక ఫ్రెంచ్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టోర్నీ రన్నరప్ జెన్నిక్ సిన్నర్(ఇటలీ) అగ్రస్థానంలో నిలిచాడు. అతడు 9525పాయింట్లతో టాప్‌లో నిలిచాడు. దీంతో ఇటలీ తరపున ఏటిపి ర్యాంకింగ్స్‌లో అగ్రస్థానంలో నిలిచిన తొలి ఆటగాడిగా సిన్నర్ రికార్డుపుటల్లోకెక్కాడు. ఇక ఫ్రెంచ్ ఓపెన్ టైటిల్ విజేత కార్లోస్ అల్కరాజ్(స్పెయిన్; 8580పాయింట్లు), నొవాక్ జకోవిచ్(సెర్బియా; 8360) టాప్–3లో ఉన్నారు.



ఫ్రెంచ్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టోర్నీ పురుషుల సింగిల్స్ టైటిల్‌ను స్పెయిన్ యువ సంచలనం, 3వ సీడ్ కార్లోస్ అల్కరాజ్ చేజిక్కించుకున్నాడు. ఫైనల్లో అల్కరాజ్ 6-3, 2-6, 5-7, 6-1, 6-2తో 4వ సీడ్ జ్వెరేవ్(జర్మనీ)ను చిత్తుచేశాడు.

ఒమన్‌పై గెలుపుతో

సూపర్-8 దిశగా స్కాట్లాండ్..



ఆంటిగ్వా: గ్రూప్–బి నుంచి స్కాట్లాండ్ జట్టు సూపర్–8 దిశగా పయనిస్తోంది. ఆదివారం రాత్రి ఒమన్‌తో జరిగిన మ్యాచ్‌లో స్కాట్లాండ్ జట్టు ఏడు వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. తొలిగా బ్యాటింగ్‌కు దిగిన ఒమన్ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 7వికెట్ల నష్టానికి 150పరుగులు చేయగా.. ఆ లక్ష్యాన్ని స్కాట్లాండ్ జట్టు 13.1ఓవర్లలో కేవలం 3వికెట్లు కోల్పోయి 153పరుగులు చేసి ఘన విజయం సాధించింది. స్కాట్లాండ్ బ్యాటర్ మెక్ ముల్లెన్(61నాటౌట్; 31బంతుల్లో) విధ్వంస ఇన్నింగ్స్‌తో చెలరేగాడు. అంతకుముందు ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ మెక్ ములానీకి లభించింది.

టి20 ప్రపంచకప్‌లో నేడు
పాకిస్తాన్ × కెనడా
వేదిక: న్యూయార్క్; రా. 8.00గం॥లకు

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68